అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 21-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 140 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

శతజయంతి వేడుకల్లో చంద్రబాబు డిమాండ్

- ఎన్టీఆర్ గొప్ప నాయకుడు :ఏచూరీ
- లెజెండరీ యాక్టర్:డి.రాజా
- నీతి, నిజాయితీ గలనాయకుడు ఎన్టీఆర్ : గవర్నర్ దత్తాత్రేయ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

యుగపురుషుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్య మంత్రి ఎన్.చంద్రబాబునాయుడు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అది వచ్చేవరకూ పోరాడు తూనే ఉంటామని స్పష్టంచేశారు. ఇది ఎన్టీఆర్ కోసం కాదనీ, దేశం కోసమని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదనీ, ఒక శక్తి అని చెప్పారు. ఆయన ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోతారని వివరించారు. శనివారం హైదరా బాద్‌లోని కేపీహెచ్‌బీలోని కైత్లాపూ ర్‌లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్‌కు ముందు, ఎన్టీఆర్ తర్వాత తెలుగుజాతి పరిస్థితిని నెమరువేసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్ జయం తిసభలు జరుగుతున్నాయనీ, ఇది ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఇది ...2లో



కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా, డి.కె శివకుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా అతిరథ మహారథుల సమక్షంలో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటు మరో 8 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రి పదవి దక్కడం విశేషం. అట్టహాసంగా సాగిన ప్రమాణస్వీకార మహోత్సవానికి బీజేపీయేతర పార్టీలు, లౌకిక ప్రజాతంత్ర నాయకులు హాజరవ్వడం విపక్షాల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

కన్నడనాట కాంగ్రెస్ ప్రభుత్వం

సీఎంగా సిద్ధరామయ్య • డిప్యూటీ సీఎంగా శివకుమార్ • మరో 8 మంది మంత్రుల ప్రమాణ స్వీకారం







హాజరైన ప్రతిపక్ష అతిరథ మహారథులు

బెంగళూరు : కర్నాటక 24వ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ఎనిమిది మంది సీనియర్ కాంగ్రెస్ నేతలతో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఉత్సాహ పూరితంగా జరిగిన ఈ కార్యక్రమానికి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, పలువురు జాతీయ ప్రతిపక్ష నేతలు హాజరయ్యారు. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో జి పరమేశ్వర్, కెహెచ్ మునియప్ప, కేజే జార్జ్, ప్రియాంక్ ఖర్గే, ...5లో

ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రముఖులు

అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, సీపీఐ (ఎం) నేత సీతారాం ఏచూరి, సీపీఐ నేత డి రాజా, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తి, సీపీఐ నేత డీ రాజా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, తమిళ నటుడు కమల్ హసన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌లతోపాటు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అశోక్‌గెహ్లాట్, భూపేశ్ భాగేల్, సుఖ్వీందర్‌సింగ్ సుఖు తదితరులు హాజరయ్యారు.

ఇది విద్వేషంపై విజయం : రాహుల్

కాంగ్రెస్ పార్టీ అవినీతి రహిత ప్రభుత్వాన్ని అందిస్తుందని ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం రాహుల్ గాంధీ చెప్పారు. 'మేం 5 వాగ్దానాలు చేశాం.. 2 గంటల్లో అమలు చేస్తాం. నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. పేదలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులకు బాసటగా నిలవడం వల్లే కాంగ్రెస్ గెలుపు సాకారమైంది. కర్నాటకలో విద్వేష మార్కెట్‌లు మూతబడి.. లక్షలాది ప్రేమ దుకాణాలు తెరుచుకున్నాయి. కాంగ్రెస్ గెలిచిన తర్వాత.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలా గెలుపొందింది అని చాలా విషయాలు రాశారు. భిన్నమైన విశ్లేషణలు జరిగాయి.. పేదలు, దళితులు, ఆదివాసీలకు వెన్నంటే ఉన్నందున కాంగ్రెస్ గెలిచింది' అని రాహుల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు 5 ప్రధాన హామీలు ఇచ్చిందని రాహుల్ గుర్తు చేశారు. 'మేము ఎప్పుడూ తప్పుడు హామీలు ఇవ్వం. ఏది చెప్పామో అదే చేస్తాం. మరో ఒకటి రెండు గంటల్లోనే క్యాబినెట్ తొలి సమావేశం జరుగుతుంది. ఆ సమావేశంలోనే ప్రజలకు ఇచ్చిన 5 హామీలకు చట్టబద్ధత కల్పిస్తాం' అని తెలిపారు. డబ్బు, అధికారం, పోలీసుల అండ ఉన్న బీజేపీని ప్రజలు ఓడించారని తెలిపారు.

సమాజ పునర్జీవనం జరగాలి

సమాజ మార్పునకు సాంస్కృతిక రంగం కీలకం

- సెల్‌ఫోన్లు పక్కనబెట్టండి..పిల్లలకు విలువలు నేర్పండి
- పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే
- సరళ జీవితాన్ని అలవాటు చేసుకోవాలి
- సుందరయ్య స్ఫూర్తితో ముందుకెళ్లాం
- గచ్చిబౌలి ఎస్వీకేలో సుందరయ్య 38వ వర్ధంతిలో బీవీ రాఘవులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో సమాజ పునర్జీవనం జరగాల్సిన అవసరం ఉందనీ, సమాజ మార్పుకు సాంస్కృతిక రంగమే కీలకమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం(గచ్చిబౌలి) ట్రస్టు చైర్మెన్ బీవీ.రాఘవులు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఎస్వీకేలో సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీకే ఇన్‌చార్జి పి.ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వం వహించారని చెప్పారు. సమాజ సేవకు ఆటంకం అవుతుందనే ఉద్దేశంతో సుందరయ్య దంపతులు పిల్లలు వద్దని నిర్ణయించుకున్నారని కొనియాడారు. అన్ని అంశాలపైనా ఆయనకు పట్టు ఉండేదనీ, ఆయన షర్టుకున్న పెద్ద జేబులోనే ప్రపంచ సమాచారం ఉండేదని చెప్పారు. కొత్త అంశాలేమైనా ఉంటే జేబులో నుంచి పేపర్ తీసి నోట్ చేసుకునేవారని గుర్తుచేశారు. ఆయన సామాజిక దృక్పథం, ఎంచుకున్న సిద్ధాంతం, నిరాడంబరతే ఆయన్ను గొప్ప నేతగా నిలబెట్టాయని ...2లో



ఆరోగ్య-వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభం

కేరళలో ప్రజారోగ్య రంగానికి మరింత ఊతం

- ఇదే నిజమైన కేరళ స్టోరీ : ఎల్‌డీఎఫ్



కొచ్చి : అధికారాన్ని చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాష్ట్రంలో 5,409 ఆరోగ్య-వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించి ంది. ఆరోగ్య సేవలను కింది స్థాయి వరకూ విస్తరించడం ఈ కేంద్రాల లక్ష్యం. 'ఈ కేంద్రాల్లో వివిధ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. గర్భిణులకు అవసరమైన మందులు, సలహాలు ఇస్తారు. శారీరక ...5లో

సుప్రీంను అవమానించిన కేంద్రం

- 'ఢిల్లీ ఆర్డినెన్స్'ను సవాలు చేస్తాం : అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ : అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై ఢిల్లీ ప్రభుత్వానికి ఉన్న అధికారాలను తగ్గిస్తూ కేంద్రం తెచ్చిన కొత్త ఆర్డినెన్స్‌పై ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్డినెన్స్‌ను తమ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేస్తుందని చెప్పారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ...5లో

విధ్వంసం సృష్టిస్తున్న మోడీ

వచ్చే ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టాలి

- వ్యవసాయ కూలీలకు కూలీబంధు పెట్టాలి
- హన్మకొండలో వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



వివరాలు 5లో..

బుల్‌డోజర్‌కు హృదయం ఉండదు...

మన భయమే దాని బలం

- నేడు అది జాతీయ వ్యాధిగా మారింది
- మతోన్మాదులకు భవిష్యత్తు లేదు
- కె శ్రీనివాస్ 'బుల్‌డోజర్ సందర్భాలు' పుస్తకావిష్కరణలో సినీ నటుడు ప్రకాష్ రాజ్



వివరాలు 5లో..

అనాలోచిత నిర్ణయం

మరోసారి ఇబ్బందులు తప్పవా ?

- ఒంటెత్తు పోకడలతో ముందుకు పోతున్న కేంద్రం

న్యూఢిల్లీ : రెండు వేల రూపాయల నోటును చలామణి నుండి వెనక్కి తీసుకుంటున్నామని రిజర్వ్‌బ్యాంక్ ఆకస్మికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ 2018 మార్చి 31 నాటికి రూ. 6.73 లక్షల కోట్లు (మొత్తం నోట్లలో 37.3%) ఉండగా ఈ సంవత్సరం మార్చి 31 నాటికి రూ. 3.62 లక్షల కోట్లకు (మొత్తం నోట్లలో 10.8%) తగ్గిందని ఆర్‌బీఐ చెబుతోంది. చలామణిలో ఇతర నోట్లు అందుబాటులో ఉన్నందున రూ. 2000 నోట్ల లక్ష్యం నెరవేరిందని కూడా అంటోంది. రూ. 2000 నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకోవడానికి సెప్టెంబర్ 30 వరకూ గడువు ఇచ్చింది. అయితే నగదు ఆధారిత లావాదేవీలు జరిపే వ్యక్తులు లేదా సంస్థల వద్ద ఈ నోట్లు పెద్ద సంఖ్యలో ఉంటాయి. దేశంలోని అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ వేతనాల చెల్లింపుల కోసం నగదు పైనే ఆధారపడుతున్నారు.

ఇప్పుడు అలాంటి వ్యక్తులు, సంస్థలు తమ వద్ద ఉన్న రూ. 2000 నోట్లను మార్చుకోవడానికి 130 రోజుల సమయం ఉంది. అయితే ఆర్‌బీఐ చెబుతున్న దాని ప్రకారం ఒకసారికి కేవలం రూ. 20,000ల విలువైన నోట్లను మార్చుకునే అవకాశం మాత్రమే ఉంది. దీనిని బట్టి పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరిపే వ్యక్తులు, సంస్థలు మార్పిడి కోసం మరోసారి రోజుల తరబడి బ్యాంకుల ముందు నిరీక్షించక తప్పని పరిస్థితి. తమ వద్ద పెద్ద మొత్తంలో ఉన్న నోట్లను మార్చుకోవాలంటే వీరు కొందరిని నియమించుకొని గతంలోలా బ్యాంకుల ముందు నిలబెట్టాల్సి వస్తుంది. రియల్ ఎస్టేట్ లేదా ఆస్తికి సంబంధించిన లావాదేవీలు జరిపే వారు కూడా తమ వ్యాపారాన్ని నగదు రూపంలోనే నిర్వహిస్తుంటారు. రోజువారీ వ్యాపారంలో యాభై శాతం నగదు పైన ఆధారపడే ఇలాంటి వారు ఆర్‌బీఐ నిర్ణయంతో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిర్మాణ రంగంలోనూ ఇదే పరిస్థితి. ఉద్యోగాలు లేక, పెట్టుబడులు సరిగా లభించక ఆర్థిక వ్యవస్థ గాడి తప్పుతున్న పరిస్థితులలో ఇలాంటి నిర్ణయం ఏ విధంగా దేశానికి మేలు చేస్తుందో పాలకులే చెప్పాలి.

ఒకేసారి రూ. 20,000ల విలువైన నోట్లకు మించి మార్చుకోరాదన్న నిబంధన కొందరు వ్యక్తులు, సంస్థలు, ప్రతిపక్ష నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకోవడానికి దోహదపడుతుంది. పైకి చూడడానికి ఈ నిర్ణయం ఆర్‌బీఐ తీసుకున్న ఓ చిన్న ద్రవ్య విధాన చర్యగా మాత్రమే కన్పించినా దాని సమయం, రాజకీయ-ఆర్థిక ప్రభావాల దృష్టితో చూడాల్సి ఉంటుంది. అంతేకాదు... కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం పొందిన కొద్ది రోజుల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారన్న వాస్తవాన్ని కూడా గుర్తించాలి. పెట్టుబడిదారులు ఆందోళనకు గురి కాకుండా శుక్రవారం స్టాక్ మార్కెట్ పనిగంటలు ముగిసిన తర్వాతే ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థపై ఈ ...5లో



తప్పుడు నిర్ణయాన్ని కప్పిపుచ్చేందుకే

రెండు వేల నోటు ఉపసంహరణపై ప్రతిపక్షాల మండిపాటు 5లో..

- నిష్పాక్షిక విచారణకు డిమాండ్

పెద్ద నోట్ల రద్దుపై వచ్చిన ఆరోపణలు

రుజువయ్యాయి!

2వేల నోటు ఉపసంహరణపై సీపీఐ(ఎం) విమర్శ

న్యూఢిల్లీ : చలామణిలో నుంచి రూ.2వేల నోట్లను ఆర్‌బీఐ ఉపసంహరించుకుంది. దేశం ఎదుర్కొంటున్న నల్ల ధనం, అవినీతి, తీవ్రవాద కార్యకలాపాలకు నిధులు అందచేయడం వంటి సమస్యలకు పరిష్కారంగా, డిజిటల్ చెల్లింపులను పెంపొందించడానికి మోడీ ఆర్భాటంగా 2016లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దును వాస్తవంగా ఈ చర్య తిప్పికొట్టిందని సీపీఐ(ఎం) దృఢంగా విశ్వసిస్తున్నట్టు పార్టీ పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. అన్ని రంగాల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పైగా, గత అనుభవాల రీత్యా చూసినట్లైతే, 2 వేల నోట్లతో పేరుకుపోయిన నల్ల ధనం నిల్వలను ప్రక్షాళన చేయడం కన్నా ఈ చర్య వాటిని మరింత చట్టబద్ధం చేసిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మోడీ చేపట్టిన పెద్ద నోట్ల రద్దు చర్యతో కోట్లాదిమంది ప్రజల జీవనోపాధులను దారుణంగా దెబ్బతీసింది. వందలాదిమంది జీవితాలను బలి తీసుకుంది. ప్రధానంగా ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించే, జీడీపీ వృద్ధిరేటుకు దోహదపడే ...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు వంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. సినిమాల్లో ఆయన పాత్రలు ఇతరులు ఎవరూ చేయలేరని చెప్పారు. భవిష్యత్‌లోనూ అది జరగదనీ, మళ్లీ ఆయనే పుట్టాలని వివరించారు. దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది గొప్ప చరిత్ర అని అన్నారు. తెలుగుజాతి కోసమే టీడీపీని స్థాపించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడానికి సంకల్పం చేసినందుకు ఉత్సవాల నిర్వహణ కమిటీని అభినందించారు. అమెరికాలో 20వ భాషగా తెలుగుకు గుర్తింపు రావడం ఎన్టీఆరే కారణమని వివరించారు. రాజమండ్రిలో జరిగే మహానాడు అందరూ రావాలని కోరారు. ఈనెల 22న తెలుగు రాష్ట్రాల్లోని అందరి ఇండ్లల్లో ఎన్టీఆర్ ఫోటోలు పెట్టుకుని నివాళులు అర్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్టీఆర్ గొప్ప నాయకుడు
రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాడు
సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

దేశంలో ఎన్టీఆర్ గొప్ప రాజకీయనాయకుడని సీపీఐ(ఎం)జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. 1983లో టీడీపీని అధికారంలోకి తెచ్చిన ఘనత ఆయనదని చెప్పారు. అప్పుడు నేను విద్యార్థిగా ఉన్నానని అన్నారు. నేషనల్ ఫ్రంట్ ఛైర్మెన్‌గా ఆయన పనిచేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన చరిత్ర ఉందన్నారు. ఆయన పోరాటాల మూలంగా సర్కారీయ కమిషన్ వేశారని గుర్తు చేశారు. నటుడిగానేగాక రాజకీయ నాయకుడిగా ప్రమాణాలతో పనిచేశారని అభిప్రాయ పడ్డారు.

లెజెండరీ యాక్టర్:డి.రాజా

ఎన్టీఆర్ లెజెండరీ యాక్టర్ అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా చెప్పారు. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన నటించిన 'కర్ణన్' సినిమా చూశానని చెప్పారు. రూ. 2కే కిలో బియ్యం పథకాన్ని తెచ్చిన చరిత్ర ఆయనదని వివరించారు. ఎంతో శ్రమపడితేగానీ యుగపురుషుడు అనిపించుకోలేరని వ్యాఖ్యానించారు.

నీతి, నిజాయితీ గలనాయకుడు ఎన్టీఆర్: గవర్నర్ దత్తాత్రేయ

నీతి, నిజాయితీకి మారుపేరు ఎన్టీఆర్ అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ, సమయపాలన ఆయన సొంతమని చెప్పారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో శతృత్వం పనికిరాదన్నారు. భేదాభిప్రాయాలు ఉండటం సహజమేనని చెప్పారు. రాజకీయాలు ప్రజల కోసమేనని ఎన్టీఆర్ తరచూ చెప్పేవారని వివరించారు.

ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు:పురంధేశ్వరి

యుగపురుషుడు ఎన్టీఆర్‌తోనే తెలుగుజాతికి గుర్తింపు వచ్చిందని మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. రాజకీయాల్లో చెరగని ముద్రను వేశారని గుర్తు చేశారు. పరిపాలన వ్యవస్థను ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. బియ్యం పథకం, ప్రాజెక్టులను సైతం నిర్మించారని వివరించారు.

రిజర్వేషన్లకు అధ్యుడు ఎన్టీఆర్: కాసాని

బీసీలకు రిజర్వేషన్లకు తెచ్చిన మహానాయుడుఎన్టీఆర్ అని టీడీపీ తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున పార్టీని స్థాపించారని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేశాడని చెప్పారు.కేవలం తొమ్మిది నెలల్లో పార్టీని అధికారంలోకి తెచ్చాడని వివరించారు.

జీరో కరెప్షన్‌తో ప్రభుత్వాన్ని నడిపారు. చంద్రబాబ విజన్, ఎన్టీఆర్ దార్శనికత తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగిందన్నారు. ఐటీ పార్కులు, అంతర్జాతీయ విమానాశ్రయం, స్టేడియాలు చంద్రబాబు తోనే వచ్చాయని వివరించారు. సూర్యచంద్రులున్నంత కాలం ప్రజలు గుర్తు చేసుకుంటారని చెప్పారు.

బాలయ్య...

వేదికపై అటూ, ఇటూ తిరుగుతూ నందమూరి బాలకృష్ణ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఎన్టీఆర్ గురించి అనేక విషయాలు చెప్పారు. ఎన్టీఆర్ అందరికి ఆదర్శం. కారణజన్ముడు. సమస్యల పరిష్కారంలో నిలబడ్డాడని ఎన్టీఆర్ గురించి చెప్పారు.

ఇలా..

ఎన్టీఆర్ శతజయంతి వేడుకలకు భారీ జనం హాజరయ్యారు. ప్రత్యేక కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. హైదరాబాద్‌లోని కేపిహెచ్‌బీ కైత్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయా రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులు వచ్చారు. భారీ వేదికను ఏర్పాటు చేశారు. ఇరువైపులా ఎన్టీఆర్ కటౌట్లు కనిపించాయి. ఎన్టీఆర్‌తో కలిసి నటించిన జయసుధ, జయప్రద, ప్రభ తదితర హిరోయిన్లకు సన్మానం చేశారు. ఎన్టీఆర్‌కు భారతరత్న బిరుదు ఇవ్వాలని మురళీమోహన్ డిమాండ్ చేశారు.

శక పురుషుడు పుస్తకాన్ని బండారు దత్తాత్రేయ, జైఎన్టీఆర్ వెబ్‌సైట్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడిన వారిలో సినీ ప్రముఖులు దగ్గుబాటి వెంకటేశ్, రాంచరణ్, సుమంత్, నాగచైతన్య, ఆర్.నారాయణమూర్తి, జయప్రద, జయసుధ, ప్రభ, అడివి శేషు, శ్రీవీణ, అనిల్ రావిపూడి, విశ్వక్‌సేన్, అశ్వనీదత్, బోయపాటి శ్రీను తదితరులు ఉన్నారు. ఇకపోతే ప్రముఖ మళయాళ నటుడు మోహన్‌లాల్ పంపిన వీడియో సందేశాన్ని ప్రదర్శించారు.

మూడు వారాలపాటు ప్రజలతో మమేకమవుదాం..

- పల్లె నుంచి పట్నం దాకా దశాబ్ది ఉత్సవాలు...
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో జూన్ 2 నుంచి మూడు వారాలపాటు వివిధ రూపాల్లో ప్రజలతో మమేకం కావాలని సీఎం కేసీఆర్ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పిలుపునిచ్చారు. ప్రారంభ వేడుకలను రాష్ట్ర సచివాలయంలో ఘనంగా నిర్వహించాలనీ, సంబంధిత ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, కార్యాచరణ, సంబంధిత అంశాలపై శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేండ్ల రాష్ట్ర ప్రగతిని చాటుతూ పల్లె నుంచి పట్నం దాకా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఒకనాడు అనేక అవమానాలకు, అపోహలకు గురైన తెలంగాణ నేడు అద్భుతంగా వెలుగొందుతున్నదని తెలిపారు. అనేక రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని వివరించారు. ఈ క్రమంలో వ్యవసాయం, సంక్షేమం, సాగు, తాగునీరు, విద్య, వైద్యంతోపాటు ప్రతీ రంగంలో సాధించిన అభివృద్ధిని ప్రసార మాధ్యమాల ద్వారా జనానికి చేరవేయాలని ఆదేశించారు.

ఆటపాటల ద్వారా పండుగ వాతావరణంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రారంభ వేడుకల కోసం సచివాలయంలో స్టేజీ ఏర్పాటు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరణ, జాతీయ జెండాను ఎగరేయటం, పార్కింగ్ సౌకర్యం, అతిథులకు తేనీటి విందు తదితరాంశాలపై ఆయన ఉన్నతాధికారులతో చర్చించారు. వారికి పలు ఆదేశాలను జారీ చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది హోల్ సేల్ అవినీతి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ : దేశంలో బీజేపీ ప్రభుత్వం హోల్‌సేల్ గా అవినీతికి పాల్పడుతున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బీజేపీ రాబోయే ఎన్నికల కోసమే రూ.2000 నోట్ల చెలామణి నిలుపుదలకు ప్రణాళిక రచించిందన్నారు. శనివారం నాడిక్కడ నారాయణ మీడియాతో మాట్లాడారు. నిజంగానే మోడీ ప్రభుత్వానికి బ్లాక్ మనీని అంతం చేయాలని చిత్తశుద్ధి ఉంటే రూ.రెండు వేల నోట్లను వెంటనే రద్దు చేయాల్సి ఉండేదన్నారు. కార్పొరేట్ కంపెనీలు బ్లాక్ మనీ ఉన్నవాళ్లందరికీ సహాయం చేసేందుకే ముందస్తు ప్రణాళికకు మాత్రమే మోడీ ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించారు.

రూ.500, రూ.1,000 రద్దు సమయంలో కోట్ల నల్లధనం వైట్ మనీగా మారిందని విమర్శించారు. ప్రస్తుతానికి కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిజంగా మోడీ ప్రభుత్వానికి బ్లాక్ మనీ అంతం చేయాలని చిత్తశుద్ధి ఉంటే, మార్చుకునే అవకాశం ఇవ్వకుండా ఉండేదన్నారు. కుస్తీ వీరులు ఢిల్లీ రోడ్లపై కొచ్చి ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అంతర్జాతీయంగా క్రీడల్లో రాణించి పథకాలు సాధించిన మహిళల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కోటిన్నరకు చేరువలో కంటి పరీక్షలు....

- 21,29,865 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ : సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు కోటిన్నరకు దగ్గరలో ఉన్నాయి. ఈ మేరకు శనివారం సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక కోటి 49,11,072 మందికి పరీక్షలు పూర్తయినట్టు తెలిపారు. వీరిలో 21,29,865 మందికి ఉచితంగా రీడింగ్ గ్లాసెస్, ఔషధాలను పంపిణీ చేశారు.

70,09,827 మంది పురుషులకు, 78,91,704 మంది మహిళలకు కంటి పరీక్షలను చేశారు. జూన్ 15 వరకు కొనసాగనున్నట్టు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నివారించదగ్గ అంధత్వరహిత తెలంగాణ లక్ష్యంలో భాగస్వాములు కావాలని సూచించారు.

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణకు పితృ వియోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తండ్రి మామిడి సుదర్శన్ (86) శనివారం ఉదయం శాయంపేటలో మరణించారు. ఆయన రెండేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వరంగల్ ఆయుర్వేద కళాశాల నుంచి పట్టా పుచ్చుకున్న ఆయన ప్రజలకు విస్తృత వైద్య సేవలందించారు. సాహిత్య విశ్లేషకుడిగా, రాజకీయ సమీక్షకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన పెద్ద కుమారుడైన హరికృష్ణ ప్రస్తుతం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా పని చేస్తున్నారు.

సమాజ పునర్జీవనం జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. దుర్మార్గమైన నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రైతులకు పది లక్షల ఎకరాల భూమిని పంచి చరిత్రలో నిలిచిపోయిందనీ, అది దేశాన్నే ప్రభావితం చేసిన మహత్తరమైన పోరాటమని చెప్పారు. మన రాజ్యాంగంలో సోషలిజం అనే పదాన్ని చేర్చడానికి ఈ పోరాటమూ ఒక కారణమేనని చెప్పారు. తెలంగాణలో వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడటమే కాకుండా పాఠశాలలు పెట్టి తెలుగులో చదువు చెప్పిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు.

కలివిడిగా లేం.. విడివిడిగానే ఉంటున్నాం..

ఐక్యంగా కలిసి ఉంటేనే శక్తి పెరుగుతుందనే విషయాన్నే మనం మరిచిపోతున్నామనీ, దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కలివిడిగా కాకుండా విడివిడిగానే ఉంటున్న పరిస్థితి ఉందని రాఘవులు అన్నారు. ఆర్థిక విధానాల్లో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. ఆధునిక జీవన విధానం, పోటీ ప్రపంచం మనిషిని ఒంటరితనానికి అలవాటు చేస్తున్నదనీ, ఇది సమాజానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, తల్లిదండ్రులు ఎవరికి వారే ఒక్కొక్కరు ఒక్కో ఫోన్‌లో మునిగిపోతున్నారనీ, దీంతో కుటుంబంలోనూ ఒంటరితనమే కనిపిస్తున్నదని వాపోయారు. గతంలో విజ్ఞానాన్ని ఒకరి కొకరు పంచుకునేవారనీ, నేడు అది వ్యాపారమయం అయిందని చెప్పారు. మనుషుల మధ్య సహకారం పోయి పోటీ మాత్రమే మిలిగిందన్నారు. మనుషుల మధ్య ప్రేమలు, అప్యాయతలు కరువయ్యాయన్నారు. ఇలాంటి సమయంలో సాంస్కృతిక రంగంలో విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను మంచి విలువలతో పెంచాలని కోరారు. లేనిపక్షంలో సమాజానికి తీవ్ర నష్టం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అల్లరి చేయొద్దని పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చే పరిస్థితి నుంచి తల్లిదండ్రులు బయటపడాలని సూచించారు. సెల్‌ఫోన్లకు పిల్లలను అలవాటు చేసి సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆస్పత్రులు, సలహా కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితిని తెచ్చుకోవద్దని చెప్పారు.. స్థూలకాయత్వం పెరగడానికి సెల్‌ఫోన్లు కూడా ఒక కారణమేనని నొక్కి చెప్పారు. వాకింగ్‌కు కార్లలో పోయి అక్కడ పది నిమిషాలు నడిచి మళ్లీ కారు ఎక్కి వస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. సహజ వనరులను అవసరం మేరకే వాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఆధునిక జీవన పద్ధతులతో రాబోయే కాలంలో 1.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదముందనీ, ఎండలతో మనుషుల మరణాలు ఎక్కువయ్యే రోజులు రాబోతున్నాయని ఆందోళన వ్యక్త పరిచారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వీకే ట్రస్టు సభ్యులు ఆర్.సాంబశివరావు, శ్రీనివాస్, భూమిక వ్యవస్థాపకులు ఉదయభాను, ఎస్వీకే బాధ్యులు విజయ్, రవి, అనిల్, సీఐటీయూ నాయకులు శోభన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీకే సిబ్బందికి బట్టల పంపిణీ

ఎస్వీకేలో పనిచేసే సిబ్బందికి రాఘవులు తన చేతుల మీదుగా బట్టలను అందజేశారు. ప్రతిఒక్కరినీ ఆయన పలుకరించారు. ప్రతి ఏటా సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిబ్బందికి బట్టలను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్నది.

ఆకట్టుకున్న 'బరుబత్తల రాజు' నాటిక

ఈ సందర్భంగా భూమిక నాటక బృందం మంచి నాటకం ప్రదర్శించింది. ప్రస్తుత సమాజంలో అవసరం లేకున్నా ఇతరులను చూసి గొప్పలకు పోయి సామాన్యులు ఆర్థికంగా ఏవిధంగా చితికి పోతున్నారనే కాన్సెప్ట్‌తో ప్రదర్శించిన బరుబత్తల రాజు అనే హాస్యభరిత నాటిక అందర్నీ ఆకట్టుకున్నది. ఫ్యాషన్ షోలు, మాయాప్రపంచంలోని రంగురంగుల బట్టలను చూసి అవసరం ఉన్నా లేకున్నా ఒకే రోజు కోసం వేలు వేలు పెట్టి కొంటూ వనరులను ఏవిధంగా దుర్వినియోపరుస్తున్నామనే విషయం ఆలోచింపజేసింది. సహజవనరులు, ప్రకృతి విధ్వంసం జరుగుతున్న తీరును కండ్లకు కట్టినట్టు చూపెట్టారు.

జగదీష్ టైట్లర్‌పై సీబీఐ చార్జిషీట్

- 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో

కేంద్ర దర్యాప్తు సంస్థ తాజా చర్య

న్యూఢిల్లీ : 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ నాయకుడు జగదీష్ టైట్లర్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. "నవంబర్ 1, 1984న ఢిల్లీలోని బారా హిందూ రావ్‌లోని ఆజాద్ మార్కెట్‌లో గల గురుద్వారా పుల్ బంగాష్‌లో ఒక గుంపు నిప్పంటించడం, సర్దార్ ఠాకూర్ సింగ్, బాదల్ సింగ్, గురుచరణ్ సింగ్ అనే ముగ్గురు వ్యక్తులు నిప్పంటుకొని చనిపోయిన సంఘటనపై సీబీఐ 2005, నవంబర్22న కేసు నమోదు చేసింది" అని సీబీఐ ప్రతినిధి గుర్తు చేశారు. అక్టోబరు 31, 1984న అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీని ఆమె అంగరక్షకులు హత్య చేయడంతో ఢిల్లీలో పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగాయి. కొంతమంది కాంగ్రెస్ నాయకుల సహాయంతో ఆరోపిత మూకలు సిక్కులపై దాడి చేసి వారి ఇండ్లను తగులబెట్టాయి. ఒక్క ఢిల్లీలోనే దాదాపు 3,000 మంది సిక్కులు హతమయ్యారు. 1984 నవంబర్ 1న టైట్లర్ ఆ ప్రాంతంలోని దుకాణాలను తగలబెట్టడం, లూటీ చేయడంతో పాటు గురుద్వారాను తగలబెట్టి, ముగ్గురు సిక్కులను హతమార్చిన గుంపును ప్రేరేపించి, రెచ్చగొట్టి చంపినట్టు సీబీఐ దర్యాప్తులో తేలిందని సదరు సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రేపు టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు సోమవారం టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే హాజరుకానున్నారు. పీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మెన్లు, పీసీసీ సభ్యులు సమావేశంలో పాల్గొంటారు.

'నకిలీ విత్తన' బెడద తగ్గేనా?

ఖరీఫ్ సీజన్ ఆరంభంతో రైతుల్లో ఆందోళన

- ఏటా మార్కెట్లోకి విచ్చలవిడిగా నకి'లీల'లు
- టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహిస్తున్నా ఆగని దూప్లి'కేటుగాళ్ల' ఆగడాలు
- మంత్రివర్గ సమావేశంలోనూ చర్చ.. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు
- విత్తన కొనుగోలుపై నియంత్రణ ఎత్తివేత... కృత్రిమ కొరతకూ యత్నాలు

'విత్తు ముందా..? చెట్టు ముందా..?' అనే ప్రశ్నకు సమాధానం లభిస్తుందో.. లేదోకానీ 'విత్తు కన్నా నకిలీ ముందు' అనే విషయం మాత్రం ప్రతియేటా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు బహిర్గతమవుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా తనిఖీలు, పట్టుబడితే పీడీ యాక్టులు నమోదు చేస్తున్నా... దూప్లి'కేటుగాళ్ల' ఆగడాలకు అడ్డుకట్ట పడకపోవడంతో మరింత దృష్టి సారించాలని ఈ నెల 18వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది

నవతెలంగాణ-నిజామాబాద్, ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధులు

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ విత్తనాల బెడద రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. నైరుతి పలకరించగానే రైతాంగం ఒక్కసారిగా సాగులోకి వెళ్తుంది. దాంతో సీజన్ ఆరంభంలో కొంత విత్తన కొరత ఏర్పడుతోంది. ఇదే అదునుగా దళారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. నకిలీ విత్తన తయారీదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ, పోలీసుశాఖ అడపాదడపా చర్యలు చేపడుతున్నా కట్టడి కావడం లేదు. ప్రతి ఏటా కేసులు నమోదవుతున్నా చర్యలు ఉండటం లేదు. సాధారణంగా ప్రతి జిల్లాలో నకిలీ విత్తనాల గుర్తింపు కోసం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఈ ఆగడాలు ఆగడం లేదు. ఈ అంశంపై ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో తీవ్రంగానే చర్చించింది. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పీడీ యాక్టు పెట్టాలని ఆదేశించింది. అయితే ఇది ఎంతవరకు అమలవుతుంది. కేసులతోనే సరిపుచ్చుతారా, నకిలీలను అడ్డుకట్టు వేయగలుగుతారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

బురిడీ కొట్టిస్తున్న దళారులు

ఖరీఫ్ సీజన్‌లో నిజామాబాద్ జిల్లాలో మొత్తం 5,12,738 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశమున్నట్టు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో వరి 4,17,943 ఎకరాల్లో, సోయాబీన్ 58,798 ఎకరాల్లో, మొక్కజొన్న 32,542 ఎకరాల్లో సాగవనున్నట్టు ప్రాథమిక అంచనా వేశారు. వరి తరువాత అత్యధికంగా సోయాబీన్ పంట సాగవుతుంది. వరి, సోయాబీన్ పంటలకు ఎకరాకు 30 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. మొక్కజొన్న ఎకరాకు 8 కిలోల విత్తనాలు నాటుతారు. ఈ లెక్కన వరికి 1,25,382 క్వింటాళ్లు, సోయాకు 17,615 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయి. జిల్లాలో పెద్దఎత్తున విత్తన వినియోగం జరుగుతుండటంతో రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం 75 విత్తన కంపెనీలు, 568 విత్తన విక్రయ దుకాణాలు ఉన్నాయి. అయితే విత్తన కొనుగోలుపై నియంత్రణ లేక పోవడంతో రైతులు పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు కొను గోలు చేస్తున్నారని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఫలితంగా నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవడం ఇబ్బందిగా మారిందని అంటున్నారు.. లైసెన్స్ దుకాణాల్లో విత్తనాల కోసం ఎదురుచూస్తే పంట సాగు ఆలస్యమవు తుందనే ఉద్దేశంతో రైతులు తమ వద్దకు వచ్చిన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. దళారులు పంట దిగుబడి భారీగా వస్తుందని రైతులను నమ్మిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియతో అక్రమాలకు అడ్డుకట్ట

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి నకిలీ విత్తన నియంత్రణలో భాగంగా విత్తనాల ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలను ఆన్‌లైన్ చేసింది. ఈ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతోంది. ముగింపు దశలో ఉన్న ఈ ఆన్‌లైన్ ప్రక్రియ ఈ ఏడాది పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే మాసాల్లో అధికారులు డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది మే ముగింపు దశకు వచ్చినా పలు జిల్లాల్లో ఈ సమావేశాలు ఇంకా నిర్వహించకపోవడం గమనార్హం. ఖమ్మం జిల్లాలో వచ్చేవారం విత్తన డీలర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

సిద్ధమవుతున్న టాస్క్‌ఫోర్స్ టీంలు

జూన్ మొదటివారం విత్తనాలు నాటే సమయం కావడంతో రైతులు ముందుగానే విత్తనాలు కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో నకిలీల బారిన పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీంలను అందుబాటులోకి తెస్తోంది. ఈ టీంలో జిల్లా వ్యవసాయ అధికారితో పాటు తెలంగాణ విత్తన సీడ్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారి, ఇద్దరు ఏవోలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో మాట్లాడింది.


ధరలు, బ్లాక్ మార్కెట్‌పైనా దృష్టి

రాష్ట్రంలో వరి తర్వాత అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పత్తి విత్తనాల్లోనే నకిలీలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. మిరప విత్తనాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న విత్తనాల కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు చేపడుతున్నారు. నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలపైనా దృష్టి సారించారు. రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇక ఈ ఏడాది విత్తనాల ధరలు స్వల్పంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో అధిక ధరలకు విత్తనాలు అమ్మకుండా కూడా చర్యలు చేపడుతున్నారు.



విక్రయ దుకాణాల నుంచి శాంపిల్స్ సేకరణ

నిజామాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ప్రతియేటా విత్తన విక్రయ దుకాణాల నుంచి 450 శాంపిల్స్ సేకరించి టెస్టులకు పంపుతున్నామని చెబుతున్నారు. శాంపిల్స్‌లో విత్తన ప్రమాణాలు పాటించని కంపెనీలపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ లెక్కన మూడేండ్లలో జిల్లాలో 21 కేసులు నమోదు చేశారు. రెక్టిఫైడ్ మిస్టేక్స్ (సరిచేసుకునే తప్పులు) స్టాక్ ఎంట్రీ, విత్తన సోర్స్ సర్టిఫికేట్, ధరల పట్టిక లేకుంటే నోటీసులు ఇచ్చి 21 రోజుల్లో ఆయా తప్పులను సరి చేసుకోవాలని ఆదేశిస్తున్నారు. ఇక అన్‌రెక్టిఫైడ్ మిస్టేక్స్(సరిదిద్దలేని తప్పుల)కు కేసులు నమోదు చేస్తున్నారు.



నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు

నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతియేటా శాంపిల్స్ సేకరించి విత్తనాల నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తున్నాం. అందులో సరైన ప్రమాణాలు పాటించని విత్తనాలు ఉంటే వెంటనే కేసులు నమోదు చేస్తున్నాం. రైతులు లైసెన్స్ పొందిన విత్తన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.


నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్



నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్‌తో నిఘా

నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ టీం ద్వారా తనిఖీలు చేపడుతున్నాం. హైదరాబాద్ నుంచి కూడా టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో కూడా హైదరాబాద్ బృందం తనిఖీలు చేపడుతోంది.

విజయనిర్మల, ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారి



సత్యపాల్ తులికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నివాళి..

జి రఘుపాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాటానికి తన వంతు సాయాన్ని అందించిన సత్యపాల్ తులికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వీకే) బృందం శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సత్యపాల్‌తో సన్నిహితం గా మెలిగిన ఎస్వీకే మేనేజింగ్ కమిటీ సభ్యులు జి. రఘుపాల్ మాట్లాడుతూ డాక్టర్ తులి 1976 మే 20న హైదరాబాదులో మరణించారని తెలిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి పి.సి. జోషితో లెటర్ తీసుకొని వచ్చిన తులి.. అజ్ఞాతంలో గొర్లకాపరి వేషంలో ఉన్న సుందరయ్యను యాదగిరి గుట్ట సమీపంలో కలిసి ఆయన సలహామేరకు హైదరాబాదులో స్థిర పడ్డారని గుర్తుచేశారు.

ఉదయం పూట క్లినిక్ నడుపుతూ రాత్రివేళల్లో రహస్యంగా వెళ్లి సాయుధ పోరాట యోధులకు వైద్యం చేసేవారని తెలిపారు. క్లినిక్‌లో కూడా పైసా, రెండు



పైసలకు వచ్చే మందులు రాసేవారన్నారు. దీంతో ఆయనకు ఏక్ పైసా దో పైసా డాక్టర్‌గా పేరు స్థిర పడిందని వివరించారు. కమ్యూనిస్టు పార్టీ పెద్ద నాయకులే కాదు.. కాంగ్రెస్‌కు చెందిన నాయకులు కూడా వచ్చి వైద్యం చేయించుకునేవారని తెలిపారు. కండరాల జబ్బుతో సతమతమయినప్పటికీ చివరి దాకా ప్రజలకు వైద్యం అందించారన్నారు. నిలోఫర్ ఆస్పత్రి సూపరిండెం ట్‌గా పని చేసిన డాక్టర్ శ్యామలాంబ ఆయన శిష్యురాలని తెలిపారు. ఎంతో మంది ఆర్‌ఎంపీలు ఆయన దగ్గర శిక్షణ కోసం వచ్చేవారన్నారు. పూర్తి అంకిత భావంతో పంజాబ్ నుండి హైదరాబాదు కు వైద్యుడిగా దాదాపు మూడు దశాబ్దాలు ప్రజలకు తన సేవలందించారని గుర్తు చేశారు.

డాక్టర్ తులి వైద్యరంగంలో ఉన్న వారందరికీ ఆదర్శ ప్రాయుడని చెప్పారు. సమావేశానికి ఎస్‌ఏకె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ కుమార్ అధ్యక్షత వహించారు. వైద్యరంగంలో డాక్టర్ తులి నెలకొల్పిన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతోనే ఆయన పేర హైదరాబాద్‌లోని ఎస్వీకే దగ్గర మొదటి జనరిక్ మందుల షాపును ప్రారంభించామని చెప్పారు. క్రమంగా తెలంగాణలో జనరిక్ షాపులను ఎస్వీకే విస్తరిస్తోందని తెలిపారు. సిబ్బందితో పాటు కమిటీ సభ్యులు జి. బుచ్చిరెడ్డి ఎస్. సోమయ్య, భూపతి వెంకటేశ్వర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ఏక పక్ష చిల్లర నిర్ణయం

రెండువేల నోటు రద్దుపై దాసోజు ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని నరేంద్రమోడీ రూ.2000 నోటును రద్దు చేయడం ఏకపక్ష చిల్లర నిర్ణయమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. అసంబద్ధమైన, అశాస్త్రీయమైన నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. 2016లో నల్లధనాన్ని అరికట్టడంతోపాటు ఉగ్రవాదులను నియంత్రిస్తామనే కుంటి సాకుతో నోట్ల రద్దు చేశారని తెలిపారు. కానీ అది విధ్వంసం సృష్టించి 100 మందికి పైగా మరణాలకు కూడా కారణమైందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్పుడు మిస్టీరియస్‌గా రూ.1000 నోటు స్థానంలో రూ.2000 నోటును ప్రవేశపెట్టారని తెలిపారు. ఆరున్నర ఏండ్ల తర్వాత, రూ.2000 నోటును ఎందుకు ఉపసంహరించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి కీలక నిర్ణయం ప్రతిపక్ష పార్టీతోసహా వివిధ వాటాదా రులతో బహిరంగ చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయ పడ్డారు. మోడీ భారతదేశాన్ని తన వ్యక్తిగత ఆస్తిగా పరిగణిస్తున్నారని విమర్శించారు.

దక్షిణ, తూర్పు తెలంగాణకు వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాముంది. హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్షం పడే అవకాశం ఉంది. వరుసగా వారం నుంచి కొడుతున్న మండు టెండలు కాస్త తగ్గాయి. అయితే, వేడిగాలి మాత్రం అలాగే వీచింది.

ఎస్ఎంసీ కమిటీల గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల గడువు జూన్ ఒకటి నుంచి నవంబర్ 30 వరకు పొడిగించారు. ఈ మేరకు పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

స్థాన మార్పు కోసం అభ్యర్థనలు

సమగ్ర శిక్షా పరిధిలో మండల విద్యావనరుల కేంద్రంలో తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తూ ప్రస్తుత స్థానం నుంచి ఇతర స్థానాలకు మార్పు కోరుకునే వారు తమ అభ్యర్థనలను పెట్టుకోవాలని పాఠశాల విద్యా సంచాలకులు ఒక ప్రకటనలో కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఐఇఆర్పీలతో పాటు జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ అనలిస్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు తమ అభ్యర్థనలను ఈ నెల 23 నుంచి 25 వరకు ఐఎస్ఎంఎస్ పోర్టల్ పెట్టుకోవచ్చు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD

S.A No. 82 OF 2019

Between:
Jayashree Constructions ... Petitioner/Applicant
AND
State Bank of India & Ors ...Respondents/Respondents

To,
M/s Sushma Exim (India) Limited,
Having its registered office 55/B, Vahini Nagar, Gunrock, Secunderabad. ... Respondent No. 2

Please be informed that, the above named PETITIONER/APPLICANT have instituted an appeal against the State Bank of India and all the concern parties for giving of Sale Notice for e-auction of the property of the 2nd Respondent on 27.02.2019 by ignoring the claim of the Applicant and the said matter is posted on **14.07.2023** for your counter and appearance.
Therefore, make it convenient to present yourself either in person or through authorized agent or advocate if any concern with the litigation before the above-mentioned court at **10-30 A.M on 14.07.2023.** Otherwise, the matter will take its due course.

(BY ORDER OF THE COURT)
M.S. ACHYUTH BHARTHWAJ, Advocate
O/o. #3-6-111, Blue Chip Arcade, 3rd Floor, Opposite: TATA Motors Malik, Himayatnagar, Hyderabad 500029 Telangana.
(Counsel for Petitioner/Applicant)

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ కైలాష్ రాజేష్ తండ్రి కైలాస్ రాములు వయస్సు 41 సం॥, వృత్తి: వ్యాపారము, నివాసము: ఇంద్రానగర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా. వారు 1) శ్రీమతి జమీందార్ దానమ్మ భర్త కీ॥శే॥ జమీందార్ దానయ్య వయస్సు 58 సం॥, వృత్తి: గృహిణి, 2) జమీందార్ నర్సింహ్మా తండ్రి జమీందార్ దానయ్య వయస్సు: 45 సం॥, వృత్తి: వ్యాపారం, 3) జమీందార్ రాజు తండ్రి జమీందార్ దానయ్య వయస్సు: 38 సం॥, వృత్తి: వ్యాపారం, 4) జమీందార్ నాగరాజు తండ్రి జమీందార్ దానయ్య వయస్సు: 35 సం॥, వృత్తి వ్యాపారం. అందరి నివాసం, ఇ.నెం. 8-150ఎ, మధురానగర్ కాలనీ, శేరిలింగం పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా వారి యొక్క ఇంటి స్థలము, ప్లాట్ నెం. 175, (ఇంటి ప్రాపర్టీ), ఇంటి నెం. 8-150, స.నెం. 66/1, విస్తీర్ణం : 90:00 చదరపు గజాలు, (75.25 చదరపు మీటర్లు) మధురానగర్ కాలనీ, రాయదుర్గం, పన్మక్త గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా. హద్దులు: ఉత్తరం: పొరుగువారు, దక్షిణం: పొరుగువారు, తూర్పు: పొరుగువారు, పడమర: 25-0 రోడ్డు, ఇట్టి స్థలాన్ని నా క్లాయింట్ కొనుగోలు చేయుటకు ఒప్పందం చేయటం జరిగింది. సదరు స్థలానికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరం, టైటిల్, క్లెయిమ్, హక్కు లేదా ఎవరి వద్ద నుంచైనా రుణాలు పొందివున్నట్లయితే, దిగువ పేర్కొన్న చిరునామాలో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి ఏడు రోజుల్లో (7) సంబంధిత డాక్యుమెంట్లతో పాటు సంప్రదించాలని కోరడమైనది, ఒకవేళ పైన పేర్కొన్న గడువు ముగిసిన అనంతరం నా క్లయింట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతుంది. కావున సదరు ప్లాట్‌కు సంబంధించి ఎలాంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు వచ్చినా కూడా 7 రోజుల తర్వాత పరిగణనలోకి తీసుకోబడవని తెలియజేయనైనది.

హైదరాబాద్
21-05-2023

ఎస్. కుమార్
TS/2583/2015
అడ్వకేట్
మెస్సర్ విజన్ లా అసోసియేట్స్
ఇంటి నెం.1-8-732/11 & 12, 2వ అంతస్తు, మూన్ కేఫ్‌పైన, నల్లకుంట, హైదరాబాద్-500044. సెల్: 9959840803

KV Ranga Reddy Degree College for Women
I S Sadan Crossroads, Saidabad, Hyderabad, Telangana-500 059
Ph: 040-2453-3838 Website: www.kvrrdcw.ac.in

Applications are invited for the posts of:

1. **Lecturers in the following subjects:**
   1. Zoology, 2. Botany, 3. Chemistry, 4. Nutrition, 5. Microbiology, 6. Biotechnology, 7. Biochemistry, 8. Commerce, 9. Computer Science, 10. Physics, 11. Electronics, 12. Mathematics, 13. Statistics, 14. English, 15. Telugu, 16. Hindi & 17. Urdu
   [Eligibility: PG Degree in the relevant subject, with at least 55% marks]
2. **Librarian** [Eligibility: PG Degree in Library Science with at least 55% marks; Only Female candidate]
3. **Physical Director** [Eligibility: PG Degree in Physical Education with at least 55% marks; Only Female candidate]

Interested candidates may send their resumes along with scanned copies of necessary certificates to **kvrrdcw.info@gmail.com** or submit the same in the college office before **4.00 pm of 01.06.2023**

MANOR ESTATES AND INDUSTRIES LIMITED

Regd.Office: S.No.321, Kallakal Village, Toopran Mandal, Medak Dist.,Telangana - 502336, India
CIN: L45400TG1992PLC014389 Phone: 8897642711 Email: meilmedak@gmail.com Website: www.meilmedak.in

31 మార్చ్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాల సారాంశం

వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.03.2023 (ఆడిట్‌చేసినవి)	సంబంధిత త్రైమాసికం 31.03.2022 (ఆడిట్‌చేసినవి)	ముగిసిన సంవత్సరం 31.03.2023 (ఆడిట్‌చేసినవి)	ముగిసిన సంవత్సరం 31.03.2022 (ఆడిట్‌చేసినవి)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	0.30	-	2.87	0.16
కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను మరియు మినహాయింపుగల ఐటెంలకు ముందు)	(14.52)	(20.07)	(60.01)	(175.82)
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	(14.52)	(20.07)	(60.01)	(175.82)
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	(14.52)	(20.07)	(60.01)	(175.82)
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(14.52)	(20.07)	(60.01)	(175.82)
చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/-చొప్పున)	823.50	823.50	823.50	823.50
గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)	(990.01)	(990.01)	(990.01)	(990.01)
నికర విలువ	-	-	-	
చెల్లించిన డెట్ క్యాపిటల్ (దానిపై చెల్లించిన వడ్డీతోసహా)	-	-	-	
డెట్ ఈక్విటీ రేషియో	-	-	-	
వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/-చొప్పున) (కొనసాగుతున్న& నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)				
(ఎ) బేసిక్	(0.18)	(0.24)	(0.73)	(2.13)
(బి) డైల్యూటెడ్	(0.18)	(0.24)	(0.73)	(2.13)
డిబెంచర్ రిడెంప్షన్ రిజర్వు	-	-	-	

గమనికలు: (1) పై పేర్కొన్న ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 20.05.2023న నిర్వహించిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. (2) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33& 52 క్రింద స్టాక్ ఎక్ఛేంజిలతో దాఖలుచేసిన ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం పై విధంగా వున్నది. ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్: www.bseindia.com నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ www.meilmedak.in పై అందుబాటులో ఉంటాయి. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 52(4) మరియు 54(3)లో పేర్కొన్న ఇతరలైన్ ఐటంలకు, డిస్‌క్లోజర్లు స్టాక్ఎక్ఛేంజిలకు తెలియజేయబడినవి మరియు వాటిని స్టాక్ ఎక్ఛేంజి వెబ్‌సైట్: www.bseindia.com నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ www. meilmedak.in నందు యాక్సెస్ చేయవచ్చు. (4) కంపెనీ రియల్ ఎస్టేట్ & కన్‌స్ట్రక్షన్స్ ఆక్టివిటీను సింగిల్ బిజినెస్ సెగ్మెంట్‌లో నిర్వహిస్తున్నది. కావున ఆరేటింగ్ సెగ్మెంట్ రిపోర్టింగ్ అవసరం లేదు. కంపెనీ ఇండియా వెలుపల ఆపరేషన్లను కలిగిలేదు. అందువలన, జియోగ్రాఫికల్ సెగ్మెంట్ ఇన్ఫర్మేషన్‌డిస్‌క్లోజర్ కూడా అవసరం లేదు. (5) మినహాయింపుగల ఐటంలు లేవు. (6) ప్రస్తుత కాలవ్యవధి వర్గీకరణ నిర్ధారించుటకు అవసరమైనచోట గత కాలవ్యవధులు/ సంవత్సరపు అంకెలు రీగ్రూప్/రీక్లాసిఫైడ్ చేయబడినవి.

బోర్డు ఉత్తర్వుల మేరకు
For MANOR ESTATES AND INDUSTRIES LIMITED
సం/-
రిషబ్ అగర్వాల్
పూర్తికాలిక డైరెక్టర్
DIN: 06963740

ప్రదేశం: మెదక్
తేది: 20.05.2023

GOWRA LEASING & FINANCE LIMITED

GOWRAGROUP
Regd. Office : No.501, 5th Floor, Gowra Grand, #1-8-384 & 385, S.P.Road, Begumpet, Secunderabad - 500003.
CIN : L65910TG1993PLC015349

31 మార్చి,2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన ప్రస్తుత త్రైమాసికం 31.03.2023 (ఆడిట్‌చేసినవి)	ముగిసిన సం॥ నుండి తేది అంకెలు 31.03.2023 (ఆడిట్‌చేసినవి)	గత సం॥లో ముగిసిన త్రైమాసికానికి 31.03.2022 (ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	61.15	222.39	17.55
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు)	43.20	153.12	(10.96)
3	పన్నుకు ముందు కాలవ్యవధికు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	43.20	153.12	(10.96)
4	పన్ను తరువాత కాలవ్యవధికు నికర లాభం/(నష్టం) (అసాధారణ ఐటంల తరువాత)	20.74	103.08	(8.30)
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమీకృత ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	20.74	103.08	(8.30)
6	ఈక్విటీ వాటా మూలధనం	300.03	300.03	300.03
7	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహా) రిజర్వులు	1213.97 (as on 31.03.2023)	1213.97 (as on 31.03.2023)	1110.88 (as on 31.03.2022)
8	వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంల తరువాత) (రూ.10/- చొప్పున) (వార్షికం కానివి)			
	బేసిక్ :	0.69	3.44	(0.28)
	డైల్యూటెడ్ :	0.69	3.44	(0.28)

గమనిక: సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజిలతో దాఖలుచేసిన త్రైమాసిక/ వార్షిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక పట్టిక సారాంశం పై విధంగా ఉన్నది. త్రైమాసిక/వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీల వెబ్‌సైట్లు: (https://www.bseindia.com/corporates.html) పై అందుబాటులో ఉన్నవి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆదేశానుసారం
for GOWRA LEASING & FINANCE LTD.,
సం/- (గౌర శ్రీనివాస్)
మేనేజింగ్ డైరెక్టర్
DIN : 00286986

ప్రదేశం: సికింద్రాబాద్
తేది: 20-05-2023

GATI గతి లిమిటెడ్

CIN: L63011TG1995PLC020121
రిజిస్టర్డు & కార్పొరేట్ ఆఫీస్: 4వ అంతస్తు, వెస్టర్న్ పెర్ల్, సర్వే నెం.13(పి), కొండాపూర్, హైదరాబాద్-500 084, తెలంగాణ.
Website: www.gati.com; E-mail: investor.services@gati.com; Telephone: 040 7120 4284; Fax: 040 2311 2318

31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి ఆడిట్‌చేసిన కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల నివేదిక (రూ॥ లక్షలలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.03.2023 ఆడిట్‌చేసినవి	31.12.2022 ఆడిట్‌చేయనివి	31.03.2022 ఆడిట్‌చేసినవి	ముగిసిన సంవత్సరం 31.03.2023 ఆడిట్‌చేసినవి	31.03.2022 ఆడిట్‌చేసినవి
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	42,252	44,420	38,673	174,604	150,524
2.	పన్నుకు ముందు నికర లాభం(పన్ను ముందు మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలు)	(711)	16	(616)	434	(1,255)
3.	పన్నుకు ముందు వార్షికానికి సంబంధించి నికర లాభం/నష్టం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(1,285)	(63)	(2,847)	530	(50)
4.	పన్ను తరువాత నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(2,045)	(470)	(2,972)	(1,091)	(443)
5.	వార్షికానికి సంబంధించి సమగ్ర ఆదాయం (వార్షికానికి సంబంధించి కంప్రైజింగ్ లాభం(పన్ను తర్వాత) మరిఅయు ఇతర కంప్రైజింగ్ ఆదాయం (పన్ను తర్వాత)	(2,415)	(551)	(3,250)	(1,703)	(763)
6.	ఈక్విటీ వాటా మూలధనం	2,603	2,603	2,459	2,603	2,459
7.	వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ.2/- చొప్పున)					
	ఎ) బేసిక్	(1.23)	(0.26)	(2.91)	(0.74)	0.72
	బి) డైల్యూటెడ్	(1.23)	(0.26)	(2.91)	(0.74)	0.71

స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం దిగువ విధంగా ఉంది: (రూ.లక్షల్లో)

	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.03.2023 ఆడిట్‌చేసినవి	31.12.2022 ఆడిట్‌చేయనివి	31.03.2022 ఆడిట్‌చేసినవి	ముగిసిన సంవత్సరం 31.03.2023 ఆడిట్‌చేసినవి	31.03.2022 ఆడిట్‌చేసినవి
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	6,413	6,389	6,083	26,406	25,760
2.	సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	285	(35)	24	284	(25)
					ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి
3.	పన్నుకు ముందు సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(538)	(13)	(557)	(519)	(2,321)
4.	పన్ను తరువాత సంవత్సరం కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(562)	(13)	(514)	(543)	(2,014)
5.	సంవత్సరం కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (సంవత్సరం కొరకు సమీకృత లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(571)	(15)	(541)	(558)	(2,021)

ముఖ్యాంశాలు:

1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీతో దాఖలు చేయబడిన 31, మార్చి,2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 31, మార్చి,2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు ఇన్వెస్టర్ల కొరకు www.gati.com, www.nseindia.com మరియు www.bseindia.com వద్ద అందుబాటులో ఉన్నాయి.
2) పై పేర్కొన్న ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 19, మే, 2023 తేదీన నిర్వహించిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
3) 31, మార్చి,2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించిన ఫలితాలు అమనవి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖచే గుర్తించినట్లుగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి ఏఎస్)ను అనుసరించి ఉన్నాయి.

గతి లిమిటెడ్ తరఫున
సం/-
శశి కిరణ్ శెట్టి
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00012754

ప్రదేశం: హైదరాబాద్
తేది: 19 మే, 2023

KAPSTON SERVICES LIMITED

KAPSTON SERVICES LIMITED
(FORMERLY KNOWN AS KAPSTON FACILITIES MANAGEMENT LIMITED)
Reg. Office: Plot No.287, MIG-2, IX Phase, Kukatpally, Hyderabad-500072. CIN: L15400TG2009PLC062658
Corp.Office: Plot No 75, Kavuri Hills, Madhapur, Hyderabad-500034. Email: cs@kapstonservices.com. Ph:964050 4050

31 మార్చి, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు వార్షికానికి సంబంధించి ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల నివేదిక (రూ॥ లక్షల్లో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31-03-2023 ఆడిట్ చేసినవి	ముగిసిన త్రైమాసికం 31-12-2022 ఆడిట్ చేయనివి	ముగిసిన త్రైమాసికం 31-03-2022 ఆడిట్ చేసినవి	ముగిసిన వార్షికం 31-03-2023 ఆడిట్ చేసినవి	ముగిసిన వార్షికం 31-03-2022 ఆడిట్ చేసినవి
1	మొత్తం ఆదాయం	10,729.80	10,796.86	8,297.84	40,103.68	27,277.77
2	పన్నుకు ముందు లాభం	79.06	83.77	51.44	234.87	98.77
3	కాలవ్యవధి/సంవత్సరం కొరకు పన్ను తరువాత లాభం/(నష్టం)	90.59	157.06	67.19	507.03	247.34
4	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	95.41	157.06	84.13	511.85	264.28
5	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ వాటాకు రూ.10/- చొప్పున)	1,014.41	1,014.41	1,014.41	1,014.41	1,014.41
6	రివ్యాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి రిజర్వులు				4,851.83	4,339.98
7	వాటా ఒక్కింటికి రాబడి (రూ.) (వార్షికం కానివి)					
	1) బేసిక్	0.89	1.55	0.66	5.00	2.44
	2) డైల్యూటెడ్	0.89	1.55	0.66	5.00	2.44

గమనిక : సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో దాఖలుచేసిన 31, మార్చి,2023తో ముగిసిన నాలుగో త్రైమాసికం మరియు వార్షికం కొరకు ఆడిట్ చేసిన ఆర్థిక ఫలితాల యొక్క వివరించిన ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్: www. nseindia.com పై మరియు కంపెనీ వెబ్‌సైట్: www.kapstonfm.com పై కూడా అందుబాటులో ఉన్నాయి.
పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 20,మే,2023 తేదీన నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. సదరు ఆర్థిక ఫలితాల యొక్క పరిమిత సమీక్షను రిపోర్టును చట్టబద్ధమైన ఆడిటర్లు ఇచ్చారు.

For Kapston Services Limited (Formerly known as Kapston Facilities Management Limited)
సం/-
శ్రీకాంత్ కొడాలి
మేనేజింగ్ డైరెక్టర్
DIN : 02464623

ప్రదేశం: హైదరాబాద్
తేది: 20-05-2023

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సర్వజనులకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీ తమ్మినేడి ఫణీంద్ర తండ్రి శ్రీ టి.భాస్కర్ రావు, నివాసం: హైదరాబాద్ వారు, దిగువ షెడ్యూలు ఆస్తి (వ్యవసాయ భూమి)ని దీని యజమానులు: 1) శ్రీ వై.డి.దుర్గా ప్రసాద్ రెడ్డి, తండ్రి ఎస్. మస్తాన్ రెడ్డి, వయస్సు: సుమారు 57 సం॥లు, వృత్తి: వ్యాపారం; 2) శ్రీమతి వై. రమారెడ్డి భర్త శ్రీ వై.డి.దుర్గ ప్రసాద్‌రెడ్డి, వయస్సు: సుమారు 48సం॥లు, వృత్తి: వ్యాపారం మరియు 3) శ్రీమతి వై.శైలజా రెడ్డి భర్త శ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి, వయస్సు: సుమారు 59 సం॥లు, వృత్తి: గృహిణీ, అందరి నివాసం: ఇంటి/ప్లాట్ నం.2-17/1ప్లి, శిల్పాహిల్స్, ఖానామెట్ ఇజ్జత్ నగర్, కొండాపూర్, శేరిలింగంపల్లి, రంగారెడ్డి, తెలంగాణ-500084, మరియు మా క్లయింట్ పై యజమానులతో అమ్మకం ఒప్పందంలోకి ప్రవేశించి, మరియు అమ్మకం ప్రక్రియల్లో భాగంగా అమ్మకం పరిగణించుటకు పై పేర్కొన్న ప్రతిపాదిత విక్రేతలకు చెల్లించారు.

పై పేర్కొన్న యజమానులు/ప్రతిపాదిత విక్రేతకు తెలియజేయునది ఏమనగా, రంగారెడ్డి జిల్లా, మండలం శంకర్‌పల్లి, తహశీల్దార్ ఆఫీసు వారిచే జారీచేయబడిన వివిధ రిజిస్టర్డు సేల్ డీడ్స్‌కి సంబంధించి డిజిటల్ పాస్‌బుక్ & టైటిల్ డీడ్స్ ఆధారంగా PPBNO.T05 240211816, ఖతా నెం.60836, PPBNO.T05240211814, ఖతా నెం.60835 & PPBNO.T05240211798, ఖతా నెం.60822 ద్వారా దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్తులను వారు సేకరించారు.

ఎవరైనా వ్యక్తులు, బ్యాంకులు, సంస్థలు, ఎంటిటీ, ఫర్మ్ మరియు/లేదా దిగువ షెడ్యూలు ఆస్తి లేదా దానిలోని ఏదేని భాగంలో అమ్మకం, గిఫ్ట్, లీజు, ఇన్‌హెరిటెన్స్, ఎక్ఛేంజి, తాకట్టు, చార్జ్, లైన్, అటాచ్‌మెంట్, ఈజిమెంట్, స్వాధీనం లేదాఏదేని ఇతర విధానలలో ఏదేని క్లెయిం/ఆసక్తి కలిగియున్నచో, వారు ఈ ప్రచురణ తేది నుండి (5) రోజుల్లోగా క్రింది సంతకందారునికి సంబంధిత పత్రాలుతో వ్రాతపూర్వకంగా దానిని తెలియజేయవ లసిందిగా కోరబడుచున్నది.

ఆస్తి యొక్క షెడ్యూలు

మాసానిగూడ (గ్రా), శంకర్‌పల్లి (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్దగల ఎక 5-35 గుంటల విస్తీర్ణపు వ్యవసాయ మెట్ట భూములు మొత్తం భాగం.

శ్రీ.వై.డి.ప్రసాద్ రెడ్డి భూమి: 1) సర్వే నం.307/అ3, విస్తీర్ణం ట్రాన్స్‌ఫర్డ్ (ఎక.0.2600 గుంటలు)-మొత్తం విస్తీర్ణం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** ఇతరులు: సంజి హరీష్ ల్యాండ్; **దక్షిణం:** ఇతరులు; దరం సంతోష్ భూమి; **తూర్పు:** ఇతరులు; కార్ట్‌ట్రాక్; **పడమర:** ఇతరులు; పద్మాజి రావు భూమి. 2) సర్వే నం.307/అ, విస్తీర్ణం ట్రాన్స్‌ఫర్డ్ ఎక.1.1000 గుంటలు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** ఇతరులు; వై. దుర్గ ప్రసాద్ రెడ్డి భూమి; **దక్షిణం:** ఇతరులు; సర్వే నంబరు 304 భూమి; **తూర్పు:** ఇతరులు: పద్మాజి రావు భూమి మరియు, **పడమర:** ఇతరులు. 3) సర్వే నం.307/అ2/1, విస్తీర్ణం ట్రాన్స్‌ఫర్డ్ ఎక.0.1000 గుంటలు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** ఇతరులు; వై రామరెడ్డి భూమి; **దక్షిణం:** ఇతరులు; పద్మాజి రావు భూమి; **తూర్పు:** ఇతరులు; కార్ట్ ట్రాక్; **పడమర:** ఇతరులు; పద్మాజి రావు భూమి. **పూర్తి విస్తీర్ణం ఎకరాలు 2.0600 గుంటలు.**

శ్రీమతి వై.రమా రెడ్డి భూమి: సర్వే నం.307/అ5/1, విస్తీర్ణం ట్రాన్స్‌ఫర్డ్ ఎక.0.1300గుంటలు; సర్వే నం.307/అ1/2/1-ఎక.0.2000గుంటలు, సర్వే నం.307/అ21/2/2 -ఎక.0.300గుంటలు, సర్వే నం.307/అ1/1-ఎక.0.2200గుంటలు, సర్వే నం.307/అ/1-ఎక.0.3100గుంటలు సరిహద్దులు: **ఉత్తరం:** ఇతరులు; వై. శైలజా రెడ్డి భూమి; **దక్షిణం:** ఇతరులు; సంజి హరీష్ భూమి; **తూర్పు:** ఇతరులు; కార్ట్ ట్రాక్; **పడమర:** ఇతరులు: పద్మాజి రావు & ఇతరుల భూమి. **పూర్తి విస్తీర్ణం ఎకరాలు 2.0900 గుంటలు.**

శ్రీమతి వై.శైలజారెడ్డి & భూమి: (1) సర్వేనం.307/అ/2, విస్తీర్ణంట్రాన్స్‌ఫర్డ్ ఎక.0. 3200 గుంటలు; సర్వే నం.307/అ1/2/2-ఎక.0.2000గుంటలు, సర్వే నం.307/అ5/2 -ఎక.0.1300గుంటలు, సర్వే నం.307/అ 2/2-ఎక.0.1300గుంటలు, సరిహద్దులు: **ఉత్తరం:** ఇతరులు; సీనా ప్రదీప్ భూమి; **దక్షిణం:** ఇతరులు; సంజి హరీష్ భూమి; **తూర్పు:** ఇతరులు; కార్ట్ ట్రాక్; **పడమర:** ఇతరులు: ఎం.జంగయ్య భూమి. **పూర్తి విస్తీర్ణం ఎకరాలు 1.2000 గుంటలు.**

సం/- శ్రీ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఆర్.ఆర్.దుర్గ ప్రసాద్,
బి. అనిల్ కుమార్, కె. మల్లికార్జున్ & బి. రమ్య, అడ్వకేట్స్
SYSLEX LAW FIRM
ఆఫీసు చాంబర్స్, ఫ్లాట్ నం.104, సంధ్యా ఎంక్లేవ్,
ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082. టి.ఎస్. ఇండియా
ఫోన్: 9848686399 / 9848052710.

ఫారం జి
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానం

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36ఎ (1) క్రింద)

	సంబంధిత వివరాలు	
1.	కార్పొరేట్ డెటార్ పేరు	శ్రీ గంగా స్టీల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ యొక్క ఇన్‌కార్పొరేషన్ తేది	03.05.1999
3.	ఇన్‌కార్పొరేటెడ్/ రిజిస్టర్డు చేయబడిన కార్పొరేట్ డెటార్ క్రింది అథారిటీ	ఆర్‌ఓసి, హైదరాబాద్, రిజిస్ట్రేషన్ నెం.072917
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు సంఖ్య	U27201TG1999PTC072917
5.	కార్పొరేట్ డెటార్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు మరియు ప్రధాన కార్యాలయం యొక్క చిరునామా (ఏదేని ఉన్నచో)	రిజిస్టర్డ్ కార్యాలయం: ఇంటి నెం.8-2-248/1/7/18,ప్లాట్ నెం.18,నాగార్జున హిల్స్, పంజాగుట్ట,హైదరాబాద్, హైదరాబాద్,టిజి-500082,ఇండియా.
6.	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	ఆర్డర్ తేది:31-10-2022 (ఆర్డర్ అందుబాటులో ఉన్న తేది:10-11-2023)
7.	ఆసక్తి వ్యక్తపరుచుటకు ఆహ్వాన తేది	20.05.2023
8.	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(హెచ్) క్రింద రిజొల్యూషన్ దరఖాస్తుదారుల అర్హత ఇవ్వబడు అందుబాటులో ఉండును:	పూర్తి వివరాలను పొందేందుకు దిగువ ఇ-మెయిల్‌కు పంపించాలి: ip.srigangasteel@gmail.com
9.	సెక్షన్ 29ఎ క్రింద వర్తించు అనర్హత యొక్క నిబంధనలు ఇచ్చుట అందుబాటులో ఉండును:	పూర్తి వివరాలను పొందేందుకు దిగువ ఇ-మెయిల్‌కు పంపించాలి: ip.srigangasteel@gmail.com
10.	ఆసక్తి వ్యక్తపరుచుటను స్వీకరణ కొరకు చివరి తేది	04.06.2023
11.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తుల యొక్క ప్రొవిజనల్ జాబితా జారీచేయు తేది	14.06.2023
12.	ప్రొవిజనల్ జాబితాకు ఆక్షేపణలు దాఖలుచేయుట కొరకు చివరి తేది	19.06.2023
13.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తుల తుది జాబితా జారీచేయు తేది	29.06.2023
14.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తులకు రిజొల్యూషన్ ప్లాన్స్‌కు ఇన్ఫర్మేషన్ మెమోరండం, ఎవాల్యూయేషన్ మాట్రిక్స్ మరియు అభ్యర్థన జారీ తేది	19.06.2023
15.	రిజొల్యూషన్ ప్లాన్, ఎవాల్యూయేషన్ మాట్రిక్స్, ఇన్ఫర్మేషన్ మెమోరాండం మరియు ఇతర సమాచారం	లిఖితపూర్వక రిజల్యూషన్ అప్లికంట్స్ దిగువ మెయిల్‌కు పంపించాలి ip.srigangasteel@gmail.com ఇన్ఫర్మేషన్ మెమోరాండమ్,ఆర్ఎఫ్ఆర్పి మరియు ఎవల్యూషన్ మాట్రిక్స్‌ను ఇ-మెయిల్/డాటా రూమ్‌ద్వారా కాన్ఫిడెన్షియల్ అండర్‌టేకింగ్ తర్వాత పొందవచ్చును.
16.	రిజొల్యూషన్ ప్లాన్లు దాఖలు చేయు చివరి తేది	19.07.2023
17.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజొల్యూషన్ ప్లాన్లు దాఖలుచేయు విధానం	రిజల్యూషన్ ప్లాన్‌ను సాఫ్ట్ కాపీ ద్వారా దిగువ మెయిల్‌కు పంపించాలి ip.srigangasteel@gmail.com మరియు హార్డ్ కాపీని సీల్డ్ ఎన్వలప్‌లో శ్రీ మారుతీ వెంకట సుబ్బారావు పోలూరి, రిజల్యూషన్ ప్రొఫెషనల్, ఎంపైర్ స్క్వేర్, మూడో అంతస్తు,టిఎఫ్-8,ఆర్‌బిఎల్ బ్యాంక్ పైన,పిల్లర్ నెం.1612,జూబ్లిహిల్స్,హైదరాబాద్,తెలంగాణ-500033.
18.	ఆమోదం కొరకు అడ్జుడికేటింగ్ అథారిటీకు రిజొల్యూషన్ ప్లాను దాఖలుచేయు అంచనా తేది	05.08.2023
19.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క పేరు మరియు రిజిస్ట్రేషన్ నంబరు	మారుతీ వెంకట సుబ్బారావు పోలూరి, Reg. No. IBBI/IPA-002/IP-N00924/2019-20/13001 AFA valid up to 01.05.2024
20.	బోర్డుతో రిజిస్టరైనట్లుగా రిజొల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క పేరు, చిరునామా మరియు ఇ-మెయిల్	మారుతీ వెంకట సుబ్బారావు పోలూరి, రిజల్యూషన్ ప్రొఫెషనల్,విష్ణు విస్తారా అపార్ట్‌మెంట్స్,ఫ్లాట్ నెం.ఎ-505,భాగ్య నగర్ కాలనీ వెంయిన్ రోడ్డు,మాధాపూర్,హైదరాబాద్,తెలంగాణ-500081. e-mail: cssubbarao@gmail.com
21.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదింపుల కొరకు ఉపయోగించు ఇ-మెయిల్ మరియు చిరునామా	ఎంపైర్ స్క్వేర్, మూడో అంతస్తు, టిఎఫ్-8,ఆర్‌బిఎల్ బ్యాంక్ పైన, పిల్లర్ నెం.1612, జూబ్లిహిల్స్,హైదరాబాద్, తెలంగాణ-500033. e-mail: ip.srigangasteel@gmail.com
22.	ఫారం-జి యొక్క ప్రచురణ తేది	20.05.2023

మారుతీ వెంకట సుబ్బారావు పోలూరి
రిజల్యూషన్ ప్రొఫెషనల్ మెసర్స్ శ్రీ గంగా స్టీల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్ కొరకు
Regn.No. IBBI/IPA-002/IP-N00924/2019-20/13001
ఎంపైర్ స్క్వేర్, మూడో అంతస్తు, టిఎఫ్-8,ఆర్‌బిఎల్ బ్యాంక్ పైన, పిల్లర్ నెం.1612, జూబ్లిహిల్స్,హైదరాబాద్, తెలంగాణ-500033.
E-mail id: ip.srigangasteel@gmail.com

తేది:20-05-2023
ప్రదేశం: హైదరాబాద్

DODLA DAIRY LIMITED

FOR HEALTHIER LIFE — DODLA DAIRY
CIN: L15209TG1995PLC020324
Regd.Office: # 8-2-293/82/A, 270/Q, Road No 10-C, Jubilee Hills, Hyderabad - 500033, Telangana, India.
www.dodladairy.com, Tel: 040-4546 7777, Fax: 040-4546 7788, Email: cs@dodladairy.com

31 మార్చ్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.మిలియన్లలో షేర్ డాటాకు మినహా)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్ ముగిసిన త్రైమాసికం 31-Mar-23 ఆడిట్‌చేసినవి (రిఫర్ నోట్ 3)	31-Dec-22 ఆడిట్‌చేయనివి (రిఫర్ నోట్ 5)	31-Mar-22 ఆడిట్‌చేసినవి (రిఫర్ నోట్ 3)	ముగిసిన సంవత్సరానికి 31-Mar-23 ఆడిట్‌చేసినవి	31-Mar-22 ఆడిట్‌చేసినవి	కన్సాలిడేటెడ్ ముగిసిన త్రైమాసికం 31-Mar-23 ఆడిట్‌చేసినవి (రిఫర్ నోట్ 3)	31-Dec-22 ఆడిట్‌చేయనివి (రిఫర్ నోట్ 5)	31-Mar-22 ఆడిట్‌చేసినవి (రిఫర్ నోట్ 3)	ముగిసిన సంవత్సరానికి 31-Mar-23 ఆడిట్‌చేసినవి	31-Mar-22 ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	6,653.36	6,184.04	5,403.94	25,841.24	20,964.84	7,242.82	6,754.31	5,897.18	28,120.29	22,433.51
2	కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంలకు ముందు)	177.10	327.25	479.66	1,149.27	1,633.41	249.89	439.40	377.12	1,518.36	1,655.60
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంల తరువాత)	177.10	327.25	479.66	1,149.27	1,633.41	249.89	439.40	377.12	1,518.36	1,655.60
4	పన్ను తరువాత కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంల తరువాత)	162.52	276.33	560.32	949.85	1,366.17	225.29	353.85	404.82	1,222.84	1,328.13
5	కాలవ్యవధిలో పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం	165.07	273.93	557.06	957.45	1,362.52	193.62	413.18	416.31	1,290.72	1,383.06
6	ఈక్విటీ వాటా మూలధనం	594.93	594.93	594.93	594.93	594.93	594.93	594.93	594.93	594.93	594.93
7	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి)				8,236.41	7,278.96				9127.40	7,836.68
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/-ల చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)										
	ఎ) బేసిక్: (రూ.)	2.73	4.64	9.42	15.97	23.07	3.79	5.95	6.80	20.55	22.43
	బి) డైల్యూటెడ్: (రూ.)	2.71	4.61	9.34	15.84	22.87	3.76	5.90	6.75	20.39	22.24

గమనికలు:

1) పైపేర్కొన్న ఆడిట్‌చేసిన ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 20 మే, 2023న నిర్వహించిన వారి సమావేశాల్లో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే పరిగణలోకి తీసుకోబడినవి, ఆమోదించబడినవి మరియు రికార్డులోకి తీసుకోబడినవి.
2) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలు చేయబడిన త్రైమాసికం/ వార్షిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం. త్రైమాసికం/ వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్స్: www.bseindia.com మరియు www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.dodladairy.com పై అందుబాటులో ఉంటాయి.
3) 31 మార్చ్, 2023తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెలు అనునవి పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్‌చేసిన స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెలు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం యొక్క మూడవ త్రైమాసికం వరకు తేది వరకు ప్రచురించిన ఆడిట్‌చేయని సంవత్సరం తేది స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెల మధ్య బ్యాలెన్సింగ్ అంకెలు.
4) 31 మార్చ్, 2022తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెలు అనునవి పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్‌చేసిన స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెలు మరియు గత ఆర్థిక సంవత్సరం యొక్క మూడవ త్రైమాసికం వరకు తేది వరకు ప్రచురించిన ఆడిట్‌చేయని సంవత్సరం తేది స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెల మధ్య బ్యాలెన్సింగ్ అంకెలు.
5) 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్/ కన్సాలిడేటెడ్ అంకెలు అనునవి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడవ త్రైమాసికం వరకు ప్రచురించిన ఆడిట్‌చేయని సంవత్సరం నుండి తేది అంకెలు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం యొక్క రెండవ త్రైమాసికం వరకు తేది వరకు ప్రచురించిన ఆడిట్‌చేయని సంవత్సరం నుండి లేది వరకు అంకెల మధ్య బ్యాలెన్సింగ్ అంకెలు.

బోర్డు ఆదేశాల మేరకు
For Dodla Dairy Limited
సం/- దొడ్ల సునీల్ రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00794889

ప్రదేశం: హైదరాబాద్
తేది: 20 మే, 2023

సంపాదకీయం

మరోలోకం...

ఈ లోకం బాగోలేదు. సుఖంగానూ లేదు, సౌఖ్యంగానూ లేదు. పైగా ఎన్ని బాధలు! ఎన్నెన్ని దుఃఖాలు! ఈ అగచాట్లు, బాధలు, కష్టాలు ఎప్పుడు తీరేను! ఎలా తీరేను. విముక్తికి మార్గమేమిటి? ఎలా సాధించాలి. ఏదో మార్గం వెతకాలి. నిరంతరంగా మనుషుల్ని తొలుస్తున్న ప్రశ్నలు. ఆనాటి బుద్ధుడి నుండి నేటి ఆధునికుని వరకు ఇవే ప్రశ్నలు. ఎందరెందరో వీటికి

> ఆవుమూత్రం తాగండి, బురదలో బొర్లండి, గంటలు కొట్టండి, దీపాలు వెలిగించండి, ధాన్యం చేయండి అని బోధచేసిన పాలకులున్న దేశంలో మరింత మూఢత్వాలు పెచ్చరిల్లే ప్రమాదముంది. వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆ అవతారాన్ని పొందాడన్న జ్ఞానవంతుల ఏలుబడిలో యజ్ఞాలకు, యాగాలకు, మతతత్వపు ప్రచారాలకు కొదవే ఉండదు. తమిళనాడులో ఆకాశంలో ఎగురుతున్న ఒక యువకున్ని చూపి పవన్‌పుత్ర శ్రీహనుమాన్ జీ అని నమ్మిస్తున్న మేధావులకు అదొక మెజీషియన్ చేస్తున్న కనికట్టు విద్యని తెలియదనుకుంటామా!

సమాధానాలు చెబుతూనే ఉన్నారు. పరిష్కార మార్గాలనూ సూచిస్తూనే ఉన్నారు. అనేక విధాలయిన మత ధోరణులు తాత్విక ఆలోచనలూ అందులోంచే విస్తరిస్తూ వచ్చాయి కూడా. అయితే ఇన్ని వేల సంవత్సరాల కాలగమనంలో వాస్తవిక పరిష్కారం ఏదీ చూపెట్టలేకపోయింది. ఒక్క మార్క్సిజం తప్ప. అయినా అనేక విశ్వాసాలతో సమూహాలు కొనసాగుతూ ఉన్నాయి. దగ్గర దారులు వెతుక్కోవడం, తేలికయిన ప్రయత్నాలకు పూనుకోవటం మనం చూస్తూవున్నాం. ఎన్నిరకాలుగా ఇవి ఉన్నా ఒక్క విషయంలో ప్రపంచ మానవులందరూ ఏకీభావంతోనే ఉన్నారు. అదేమిటంటే, మానవులు విముక్తమవ్వాల్సి ఉందనేది. మరోలోకం అవసరమనేది. ఈ లోకం వేదనలతో, ఇక్కట్లతో, దుఃఖంతో నిండి ఉందన్న విషయం మాత్రం అందరూ అంగీకరించుతున్నారు. అందుకే పరలోకాన్ని, స్వర్గాన్ని ఊహించుకున్నారు. మోక్షము, విముక్తి మొదలైన ఆలోచనలతో ఊహాలోకాలనూ సృష్టించుకున్నాడు. విశ్వాసాలు, నమ్మకాల నుండి మూఢత్వంలోకి అంధత్వంలోకి జారిపోతున్నాడు.



ప్రపంచంలోని మతాలన్ని ఇక్కడి బాధలకు, దుఃఖాలకు, వేదనలకు పరలోకంలో పరిష్కారం చూపడంలోనే మూఢవిశ్వాసాలు ఒక్కొక్కటీ పెరుగుతూ వచ్చాయి. విశ్వాసం కలిగి ఉండటంలో ఒక రకమైన సాంత్వన, ఓదార్పు కలిగితే కలగవచ్చు కానీ మూఢత్వంలోకి వెళితే అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయి. మతాల చుట్టూ మొదలైన భ్రమలు క్రమంగా మూఢ విశ్వాసాలకు పాదువేస్తూనే ఉంటాయి. ప్రాచీన కాలం నుండి, నేటి వరకూ మూఢత్వం కొత్త రూపాలెత్తుతూనే ఉంది. వేదనలు, ఒత్తిళ్లు, సవాళ్లు, దోపిడీ పీడనలు పెరుగుతున్న కొద్దీ, వీటి నుండి ఉపశమనం పొందటం ఎలానో తెలియని పరిస్థితుల్లో, ప్రజలను మూఢవిశ్వాసాల్లోకి ప్రేరేపించి దోచుకోవడమూ మనం గమనించవచ్చు! దుఃఖాలకు అసలు కారకులైన పాలకులపై తిరగబడకుండా, ప్రశ్నించకుండా, ప్రజలలో కొన్ని మూఢ విశ్వాసాలను సృష్టించాలని మన చాణుక్యుడు కూడా సెలవిచ్చేవున్నాడు. ఇవన్నీ పాలకుల కుయుక్తులు. ఇప్పుడు మతం చుట్టూ పేరుకునే అంధత్వాలు పెరిగిపోతున్నాయి.

ఇటీవల కెన్యాలోని ఎడారిలో 80కి పైగా మృతదేహాలు దొరికాయి. ఇంటర్నేషనల్ చర్చ్ ఆఫ్ గుడ్ న్యూస్‌కు చెందిన వీరంతా ఆకలితో చనిపోవడం (ఉవాసం) ద్వారా స్వర్గానికి చేరుకోవచ్చుని ఆ సంస్థ బోధించిందట. డేవిడ్ అనే ఫాస్టర్ వందల మంది విశ్వాసకులను ప్రేరేపించి ఉపవాస దీక్షకు పురికొల్పాడు. ఆయన 'ఆధ్యాత్మిక వివాహాలు' అనే పద్ధతిని తీసుకువచ్చి, దాని ద్వారా అన్ని వయసుల ఆడవారితో లైంగిక సంబంధాలు పెట్టుకుని లైంగిక దోపిడీకి పాల్పడ్డాడనీ తెలిసింది. ఒక ఉపవాసం చేసి ఆకలితో మరణించి దేవున్ని చేరుకోవడం ద్వారా విముక్తి పొందవచ్చన్నది వారి మూఢవిశ్వాసం. అలా చనిపోవడానికి ఇంకా వందలమంది ఉన్నారని తెలిసింది. ఇలా మతాన్ని అంటుకుని ఉన్న అంధవిశ్వాసాల వల్ల జీవితాలను, ప్రాణాలను కోల్పోవటం, గతం నుంచీ జరుగుతుండటం మనం చూస్తున్నాం. ఆ మధ్య ఆంధ్ర ప్రాంతంలో ఇద్దరు కూతుళ్లను ఇనుపబండతో బాది చంపి, తిరిగి లేచొస్తారని భావించిన తల్లిదండ్రులనూ చూశాము. కొన్ని మానవాతీత శక్తులను సంపాదించాలని మనుషులను బలిచ్చే ఘటనలూ వింటుంటాం. చేతబడులనీ, భూతవైద్యమనీ, దెయ్యం పట్టిందనీ, యంత్ర, తంత్ర, మంత్రాల తతంగాలన్నీ ఇలాంటి మూఢత్వం నుండే ఉద్భవిస్తుంటాయి. ఇలాంటి వన్నీ కూడా మనుషులు ఆలోచించాల్సిన విషయాల నుండి, చేయాల్సిన పనుల నుండి పక్కదారి పట్టించడమే.

కరోనా విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వం వైద్యం అందించాల్సింది పోయి, ఆవుమూత్రం తాగండి, బురదలో బొర్లండి, గంటలు కొట్టండి, దీపాలు వెలిగించండి, ధాన్యం చేయండి అని బోధచేసిన పాలకులున్న దేశంలో మరింత మూఢత్వాలు పెచ్చరిల్లే ప్రమాదముంది. వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆ అవతారాన్ని పొందాడన్న జ్ఞానవంతుల ఏలుబడిలో యజ్ఞాలకు, యాగాలకు, మతతత్వపు ప్రచారాలకు కొదవే ఉండదు. తమిళనాడులో ఆకాశంలో ఎగురుతున్న ఒక యువకున్ని చూపి పవన్‌పుత్ర శ్రీహనుమాన్ జీ అని నమ్మిస్తున్న మేధావులకు అదొక మెజీషియన్ చేస్తున్న కనికట్టు విద్యని తెలియదనుకుంటామా!

ప్రజల మత విశ్వాసాలను ఆసరా చేసుకుని అనేక భ్రమలను సృష్టిస్తూ, దోపిడీలకు పాల్పడుతున్న వారి పట్ల జాగరూకులై ఉండాలి. మూఢత్వం వల్ల, అసలు సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత అనర్థాలు జరుగుతాయి. వేదనలూ, బాధలూ లేని మరో ప్రపంచాన్ని మన కృషి ద్వారా ఇక్కడే నిర్మించుకోవటమే అసలైన పరిష్కారం.

తెలంగాణ బీజేపీకి కర్నాటక కంగారు...



తెలకపల్లి రవి

కర్నాటక ఎన్నికల దెబ్బ తర్వాత తెలంగాణలో బీజేపీ హడావుడి తగ్గి కంగారు పెరిగింది. దక్షిణాదిలో తమ తదుపరి ఆశాకిరణం తెలంగాణానే అన్నట్టు మాట్లాడిన కమలం పార్టీ నేతలు ఇప్పుడు కొత్తవాదనలు వెతుక్కోవలసిన పరిస్థితిలో పడ్డారు. నిజానికి ఈ పరిస్థితి గతంలోనే మొదలైంది గనకే స్వయంగా ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షాలు దిగిపోయి స్థానిక నాయకుల స్థాయిలోకి దిగిపోయి కేసీఆర్ ప్రభుత్వంపై చిందులు తొక్కారు. అధికార కార్యక్రమాలలోనే రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ దాడికి దిగిన మోడీవాటిని ఎన్నికల ప్రచారసభల్లా మార్చేశారు. దేశంలో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల కోసం రవాణా విస్తరణ కోసం కేంద్రం పరితపిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని తిట్టిపోశారు. తాను అవినీతిపై పోరాడుతుంటే పరివార్ వాదులు అంటే కుటుంబ పాలన చేసేవారు అడ్డుతగులుతున్నారని ఆరోపణలు గుప్పించారు. ఇతర పార్టీల ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో కలసిరావడం లేదని అందరిపై అభాండం వేశారు. డబుల్ ఇంజన్ పాటతో ఇప్పుడు ట్రబుల్ ఇంజన్ తెచ్చుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎప్పుడూ అదే పనిలో వుంటారు, టీబీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మతోన్మాద భాషణలైతే తెలంగాణ లౌకిక సంప్రదాయాలకే కళంకం తెచ్చేలా రోజువారి వినిపిస్తుంటాయి. బీఆర్ఎస్ అధ్యక్షుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీ మతతత్వ

> బీజేపీకి దక్షిణాదిన మరో అవకాశం ఇవ్వరాదనేది తెలంగాణలో లౌకికశక్తులన్నిటి లక్ష్యమైతే ఆ మతతత్వం, కేంద్ర నిరంకుశత్వాలపై కాంగ్రెస్ కేంద్రీకరించాలి. రాష్ట్రాలలో లౌకిక ప్రాంతీయ పార్టీలను దెబ్బతినడం వల్ల దేశవ్యాపితంగా తనకు కలిగించే నష్టాన్ని గుర్తించాలి. బీహార్ వంటిచోట్ల వారు అనుసరిస్తున్న విధానంలో ఈ వాస్తవికత కనిపిస్తుంది. కేసీఆర్ కూడా బహుశా ఈ వాస్తవాన్ని గుర్తించారు గనకే కర్నాటకలో పోటీ చేసి ఏ మాత్రం ఓట్లు చీల్చేందుకు సిద్ధపడలేదనుకోవాలి. దేశ వ్యాపిత వాతావరణం కూడా ఇదే కోవలో పెంపొందడం ఆహ్వానించవలసిందే.

రాజకీయాలు, కేంద్రం నిరంకుశ పోకడలపై నిరంతర విమర్శలు గుప్పించడం, మహారాష్ట్ర వంటిచోట్ల ప్రజాస్వామికంగా విస్తరించేందుకు ప్రయత్నాలు తీవ్రం చేయడం బీజేపీకి మింగుడు పడని విషయమైంది. కర్నాటక, తెలంగాణ, దక్షిణభారతంలో తమ తదుపరి ప్రభుత్వాలను చూస్తాయని అమిత్ షా అక్కడ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలోనూ చెప్పారు. అయితే అది అతిశయోక్తి అని అప్పటికే స్పష్టమైంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్య అవగాహన, ఉద్యమాలు ఉమ్మడి పోరాటంపెరుగుతున్న కొద్దీ వచ్చే ఎన్నికలలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం బీజేపీకి సవాలుగానే తయారవుతున్నది. నిరంకుశ కార్పొరేట్ మతతత్వం అదానీ కుంభకోణాలు, రాహుల్‌పై అనర్హత వేటు వంటివాటిపై అనేక రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసనలు ప్రజాగ్రహాలు బీజేపీని భయపెడుతున్నాయి. ఇప్పుడు రెండువేల రూపాయల రద్దు ప్రహసనం నోట్లరద్దు రోజులను గుర్తు చేసింది. బలమైన లౌకిక ప్రాంతీయ పార్టీలూవున్న చోట గతంలో వలె గెలవలేకపోవచ్చున్న వాస్తవం స్పష్టమైనకొద్దీ ఉన్న మిత్రపక్షాలు కూడా దూరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్నాటక చేజారిపోయి కేరళ, తమిళనాడులలో అసలే ఠికానా లేనప్పుడు తెలంగాణ ఒక గడ్డుప్రశ్నలా మారుతున్నది.

బీజేపీ వింత వాదనలు

నిజానికి తెలంగాణలోతామే అధికారానికి రాబోతున్నామని ఆర్భాటం చేసిన బీజేపీకి క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని తేలిపోయింది. లిక్కర్ కేసు పేరిట బీఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను అనేకసార్లు విచారించడమే గాక అరెస్టు అనివార్యం అని హల్‌చల్ చేసినా ఇంతవరకూ అది సాధ్యం కాలేదు. దేశవ్యాపితంగానే ప్రతిపక్షాలు ఈడీ, సిబిఐల దుర్వినియోగాన్ని రాజకీయంగా న్యాయపరంగా కూడా సవాలు చేయడం వాతావరణం మార్చింది. బీజేపీ ఆశించినట్టు ప్రముఖులెవరూ ఆ పార్టీలో చేరింది లేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాత్రం చేరారు గాని ఆయన వల్ల ఒరిగేది లేదని బీజేపీ నేతలే చప్పరిస్తున్నారు. పరిస్థితి ఎక్కడకు వచ్చిందంటే చేరికల కమిటీ చైర్మన్‌గా నియమితుడైన ఈటెల రాజేందర్ ఎవరినీ ఆకర్షించలేకపోగా కొంతమంది రివర్స్ దారి పట్టారు. చేరికల కమిటీ చారికగా మిగిలిపోయింది. దీనికి పరాకాష్ట స్వయంగా రాజేందర్ కాంగ్రెస్‌లో చేరతాడని కథనాలు రావడం. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి మునుగోడులో ఓడిపోయిన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి కూడా మాతృసంస్థలోకి వెళ్తరని వార్తలు వచ్చాయి. దీనికి తగినట్టే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాత కాంగ్రెస్ నాయకులందరూ తిరిగిరావాలని పిలుపునిచ్చారు.

గొంతు మార్చిన కొండా

మాజీ టీఆర్ఎస్/కాంగ్రెస్ నాయకుడు కొండా విశ్వేశ్వరరెడ్డిపై కూడా ఇలాంటి ఊహాగానాలే సాగాయి. ఈటెలపై కేసీఆర్ వేటు వేశాక మొదట చేరదీసింది విశ్వేశ్వరరెడ్డి కావడం తెలిసిందే. కర్నాటక ఓటమి తర్వాత కొండా మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ప్రజలు అనుకుంటున్నారని, ఇది పోవాలంటే కవితను అరెస్టు చేయాలని అన్నారు. నిజానికి ఈ ప్రచారం కాంగ్రెస్ వాదనైతే దాన్ని బీజేపీ తరఫున కొండా నెత్తికెత్తుకోవడం విడ్డూరం. అదీగాక కవితను అరెస్టు చేస్తే ప్రజలు నమ్ముతారని ఒక మాజీ ఎంపీ వాదించడం చూస్తే దేశంలో చట్టాలను ఇష్టప్రకారం ఉపయోగించు కోవచ్చని ఆయన భావనగా స్పష్టమవుతుంది. ఈడీ, సిబిఐ, ఐటిలను ప్రత్యర్థులపై దాడికి దుర్వినియోగం చేస్తున్నారని బీఆర్ఎస్ కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలు సుప్రీం కోర్టులో కేసు వేశాయి. నిర్దిష్టమైన సందర్భంతో వస్తే పరిశీలించగలమని సామూహికంగా విచారించలేమని కోర్టు కొట్టివేసింది. అదేదో తమ విజయంగా బీజేపీ చెప్పుకుంది గాని వాస్తవం వేరు. అదలా ఉంచితే ఇదే లిక్కర్ కేసులో కొందరికి బెయిలు మంజూరుచేస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగ్ ఈ కేసుకు ఆధారమే లేదని ఆరోపించడం ప్రతిపక్షాల ఆరోపణ వాస్తవమని నిరూపించినట్టయింది. వందకోట్ల ఆరోపణ చేసేవారు దాన్ని చేతులు మార్చిన హవాలా ఆపరేటర్‌ను ఎందుకు పట్టుకోలేకపోయారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇంత జరిగాక కూడా కొండా వంటివారు ఏకపక్షంగా బీజేపీపై విశ్వాసం కలిగించం కోసం ఎవరినో అరెస్టు చేయాలని బాహాటంగా కోరడం దేనికి నిదర్శనం? ప్రత్యర్థి పార్టీలను భయపెట్టి ప్రజలను లోబర్చుకోవాలనడం కాదా? సహజంగానే దీనిపై దుమారం రేగాక ఆయన కాస్త సర్దుకుని గొంతు మార్చారు. వేగంగా దర్యాప్తు జరపాలని కోరామే తప్ప అరెస్టుచేయడం బీజేపీ చేతుల్లో ఉండదని సర్దుకుంటున్నారు. అంతటితో ఆగక బీజేపీ దేశంలో అత్యంత లౌకికపార్టీ అని భజన కీర్తనలాలపిస్తున్నారు. తన మనుగడ కోసం బీజేపీలో చేరారు గనక పొగడొచ్చు గాని హిందూత్వ తమ మూల సిద్ధాంతమని చెప్పే పార్టీకి అంత




లౌకికతత్వం అంటగడితే ఎలాచెల్లుతుంది? దక్షిణ భారతంలో ఈ తరహా మతతత్వం చెల్లదు గనకే కర్నాటకలో ఘోర పరాజయం పాలైనామనే గుణపాఠం నేర్చుకోలేకపోవడం విచిత్రం.

బీఆర్ఎస్ విశ్వాసం, కాంగ్రెస్ వ్యూహం

కర్నాటక విజయం చూసి బీఆర్ఎస్ భయపడిపోతుందని కాంగ్రెస్ అతిగా ఆనందించడం కూడా అవాస్తవికమే. ఆ ఫలితం ప్రధానంగా బీజేపీకి తిరుగులేని తిరస్కృతి. అక్కడ గతంలో చాలాకాలం పాలకపక్షంగా కాంగ్రెస్ ఉంది గనక సహజంగానే వారు గెలిచారు. అవకాశవాదంతో అటూ ఇటూ మాట్లాడిన జేడీఎస్ బలం కోల్పోయింది. బీజేపీని ఓడించాలని ప్రజలు కోరుకుంటే ఎక్కడ ఎవరు బలంగా ఉంటే వారిని గెలిపిస్తారన్నది ఇక్కడ కీలకాంశం. వారికి ఆ విధమైన యంత్రాంగం పట్టు కూడా ఉండాలని ప్రజలు కోరుకుంటారు. ఆ విధంగా చూస్తే తెలంగాణలో పాలకపార్టీగా ఉండి బీజేపీ మతరాజకీయాలను నిశితంగా విమర్శిస్తున్న బీఆర్ఎస్‌కు ఈ ఫలితం ఎక్కువ సంతోషం కలిగించాలి. మునుగోడులో బీజేపీ ఓటమిలో కీలకపాత్ర వహించి మతతత్వంపై దేశవ్యాపితంగా మోడీ సర్కారును ఓడించడం కీలకమని భావిస్తున్న వామపక్షాలు కూడా ఆ దిశలో పట్టుదలగా

> మాజీ టీఆర్ఎస్/కాంగ్రెస్ నాయకుడు కొండా విశ్వేశ్వరరెడ్డిపై కూడా ఇలాంటి ఊహాగానాలే సాగాయి. ఈటెలపై కేసీఆర్ వేటు వేశాక మొదట చేరదీసింది విశ్వేశ్వరరెడ్డి కావడం తెలిసిందే. కర్నాటక ఓటమి తర్వాత కొండా మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ప్రజలు అనుకుంటున్నారని, ఇది పోవాలంటే కవితను అరెస్టు చేయాలని అన్నారు. నిజానికి ఈ ప్రచారం కాంగ్రెస్ వాదనైతే దాన్ని బీజేపీ తరపున కొండా నెత్తికెత్తుకోవడం విడ్డూరం. అదీగాక కవితను అరెస్టు చేస్తే ప్రజలు నమ్ముతారని ఒక మాజీ ఎంపీ వాదించడం చూస్తే దేశంలో చట్టాలను ఇష్టప్రకారం ఉపయోగించు కోవచ్చని ఆయన భావనగా స్పష్టమవుతుంది.

ఉన్నాయి. ఉభయ కమ్యూనిస్టుపార్టీల సమావేశాలు, యాత్రలు ఉత్సాహం కలిగిస్తున్నాయి. తెలంగాణలో లౌకిక శక్తుల పట్టు సమీకరణే బీజేపీని భయపెడుతున్నది. వచ్చే ఎన్నికలలో తమకు వందకు పైగా సీట్లు వస్తాయని కేసీఆర్ విశ్వాసం వెలిబుచ్చారు. అంతకు ముందు ఎంఎల్‌ఎలకు హెచ్చరికలు చేసిన ముఖ్యమంత్రి వీలైనంత మంది పాతవారికే టికెట్లు ఇస్తామంటూ భరోసా కల్పించేందుకు ప్రయత్నించారు. ఇదంతా పెరిగిన ధీమాకు నిదర్శనమవుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పొప్పులపై తప్పక పోరాడవచ్చుగాని దాన్ని బీజేపీతో జతకట్టి చిత్రిస్తున్న కాంగ్రెస్ వాదన విడ్డూరంగా ఉందని చెప్పక తప్పదు. ఈ వాదన విశ్వేశ్వరరెడ్డి వంటివారు అందిపుచ్చుకోవడం కన్నా ఇందుకు మరో ఉదాహరణ అవసరం లేదు. దక్షిణ భారతంలో మరో చోట బీజేపీకి అవకాశం ఇవ్వరాదనేది కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమైతే ఇలా మాట్లాదే అవకాశం ఉండదు. తమ విజయం కోసం ఏ రాజకీయ పార్టీ అయినా పోరాడవచ్చు గాని దేశవ్యాపిత దృక్పథం కోల్పోయి బీజేపీ, బీఆర్ఎస్‌లను ఒకేగాట కట్టడం సరైన విధానం అనిపించుకోదు. ముందే చెప్పినట్టు బీజేపీకి దక్షిణాదిన మరో అవకాశం ఇవ్వరాదనేది తెలంగాణలో లౌకికశక్తులన్నిటి లక్ష్యమైతే ఆ మతతత్వం, కేంద్ర నిరంకుశత్వాలపై కాంగ్రెస్ కేంద్రీకరించాలి. రాష్ట్రాలలో లౌకిక ప్రాంతీయ పార్టీలను దెబ్బతినడం వల్ల దేశవ్యాపితంగా తనకు కలిగించే నష్టాన్ని గుర్తించాలి. బీహార్ వంటిచోట్ల వారు అనుసరిస్తున్న విధానంలో ఈ వాస్తవికత కనిపిస్తుంది. కేసీఆర్ కూడా బహుశా ఈ వాస్తవాన్ని గుర్తించారు గనకే కర్నాటకలో పోటీ చేసి ఏ మాత్రం ఓట్లు చీల్చేందుకు సిద్ధపడలేదనుకోవాలి. దేశ వ్యాపిత వాతావరణం కూడా ఇదే కోవలో పెంపొందడం ఆహ్వానించవలసిందే. కర్నాటక ఎన్నికల తర్వాత వివిధ రూపాల్లో ఈ ప్రయత్నాలు పెరగొచ్చు. వైసీపీ, టీడీపీ, బీజేడీ, జనసేన వంటిపార్టీలు కూడా లౌకిక పార్టీలే అయినా ఇప్పటికీ బీజేపీతో ఉంటామనడం ఈ లక్ష్యానికి విరుద్ధమైన పరిణామం. ఎవరి లెక్కలు ఎలా ఉన్నా దేశ ప్రజలు ప్రత్యేకించి తెలుగు ప్రజలు మాత్రం బీజేపీని నెత్తి నెత్తుకోవడానికి సిద్ధపడబోరని ఖాయంగా చెప్పొచ్చు.



భారత భిన్న సంస్కృతుల సమాఖ్యను కాపాడుకోవాలి

భారత దేశం వైవిధ్యంతో కూడి భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, మతాల విశేషం కలిగి ఉన్న సమ్మోహన పరిచే భూమి. వేల సంవత్సరాల నాటి చరిత్రతో, భారతదేశం అసమానమైన ఆచారాలు నమ్మకాల సంపదను పెంపొందించుకుంది, అది ఈనాటికీ శక్తివంతమైన సమాజాన్ని రూపు దిద్దుకుంటోంది.ప్రాచీన సింధు లోయ నాగరికత నుండి మౌర్య, గుప్త సామ్రాజ్యాలు, మధ్యయుగ సుల్తానులు, మొఘల్ రాజవంశం, బ్రిటిష్‌కాలం వరకు, అనేక రాజ్యల పాలనా దేశం సాంస్కృతిక ఛాయాపై ప్రభావం చూపింది. దేశం సాంస్కృతిక ప్రకృతి దృశ్యం విభిన్న ప్రభావాల సమీకరణకు సంశ్లేషణకు నిదర్శనం. నేడు ప్రపంచంలోనే భారత్ వెలుపల అతిపెద్ద ప్రవాస భారతీయుల జనాభాను కలిగి ఉంది, భారతీయులు తమ మాతృభూమి వెలుపల అనేక రంగాలలో అద్భుతాలను సాధిస్తూ భారత దేశ ఘనకీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెపుతున్నారు. విదేశాలలో స్థిరపడిన భారతీయుల సంఖ్య కొన్ని దేశాల జనాభా మొత్తం కంటే ఎక్కువగా ఉంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల సీఈవోలు ఇప్పుడు భారతీయులు, బ్రిటన్ ప్రధానమంత్రి, అమెరికా వైస్ ప్రెసిడెంట్ భారత సంతతి చెందినవారు. చారిత్రాత్మకంగా క్రైస్తవ మత విశ్వాసాలకు పేరుగాంచిన బ్రిటన్ దేశంలో ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి లండన్‌లో ఉన్న హిందూ దేవాలయాలను సందర్శించి సామజిక మాధ్యమాల్లో ప్రచురించడం ప్రపంచ సంస్కృతి వైవిధ్య పరస్పర గౌరవానికి నిలువెత్తు నిదర్శనం.



డి. సంపత్ కృష్ణ
9849097835

భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం అత్యంత అద్భుతమైన లక్షణాలలో ఒకటి భాషా, భారత విస్తీర్ణంలో పదహారు వందల కంటే ఎక్కువ భాషలు మాట్లాడతారు. హిందీ, ఇంగ్లీష్ అధికారిక భాషలుగా ఉన్నప్పటికీ బెంగాలీ, తమిళం, తెలుగు, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, కన్నడతో సహా ఇరవై రెండు గుర్తింపు పొందిన ప్రాంతీయ భాషలు చెలామణిలో ఉన్నాయి. ఈ భాషా సంపద భారతదేశం బహుత్వ సమాజాన్ని, భాషా వైవిధ్యం వేడుకలను ప్రతిబింబిస్తుంది.దేశం సాంప్రదాయ కళలకు, చేతిపనులకు ప్రసిద్ధి చెందింది. ఇవి మన సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగంగా ఉన్నాయి. ప్రతి రాష్ట్రం సొంత ప్రత్యేక కళారూపాలను కలిగి ఉంది. సాంస్కృతిక వైవిధ్యం విభిన్న మత, భాషా, జాతి గుర్తింపులను మాత్రమే కాకుండా అట్టడుగు వర్గాల అనుభవాలను కూడా కలిగి ఉంటుంది. గిరిజన సంస్కృతి ప్రకృతి పర్యావరణ పరిరక్షణను నొక్కి చెబుతుంది, ప్రకృతి ఆరాధన, సోదరభావం గిరిజన సంస్కృతికి ప్రధాన ఆధారం.దీనికితోడు అనేక పండుగలు, సంప్రదాయాలలో శక్తివంతమైన వ్యక్తీకరణను ప్రదర్శి స్తుంది. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూజ వైభవం నుండి ఉత్తరాఖండ్‌లోని కుంభమేళా ఆధ్యాత్మికత, పంజాబ్‌లోని బైసాఖీ, తమిళనాడులోని పొంగల్ వైభవం వరకు, ఈ వేడుకలు దేశం గొప్ప సాంస్కృతికతను ప్రతిబింబిస్తాయి.


సాంస్కృతిక వైవిధ్యం అనేది భారత జాతీయ రాజకీయాలలో ఒక ప్రాథమిక అంశం, ఇది విధానాలను రూపొందించే ఇంకా అమలు చేసే విధానాన్ని రూపొందిస్తుంది. ప్రాతినిధ్యం ప్రాముఖ్యతను గుర్తించడం, సామాజిక ఐక్యతను ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడం, సాంస్కృతిక దౌత్యంలో పాల్గొనడం, సమ్మిళిత విధానాలను అభివృద్ధి చేయడం ద్వారా, రాజకీయ నాయకులు మరింత సామరస్యపూర్వకమైన, సమ్మిళిత దేశాన్ని నిర్మించడానికి సాంస్కృతిక వైవిధ్యం శక్తిని ఉపయోగించడానికి తోడ్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2015లో దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక అనుసంధానాన్ని ఏర్పరచడానికి ఏక్ భారత్ శ్రేష్ట భారత్ ఆలోచన రూపొందించ బడినట్టు ప్రధాన మంత్రి మోడీ స్పష్టం చేశారు. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ స్ఫూర్తిని తన ప్రసంగాల్లో అనేకసార్లు ప్రస్తావించారు. కానీ విధాన రూపకల్పనలో, ఆచరణలో ప్రతిబింబించడం లేదు.నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో విభిన్న జాతులు మీద దాడులు, తీవ్రమయిన ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. భారత రాజ్యాంగం వైవిధ్యానికి హామీ ఇస్తుంది, రాజ్యాంగంలోని ఆర్టికల్ 350ఎ ప్రత్యేకంగా ప్రాథమిక దశలో పిల్లలకు మాతభాషల్లో విద్యను అందించాలని ప్రభుత్వాన్ని నిర్దేశిస్తుంది, ప్రాథమిక హక్కులపై రాజ్యాంగంలోని మూడవ భాగం ముఖ్యంగా దేశంలోని జాతి, మత, భాషా వైవిధ్యాలను గుర్తిస్తూ వాటిని సంరక్షించడానికి హామీలను కల్పిస్తుంది. మతపరమైన సరిహద్దులను కత్తిరించడం, సామరస్యతత్వాన్ని బలోపేతం చేయడం నేటితరానికి అవసరం. పండుగలు, ప్రదర్శనలు సాంస్కృతిక వేదికలు వంటి సాంస్కృతిక మార్పిడిని సులభతరం చేసే వేదికలను ప్రోత్సహించాలి. కానీ సాంస్కృతిక కార్యక్ర మాలను మత విధానాలు చొప్పించేప్రచారానికి వాడుకోరాదు.

సాంస్కృతిక వైవిధ్యం గణనీయమైన ఆర్థిక ప్రభావాలనుతో కూడుకుని ఉంది. భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వం ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తుంది. సాంస్కృతిక అభ్యాసాల పరిరక్షణ, ప్రచారంలో పెట్టుబడి పెట్టడం ద్వారా, ఆర్థిక వృద్ధిని ప్రేరేపించవచ్చు, ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చు.నేటి రాజకీయాలు నిర్ణయాత్మక ప్రక్రియలలో వర్గాలకు తగిన ప్రాతినిధ్యం, అర్థవంతమైన భాగస్వామ్యం ఉండేలా కృషి చేయాలిసిన అవసరం ఉంది. విభిన్న స్వరాలకు వేదికను అందించడం ద్వారా, అట్టడుగు వర్గాలు ఎదుర్కొం టున్న ప్రత్యేక సవాళ్లను పరిష్కరించే సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించే విధానాలను కూడా రూపొందించడం కూడా తక్షణ కర్తవ్యంగా ఉండాలి. రాజకీయ నాయకులు వారి సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా జనాభా విభిన్న అవసరాలను గుర్తించడం, దాడికి గురవుతున్న గిరిజన జాతులవంటి విభిన్న జాతులను సంరక్షించడం, సమూహాలను ఒక్కటి చేయడం వంటి సమస్యలు పరిష్కరించాలి. విభజన రాజకీయాలను తిరస్కరించడం ద్వారా, జాతీయ నాయకులు సామరస్యం, సమగ్రతతో అభివృద్ధి చెందుతున్న సమాజాన్ని నిర్మించడానికి దోహదం చేయవచ్చు.

(మే 21 అంతర్జాతీయ సాంస్కృతిక వైవిధ్య దినోత్సవం)

సురుకు

టైమెంత..?




జంధ్యాల రఘుబాబు
9849753298

సినిమాలోనో టీవీలోనో గుర్తు లేదు కాని టైమెంతయిందండి అన్న ప్రశ్నను కూడా నవ్వించే అంశంగా చేసినవారి హాస్య చతురతకు సలాం చేస్తూ దాని గురించి చెబుతాను. రోడ్డు మీద పోతున్న యాదగిరి టైమెంతయిందండి అని ఎదురుపడ్డ నర్సింగ్‌ను అడుగుతాడు. అప్పుడు అందరి చేతుల్లో సెల్లులు లేవన్న విషయం గుర్తు పెట్టుకోండి. నర్సింగ్ వెంటనే ఎందుకయ్యా నన్ను పరేషాన్ చేస్తవ్, నీవడిగినప్పుడు ఒక టైమ యింటుంది, నేను వాచి చూసేటప్పటికి ఇంకో టైముంటుంది, అది నీకు చెప్పేటప్పుడు ఇంకోటి. అయినా ప్రపంచంలో ఏ రెండు గడియారాలూ ఒకే టైం చూపవని పరిశోధనల్లో తేలింది. ఎందరో శాస్త్రవేత్తలు ఎంతో టైం వెచ్చించీ, వేస్ట్ చేసుకొని దీనిపై చెప్పిందే అది. అందుకే ఇంకోసారి ఎవరినీ టైమెంత అని అడగొద్దు. యాదగిరికి సమజైపోయింది తన టైమేమీ బాగోలేదని.

మణికట్టుపై వేలితో కొట్టి సైగ చేస్తేచాలు సమయమెంతో చెప్పేవాళ్ళు. ఇంకొంతమంది సమయమెంతయింది అని అడిగితే వాచీ చూడకుండానే చెప్పేస్తారు. ఎందుకంటే, ఎలాగంటే కొన్ని నిముషాల ముందే చూసుకొని ఉంటారు. దానికి కొంత చేర్చి చెబుతారంతే. అదీ ఒక పద్ధతి. ఇక కొంతమంది చెడిపోయిన వాచి పెట్టుకొని తమ స్టైల్ కాపాడుకుంటూ ఉంటారు. వాళ్ళను అడిగితే చూడాలి తమాషా. అందుకే వాళ్ళకూ కొన్ని టెక్నిక్కులు ఉంటాయి, మిత్రుని వాచీలోకి అప్పుడప్పుడూ చూస్తుండటం, ఇంకొకరు వేరొకరితో చెప్పినప్పుడు వినడం ఇలా తమ తంటాలేవో తామే పడతారు. వాచీ కొన్న కొత్తలో దాన్ని అందరూ చూడాలన్న ఆశ అందరికీ ఉంటుంది. ఎక్కడ కొన్నావు, ఎంత ఇలా ప్రశ్నలేస్తే ఇంకా ఆనందం. ఇక ఎవరెవరు ఎప్పుడెప్పుడు సమయ మెంతయిందని అడుగుతారా అని ఎదురు చూస్తుంటారు వీళ్ళు. నాకెలా తెలుసంటే స్వీయ అనుభవం!!

ఇక మన సెల్లుల కాలానికొస్తే, ఒక్క చేతి వాచీ మినహా సెల్లు అన్నింటినీ మింగేసింది. అదే కంప్యూటరై పోయింది, ఫోనై పోయింది, ల్యాప్‌టాప్ అయిపోయింది, కెమేరా అయిపోయింది. కొన్ని షరతులకు లోబడి అవి ఉన్నాయనుకున్నా సెల్లుదే ప్రపంచమైపోయింది. సెల్లులో టైము కనిపించినా దాన్ని అందరూ చూడరు, వాచీనే చూస్తారు. దీనికి కారణం వాచీల తయారీదారులు వేసే వ్యాపార ఎత్తుగడలు కావచ్చు, వాచీ ఓ ఆభరణంగా వాడేవారు కావచ్చు, రకరకాల సందర్భాల్లో దాన్ని బహుమతిగా ఇచ్చేలా అలవాటు చేసి ఉండొచ్చు, డార్విన్ చెప్పినట్టు ఆ వాచీ తాను బతకడం కోసం తనను తాను ఎప్పుడూ మార్చుకుంటూ, రకరకాల రంగుల్లో, సైజుల్లో, ధరల్లో దొరుకుతూ ఉండొచ్చు. ఏమైనా పైన చెప్పుకున్న టైం మీద జరిగిన పరిశోధనలాంటిది ఈ వాచీపై కూడా చేయవలసి ఉంది.

కొందరు అసలు సమయానికంటే కాస్త ముందుగా పెట్టుకుంటారు ముఖ్యంగా గోడకు తగిలించిన గడియారాల్లో. వాటిలోని పెట్టే సమయం గురించి కాస్త సమయం వెచ్చిద్దాం. మా కజిన్ మనోజ్ వాళ్ళింటికి ఇంట్లోవాళ్ళు ఏదో ఇచ్చి రమ్మంటే పోయాను. ఉదయం తొమ్మిదిన్నర అయింది, ఆఫీసుకు ఇంకా అర్ధగంట సమయం ఉంది. ఆ ఇచ్చేదేదో ఇచ్చేసి వాళ్ళ గడియారం సైడు చూస్తే ఒక్కసారి గుండె ఆగినంత పనైంది. దాంట్లో పదీ పది అయింది సమయం. ఇంతలో సోదరి సుధ అది నలభై నిముషాలు ఫాస్టుగా ఉంటుదన్నయ్యా అంటే ఊపిరి పీల్చుకున్నాను. ఓ పది నిముషాలు ముందు పెట్టుకుంటే పరవాలేదని కూడా తనే చెప్పింది. అప్పుడే మనోజుకు ఓ సలహా ఇచ్చాను. ఇంట్లో ఐదుగురికీ ఐదు గడియారాలు గోడకు



వరుసగా పెట్టి, వాటి కింది మనోజ్, సుధ, సరస్వతి, మైత్రి, చిన్ను ఇలా ఎవరికి కావలసిన టైము వాళ్ళకు పెట్టమని, ఆరోది పెట్టి దానికింద ఒరిజనల్ లేదా సరైన టైము అని రాయమనీ చెప్పాను. అందరమూ నవ్వుకున్నాక తనే చెబుతున్నాడు ఎయిర్‌పోర్టుల్లాంటి కొన్నిచోట్ల వివిధ దేశాల సమయం చూపించినట్టుగా ఉంటుందని. మళ్ళీ నవ్వులు.

టీవీ చూస్తూ ఛానల్స్ మారుస్తూ కూచుంటే సమయమే తెలియదు. సినిమా మధ్యలో వ్యాపార ప్రకటనలొస్తాయి. అప్పుడు ఇంకో ఛానల్ పెడితే అక్కడా ప్రకటనలొస్తూ ఉంటాయి. అంటే వీళ్ళంతా కూడబలుక్కొని కొన్నిసార్లు బలుక్కోకుండా కొన్ని సార్లు ఒకరినొకరు ఫాలో అవుతుంటారని తెలిసిపోతుంది. మనం టీవీ చూసి టైం వేస్ట్ చేస్తున్నామనుకుంటాం కానీ అదే సమయాన్ని ఎంత సద్వినియోగం చేసుకుంటారో వాళ్ళు. అలా సమయం ప్రకారం వాళ్ళు పోతుంటారు. టైమెంతయిందో, అవుతుందో వాళ్ళకు తెలిసినంత మనకు తెలీదు. సమయపాలన అనుకుంటూ గడియారం ముల్లులను మార్చుకుంటూ ఉంటాము కాని ఆ ముల్లుల కదలికలనే డబ్బురూపంలోకి మార్చుకునే వాళ్ళూ ఉంటారని మన గమనంలో పెట్టుకోవాలి. సమయమంటే డబ్బు, డబ్బంటే సమయం అన్నది మార్కెటింగ్ జనాలు చెప్పే ఓ సూత్రం.

సమయానికి తగూ మాటలాడెనె అని త్యాగయ్యగారు రాసే ఉన్నారు. అలా సమయమెంతయ్యింది అని కాదు, ఆ సమయానికి ఎలా ఉన్నావు, ఎలా మాట్లాడుతున్నావు అన్నది ఎంతో ప్రధానం. ఎన్నికల సమయాన ఆ మాటలు ఒక లాగ, తరువాత ఒకలాగా ఉంటాయన్నది అందరికీ తెలుసు. అది సమయాన్నిబట్టి మారుతూ ఉంటుంది కూడా. ఎన్నికల్లో గెలుపూ ఓటమి

> ఎన్నికల్లో గెలుపూ ఓటమి ఒకేలాగ తీసుకుంటాము, మేము స్థితప్రజ్ఞులము అనొచ్చు పైకి. ఎన్నికలముందు గట్టిగా అరచినోళ్ళు తరువాత సైలెంటైపోవచ్చు. మేము సమయానికి తగినట్టే మాట్లాడాము అయినా ఎందుకిలా అయిందబ్బా అని ఒకరి గడ్డం ఒకరు గీక్కోవచ్చు. అలా గీక్కుంటూ సమయం వృథా చేయొద్దు అనుకొని, అనుకోవడమే కాదు అసలు గడ్డం ఉన్నోళ్ళనందరినీ దూరం పెడదామన్న నిర్ణయం ఈ సమయంలో తీసుకోవచ్చా లేదా అన్నదీ ఆలోచించవలసిన ప్రశ్నే. సమయ సమయానికీ గడ్డం మార్చడమన్నదీ ఓ కళ అని తెలుసుకోవాలి. కళలు అంత తొందరగా ఒంటబట్టవు. వాటికి తగినంత సమయం కేటాయించాలి. ఓసారి టైమెంతయిందో చూసుకోండి వచ్చేది ఒక్క ఆదివారమే.

ఒకేలాగ తీసుకుంటాము, మేము స్థితప్రజ్ఞులము అనొచ్చు పైకి. ఎన్నికలముందు గట్టిగా అరచినోళ్ళు తరువాత సైలెంటైపోవచ్చు. మేము సమయానికి తగినట్టే మాట్లాడాము అయినా ఎందుకిలా అయిందబ్బా అని ఒకరి గడ్డం ఒకరు గీక్కోవచ్చు. అలా గీక్కుంటూ సమయం వృథా చేయొద్దు అనుకొని, అనుకోవడమే కాదు అసలు గడ్డం ఉన్నోళ్ళనందరినీ దూరం పెడదామన్న నిర్ణయం ఈ సమయంలో తీసుకోవచ్చా లేదా అన్నదీ ఆలోచించవలసిన ప్రశ్నే. సమయ సమయానికీ గడ్డం మార్చడమన్నదీ ఓ కళ అని తెలుసుకోవాలి. కళలు అంత తొందరగా ఒంటబట్టవు. వాటికి తగినంత సమయం కేటాయించాలి. ఓసారి టైమెంతయిందో చూసుకోండి వచ్చేది ఒక్క ఆదివారమే.

టమోటాతో నిగారింపు

ఎండలకు కొంచెం సేపు బయటకు వెళ్ళి వచ్చినా చర్మం నిగారింపు కోల్పోతుంది. ఎండ తగలకుండా ముఖాన్ని ఎంత కవర్ చేసినా సమస్య ఏర్పడుతూనే ఉంటుంది. అందుకే చర్మాన్ని కాపాడుకోవడం సవాలుతో కూడుకున్న పని. చర్మాన్ని మెరిసేలా చేయడమే కాదు, ఆరోగ్యంగానూ ఉంచుకోవాలి.



ఇందుకు క్రీములు లోషన్లు వంటి వాటిని ఉపయోగించడం కంటే కొన్ని రకాల సహజ పద్ధతుల్ని ఉపయోగించి కాంతిలీనేలా చేసుకోవచ్చు. ఇందుకు టమోటాలు ఉపయోగపడతాయి.

- టమోటాలో 16 శాతం విటమిన్ ఎ ఉండటం వల్ల సరిగ్గా ఉపయోగిస్తే ఎంతటి కఠినమైన చర్మాన్నైనా మృధువుగా మారుస్తుంది. అంతేకాదు, వయస్సు వల్ల ముఖంపై ఏర్పడే మచ్చలను సైతం తగ్గించడానికి సహాయపడుతుంది.
- ఇందులో ఉండే విటమిన్ సి చర్మంలో కొల్లాజెన్ స్థాయిలను 22 శాతానికి పైగా పెంచుతుంది.
- 5 శాతం కంటే ఎక్కువ బి6 విటమిన్ ఉంటుంది. ఇది దెబ్బతిన్న చర్మ కణాలను రిపేర్ చేయడంతో పాటు ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించేందుకు ఒక రక్షిత పొరను ఏర్పరుస్తుంది.
- టమోటాల్లో అధిక మొత్తంలో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ కలిగి ఉంటాయి. ఇవి చర్మంపై పొరను ఏర్పరచి, తేమగా ఉంచుతాయి.

మొటిమలు పోవాలంటే...

మహిళలు మొటిమల వల్ల చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. వీటిని తొలగించడానికి ఏవేవో క్రీములు ఉపయోగిస్తుంటారు. ఈ మొటిమలను కొన్ని చిన్న చిన్న వంటింటి చిట్కాలతోనే పోగొట్టుకోవచ్చు..



- అన్నీ రకాల చర్మ వ్యాధుల్నినిమ్మకాయ రసం అరికడుతుంది. ఇందులో ఉండే విటమిన్ సి వల్ల విషపు కణాలు దూరం అవుతాయి.
- చిటికెడు పసుపు, చిటికెడు నిమ్మరసాన్ని కలిపి ఆ పేస్టును మొటిమలు ఉండే ప్లేస్‌లో అప్లైయ్ చేస్తే ఎలాంటి మచ్చలైనా తొలగిపోతాయి.
- కలబంద గుజ్జును, నిమ్మ రసాన్ని కలిపి ఆ పేస్టుని ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తరువాత నీటితో కడగాలి. ఇలా చేస్తే మొటిమలు పోవడమే కాక ముఖం ప్రశాంతవంతంగా మారుతుంది.
- బంగాళదుంప ముక్కల్ని ముఖంపై ఉన్న మచ్చలపై రుద్దితే ఫలితం ఉంటుంది.
- దోసకాయ గుజ్జు పాల మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే ముఖం ప్రకాశవంతంగా మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

మొదట్లో ఐరన్ లెగ్ అన్నారు



జీవితం పట్ల పూర్తి అవగాహన, సామాజం పట్ల బాధ్యత కలిగిన వినూత్నమైన నటి విద్యాబాలన్... సమాజంలో ఓ మంచి మార్పును కోరుకునే మానవతావాది. సినీ పరిశ్రమలో సర్వసాధరణంగా భావించే క్యాస్టింగ్ కౌచ్‌ను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి. వయసు నాలుగు పదులు దాటినా తన అందమైన నటనతో విశేషమైన ప్రేక్షకాదరణ పొందుతోంది. తన నైపుణ్యానికి గుర్తుగా ఇటీవల ఫెమినా మామార్త్ బ్యూటిఫుల్ ఇండియన్స్ 2023కు గాను అత్యుత్తమ ప్రతిభా అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...



విద్య 1978, జనవరి 1న కేరళలో పాల్‌ఘాట్‌లో జన్మించింది. ఈమె అత్యంత చిన్న వయసులో ఉన్నప్పుడే వీరి కుటుంబం ముంబైలో స్థిరపడింది. తండ్రి పి.ఆర్.బాలన్. తల్లి సరస్వతీ బాలన్. చిన్నతనం నుండి సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. మాధురీ దీక్షిత్ నటనతో ప్రేరణ పొంది సినిమా రంగంలో అడుగు పెట్టాలని ఆశపడేది. సెయింట్ ఆంథోనీ బాలికల పాఠశాల, చెంబూరులో తన స్కూల్ విద్యను పూర్తి చేసింది. నటనపై ఉన్న ఆసక్తితో పదహారేండ్ల వయసులో ఏక్తాకపూర్ నిర్మించిన 'హమ్ పాంచ్' అనే హిందీ సీరియల్లో నటించింది. హీరోయిన్ కావాలని ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాలను కుంది. అయితే ఇంట్లోవాళ్ళు ముందు చదువు పూర్తి చేయ మన్నారు. అలా సోషియాలజీ లో ముంబయి యూనివర్శిటీ నుంచి మాస్టర్ డిగ్రీ పొందింది. ఆ తర్వాత మెల్లగా సినిమాల్లో ప్రయత్నించింది.

నిరుత్సాహపడలేదు...

మొదట మలయాళంలో మోహన్‌లాల్ సరసన చక్రం సినిమాకు సైన్ చేసింది. కానీ దాని నిర్మాణంలో సమస్యలు తలెత్తడం వల్ల ఆ చిత్రం మధ్యలోనే ఆపేశారు. దాంతో మలయాళం ఇండస్ట్రీలో విద్యకు అవకాశాలు రాలేదు. పైగా ఐరన్ లెగ్ అనే ట్యాగ్ లైన్ అంటగట్టారు. అయితే ఏమాత్రం నిరుత్సాహపడకుండా తమిళంపై దృష్టి పెట్టింది. 2002లో రన్ సినిమా కోసం విద్యను హీరోయిన్‌గా ఎంపిక చేస్తున్నారు. కానీ తర్వాత మీరాజాస్మిన్‌తో రీప్లేస్ చేశారు. అలాగే 'మనసెల్లం' అనే సినిమాలో తీసుకుని త్రిషాతో రీప్లేస్ చేశారు. దాంతో అక్కడ కూడా ఆమెకు ఎదురుదెబ్బ తగిలింది. చివరికి 2003లో కలారి విక్రమన్ అనే సినిమా పూర్తి చేసినా అది విడుదల కాలేదు. ఇలా కెరీర్ ప్రారంభంలోనే విద్య చాలా ఇబ్బందులు పడింది.



వెనుదిరిగి చూడలేదు

2005లో 'పరిణిత' సినిమా ద్వారా హిందీలో రంగప్రవేశం చేసింది. అది ఫర్వాలేదనిపించడంతో సంజయ్‌దత్ పక్కన 'లగే రహో మున్నా భాయ్'లో జాహ్నవి పాత్రలో నటించింది. ఈ చిత్రంతో మంచి పేరు సంపాదించుకుంది. ఇక అప్పటి నుండి వెనుదిరిగి చూడ లేదు. తర్వాత పా, నో వన్ కిల్డ్ జెస్సికా, హే బేబి, బూల్ బూలాఇయా, కిస్మత్ ఇనెక్షన్, నో వన్ కిల్డ్ వంటి చిత్రాలలో తన అద్భుతమైన నటనకు పేరు తెచ్చుకుంది.

విమర్శకుల ప్రశంసలు

తర్వాత 2011లో సిల్క్‌స్మిత జీవితం ఆధారంగా వచ్చిన 'డర్టీ పిక్చర్' సినిమాతో ఆమె సినీ కెరీర్ మలుపు తిరిగిందని చెప్పాలి. ఈ చిత్రంతో బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్లలో ఒకరిగా మారింది. అప్పటి నుంచి వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. డర్టి పిక్చర్‌లో విద్యాబాలన్ నటనకు విమర్శకులు సైతం ప్రశంసలు కురిపించారు. అయితే 2012లో సిద్ధార్థ్ రాయ్ కపూర్‌ను పెండ్లి చేసుకున్న తర్వాత ఇలాంటి పాత్రకు స్వస్తి చెప్పింది.

ఏదో ఒక ప్రత్యేకత

గణిత శాస్త్రవేత్త జీవితం ఆధారంగా వచ్చిన 'శకుంతల దేవి'లో నటించింది. ఈ చిత్రంలో ఓ టీనేజ్ కూతురికి తల్లి పాత్రలో కనిపించిన విద్య ప్రేక్షకులకు మరింత దగ్గరయింది. ఇక తెలుగులో ఎన్టీఆర్ బయోపిక్‌లో సీనియర్ ఎన్టీఆర్ భార్య పాత్రలో బాలకృష్ణ పక్కన జోడి నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఘన్‌చక్కర్, షాదీకి సైడ్ ఎఫెక్ట్స్ వంటి చిత్రాల్లో నటించింది. ఈమె ఏ పాత్ర చేసినా అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే వేరెవరినీ అనుసరించ కుండా తనదైన శైలిని ప్రతిచోటా ప్రదర్శిస్తుంది. అందుకే ప్రేక్షకుల్లో తనదంటూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకోగలిగింది.

మహిళా హక్కులపై...

ఎన్నో కష్టాలను భరించి, సమస్యలను ఎదుర్కొని విద్య సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. అంతేకాదు ఏ ఫంక్షన్‌లో పాల్గొన్నా చీరకట్టుతో వచ్చి చీరకు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా పేరు తెచ్చుకుంది. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ, మహిళల సమానత్వం, వేధింపులు, హక్కులపై తన గొంతు విప్పుతూ చురుకైన పాత్ర పోషిస్తుంది. భామ్లా ఫౌండేషన్ వంటి సంస్థల సహకారంతో #BeatAirPollution వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ సమస్యల గురించి ప్రజల్లో అవగాహన పెంచుతుంది. అలాగే #MeToo ఉద్యమానికి మద్దతు ఇస్తుంది.

అనుభవాలు పంచుకుంది

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్‌ను చాలామంది సర్వసాధారణంగా భావిస్తారు. దాని భారిన పడిన వారు బయట నోరు విప్పడం చాలా అరుదు. తమ సమస్య బయటకు చెప్పుకుంటే అవకాశాలు రావని భయం. అయితే విద్యాబాలన్ అలా కాదు. నటీమణులపై జరుగుతున్న ఈ తరహా హింసపై చర్చ జరుగుతున్న సమయంలో స్పందించింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు ఎదురైనా చేదు అనుభవాల గురించి చెప్పుకొచ్చింది. అవి సోషల్ మీడియాలో కూడా బాగా వైరల్ అయ్యాయి.

అతని ఆలోచన అర్థమయింది

దక్షిణాది సినిమాల్లో నటించేందుకు ప్రయత్నిస్తున్న రోజుల్లో ఆమెకు ఎదురైన సంఘటన గురించి వివరిస్తూ "నేను సౌత్ ఇండియా ఫిల్మ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టడానికి కష్టపడుతున్న రోజుల్లో జరిగింది. నేను ఓ యాడ్ ఫిల్మ్ కోసం డైరెక్టర్‌ను కలవడానికి చెన్నై వెళ్లాను. అక్కడ ఓ కాఫీ షాప్‌లో కూర్చొని మాట్లాడుకుందాం అని దర్శకుడితో చెప్పా. అయితే అతను నన్ను రూమ్‌కి వెళ్లి మాట్లాడుకుందాం అని పదే పదే అడిగాడు. అప్పుడే అతని ఆలోచన ఏమిటనేది అర్థమైంది. నేను అప్పుడు తెలివిగా గది లాక్ వేయకుండా కొంచెం తెరిచి ఉంచాను. దాంతో ఆ దర్శకుడు ఏమీ మాట్లాడకుండా ఐదు నిమిషాల తర్వాత అక్కడ నుంచి వెళ్లిపోయాడు" అన్నది.

బయట పడేందుకు చాలా కష్టపడ్డా...

సమయస్ఫూర్తిగా ప్రవర్తించడం వల్లే క్యాస్టింగ్ కౌచ్ నుంచి తప్పించుకోగలిగానని విద్య చెప్పింది. అయితే నటించాల్సిన యాడ్ ఫిల్మ్ నుంచి తప్పుకున్నందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందని చెప్పింది. ఇప్పటికీ తాను ఆ సంఘటనను మర్చిపోలేకపోతున్నానని చెప్పింది. తర్వాత కూడా ఇలా భయపెట్టే ఘటనలు చాలానే ఎదురైయ్యాయని ఇంటర్వ్యూలో పంచుకుంది. అంతేకాకుండా ఇలాంటి ఘటనల వలన తాను కొంత కాలం మానసిక ఇబ్బందికి గురయ్యానని కూడా చెప్పింది. దాని నుంచి బయట పడటం కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందని కూడా తెలిపింది. ఆ కాఫీ షాప్ ఘటన జరిగిన తర్వాత ఆ దర్శకుడు తనను సినిమా నుంచి తొలగిచడమే కాకుండా తనను బాడీ షేమింగ్ చేశాడని వాపోయింది.

- సలీమ

ఆరోగ్య-వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ధృఢత్వం కోసం జిమ్‌లు కూడా ఉంటాయి' అని కేరళ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఈ కేంద్రాలు వారానికి ఆరు రోజులు పని చేస్తాయి. పలు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుంటే కేరళలో మాత్రం పరిస్థితి భిన్నమని, ఇదే 'నిజమైన కేరళ స్టోరీ' అని ఎల్‌డీఎఫ్ వ్యాఖ్యానించింది. ప్రజారోగ్య రంగంలో కేరళ తరహా విజన్‌కు ఈ కేంద్రాలు తాజా ఉదాహరణ అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగానికి ఈ కేంద్రాలు మరింత ఊతమిస్తాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వంద రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా నివారించడం, సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి వార్షిక వైద్య పరీక్షలు నిర్వహించడం, వాటికి అనుగుణంగా అవసరమైన వారికి చికిత్స అందించడం ఈ కేంద్రాల ఉద్దేశం. ప్రజలు తమ జీవన సరళిని మార్చుకుని ఆరోగ్యవంతులుగా ఉండేలా స్థానిక సంస్థల భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమాలు కూడా చేపడతారు.

అనాలోచిత నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం అమలు మరింత ప్రతికూల ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం కలుగుతోంది. గతంలో ఎదురైన అనుభవాలు, జరిగిన లోటుపాట్ల నుండి ఎటువంటి పాఠాలు నేర్చుకోకుండానే ప్రభుత్వం ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటోంది. 2016లో నోట్ల రద్దు మొదలుకొని జీఎస్‌టీ ప్రవేశపెట్టడం వరకూ,దివాలా నిబంధనలు, సీఏఏ- ఎన్‌ఆర్‌సీ అమలు, వ్యవసాయ చట్టాలు, కార్మిక చట్టాలు..ఇవన్నీ ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్నవే. భారత్ వంటి అతిపెద్ద దేశంలో ఇతర రాష్ట్రాలను సంప్రదించి ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. గత తొమ్మిది సంవత్సరాలలో దురదృష్టవశాత్తూ ఇలాంటి కసరత్తు ఏదీ జరగలేదు.

కన్నడనాట కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

సతీష్ జర్కిహోలీ, రామలింగా రెడ్డి, బీజడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఎంబీ పాటిల్ ఉన్నారు. పలువురు సీనియర్ నేతలు మంత్రి పదవులను ఆశించినప్పటికీ అనేక దఫాల చర్చల అనంతరం కాంగ్రెస్ నాయకత్వం ఈ ఎనిమిది మందిని ఖరారు చేసింది.

ఇది ప్రజా విజయం సిద్ధరామయ్య

ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ముఖ్య మంత్రి సిద్దరామయ్య మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, కాంగ్రెస్ విజయం ప్రజా విజయమని అన్నారు. మార్పును కోరుకున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారంటీలను క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నింటినీ రాబోయే ఐదేళ్లలో అమలు చేస్తామని అన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సిద్దరామయ్యను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆలింగనం చేసుకుని అభినందించారు.

పెద్ద నోట్ల రద్దుపై వచ్చిన ఆరోపణలు రుజువయ్యాయి!

(మొదటిపేజీ తరువాయి)

అసంఘటిత రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం ధ్వంసమయ్యాయి. మోడీ పెద్ద నోట్ల రద్దు తర్వాత చలామణిలో వున్న నగదు 83శాతానికి పెరిగింది. అవినీతి చట్టబద్ధమైంది, పైగా పలు రెట్లు పెరిగింది. అందరూ ఖండించదగ్గ తీవ్రవాద దాడులు, కార్యకలాపాలు కొనసాగుతునే వున్నాయి, అమాయకుల ప్రాణాలను తీస్తునే వున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.మన ఆర్థిక వ్యవస్థను మోడీ ధ్వంసం చేయడాన్ని, జాతీయ ఆస్తులను లూటీ చేయడాన్ని ప్రతిఘటించాలని, ఆ చర్యలను ఓడించాలని సీపీఐ(ఎం) ఈ ప్రకటనలో కోరింది. ఆశ్రిత పక్షపాతులైన కార్పొరేట్లు, మతోన్మాదుల మధ్య సంబంధాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని పిలుపిచ్చింది. ఇటువంటి నియంతృత్వ ఏకపక్ష ప్రజా వ్యతిరేక చర్యల నుంచి మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి మనందరం ఐక్యంగా వుండాలని ప్రజలకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

విధ్వంసం సృష్టిస్తున్న మోడీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రధాని మోడీ దేశంలో విధ్వంసం సృష్టిస్తున్నారని, భారత సమాజానికి బీజేపీ పనికిరాదని, 2024 ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ గతంలో మోడీ పెద్ద నోట్లను రద్దు చేసి నల్లధనం వెలికితీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని హామీనిచ్చాడని, మీ ఖాతాల్లో మోడీ రూ.15 లక్షలు ఏమైనా వేశాడా ? అని ప్రశ్నించారు. దీనికి హాజరైన ప్రజల నుంచి లేదు.. లేదు అంటూ సమాధానమిచ్చారు. ప్రజలకివ్వాల్సిన డబ్బులన్నింటినీ అదానీ, అంబానీలకే ఇస్తున్నాడన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి ఓట్లను దండుకొని మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీని చూస్తోందన్నారు. మోడీ దేశంలో చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. దేశానికి 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అవసరమని, మిగులు ధాన్యాన్ని పేదలకు పంచడానికి మోడీకి చేతులు రావడం లేదన్నారు. గోదాముల్లోని ధాన్యాన్ని పంచకపోతే దాడులు చేసి మరీ పంచుతామన్నారు.

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు పెడుతున్నారని, వ్యవసాయ కూలీలను ఆదుకోవడానికి 'కూలీబంధు' పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని బి. వెంకట్ డిమాండ్ చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ నిలబడడం హర్షణీయమన్నారు. కానీ బీజేపీ అమలు చేస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను సీఎం కేసీఆర్ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 50 కేంద్రాల్లో 40 వేల మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ పట్టాలతోపాటు రూ.5.50 లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టుకునేలా చేయాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడడమంటే పేదలకు పట్టాలిచ్చి, ఇండ్లు కట్టుకునేలా చర్యలు తీసుకుంటేనే మేం మద్దతిస్తామన్నారు. ఎల్కతుర్తి మండలకేంద్రంలో ఏడాదిగా పోరాటం చేసి 120 మంది గుడిసెలు వేసుకొని, అనంతరం వాటిస్థానంలోనే ఇండ్లను నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. అండగా నిలిచిన సంఘానికి కార్యాలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. మీ స్పూర్తితో దేశవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో పేదలకు ఇండ్లను కట్టించి ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలు లేవంటుందని, ఎల్కతుర్తిలో ప్రభుత్వ స్థలంలోనే ఇండ్లను నిర్మించారని, మహిళల పేరిట పట్టాలతోపాటు ఇండ్లను కట్టుకోవడానికి రూ.5.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలోని ఎర్రజెండా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.7.40 లక్షలు వెచ్చించి 3.50 లక్షల ఇండ్లను నిర్మించి పేదలకు పంపిణీ చేసిందన్నారు. ఆ రాష్ట్రంలో ధాన్యాన్ని రూ.1,900 ధరకు అదనంగా రూ.700 బోనస్ చెల్లించి కొనుగోలు చేసిందన్నారు.

షరతులు ఎత్తేయ్యాలి : ప్రసాద్, చక్రపాణి

రాష్ట్ర ప్రభుత్వం జీవో 58, 59లలో పేర్కొన్న షరతులను ఎత్తేసి పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు. గుడిసెవాసులు వేసుకున్న స్థలాల్లో సర్వే చేసి కలెక్టర్ వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి సుందరయ్యనగర్‌లో పేదలు నిర్మించుకున్న కాలనీకి మంచినీటి వసతిని కల్పించాలని, వీధి దీపాలతోపాటు రోడ్లను నిర్మించాలని స్థానిక అధికారులు, సర్పంచ్‌ను డిమాండ్ చేశారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య అందరికీ ఆదర్శప్రాయుడు అని సిఐటియు హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి అన్నారు. సుందరయ్య నగర్‌గా వెలిసిన ఈ ప్రాంతంలో ప్రారంభించుకున్న ఈ కార్యాలయం విజ్ఞాన కేంద్రంగా విలసిల్లాలన్నారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు మాట్లాడుతూ. పేదలకు పట్టాలివ్వాలని ఈనెల 29న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు స్వరూప, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, స్వరూప, సతీష్, మమత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బుల్‌డోజర్‌కు హృదయం ఉండదు...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్నింటిని అణచివేసే బుల్‌డోజర్‌కు హృదయం, బలం ఉండబోవని ప్రముఖ నటుడు, రచయిత ప్రకాష్ రాజ్ వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుప్రీకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ రచించిన బుల్ డోజర్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనలో ఉన్న భయమే బుల్ డోజర్ బలమనీ, దానికంటూ బలముండబోదని చెప్పారు. ఆ భయమే ప్రస్తుతం ఒక జాతీయ వ్యాధిగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మనస్సాక్షి ఉన్న వారే మనుషులనీ, అలాంటి మనిషి శ్రీనివాస్ తన గొంతుకను పుస్తకరూపంలో వినిపించారని కొనియాడారు. సమాజంలో ఇలాంటి మరిన్ని గొంతుకలు రావాలని ఆకాంక్షించారు. తన స్నేహితురాలు రచయిత్రి గౌరీలంకేష్ మరణం సందర్భంగా తమకు భయం లేదంటూ నినదించామని గుర్తుచేశారు. ప్రశ్నించడం ప్రజల హక్కని తెలిపారు. 'మూర్ఖుడి చేతిలో దేశాన్ని పెట్టాం. వాడికి హృదయం లేదు. పిచ్చి, పిచ్చి వేషాలు వేస్తున్నాడు. చరిత్రలో ఏ నియంతా మనుగడ సాగించినట్టు దాఖలాలులేవు. అలాంటి వారికి చరిత్రే లేదు. పరిణామక్రమానికి, ప్రకృతికి రైట్ వింగ్ (మతోన్మాదం) వ్యతిరేకమైనది. అలాంటి వాటికి భవిష్యత్తు కూడా ఉండదనేది స్పష్టం...' అని ప్రకాష్ రాజ్ తెలిపారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం భాష, భావజాలం, అభిప్రాయ వ్యక్తీకరణకు వాడే పదజాలం ఇలా అన్నింటిపై బుల్ డోజర్ ప్రయోగిస్తున్నారని తెలిపారు. శ్రీనివాస్ పుస్తకంలో పురాతన , మధ్య యుగాల చరిత్రతో పాటు ప్రస్తుతం జరుగుతున్న తంతు కనిపిస్తుందని తెలిపారు. ఒక పరిశోధకుడు, ఒక రచయిత, ఒక తాత్వికుడి కలయిక ఉన్న వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరు పుస్తకాన్ని జాగ్రత్తగా చదివి అర్థం చేసుకోవాలని కోరారు.పుస్తక పరిచయకర్త, బీబీసీ తెలుగు సంపాదకులు జీ.ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ శ్రీనివాస్ తన పుస్తకం ద్వారా వర్తమాన సందర్భం, సంక్లిష్టతను చెప్పే ప్రయత్నం చేశారన్నారు. నిస్పృహ, నిస్సహాయత నుంచి వెలుగు కోసం ప్రయత్నించడంతో పాటు బయటికి వెళ్లే మార్గంపై చర్చను రేకెత్తించారని తెలిపారు. ఒంటరి జీవులు, ఒంటరి సమూహాలుగా మారి భయపడుతున్న వేళ శ్రీనివాస్ అభిప్రాయం చుట్టూ తిప్పుకునేలా ఉందన్నారు. అనుకూల పరిస్థితులను కాలదన్నుకోవద్దంటూనే, ఈ ఏడాది అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారని వివరించారు.

సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ అసహన జాడ్యం పాలకవర్గాల నుంచి ప్రవహించి అందరిలోకి ప్రవేశించిందని తెలిపారు. అభిప్రాయ వ్యక్తీకరణ భరించలేని పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. భావప్రకటనపై దుర్మార్గమైన దాడిని తగ్గించుకోవాలని కోరారు. గౌరీలంకేష్ చనిపోయినా ఆ మార్గంలో చాలా మంది పయనిస్తున్నారని, ఇప్పుడు అందర్నీ అన్నిరకాలుగా భయపెడుతున్నారనీ, ఇలాంటివాటిని ఎదుర్కోకపోతే చాలా ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమానికి మలుపు బాల్ రెడ్డి స్వాగతం పలికారు.

సుప్రీంను అవమానించిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డినెన్స్ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రత్యక్ష ధిక్కారమనీ, దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని అవమానించడమేనని అన్నారు. ఢిల్లీలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లతో సహా సేవల విషయాలలో తను ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్రం తగ్గించిన కొన్ని గంటల తర్వాత ఆయన స్పందిస్తూ.. "ఇది ప్రజాస్వామ్యంపై కేంద్రం చేసిన వికారమైన జోక్" అని అన్నారు. "కేంద్రం రివ్యూ పిటిషన్ ఎందుకు వేసింది? కేంద్రం సుప్రీంకోర్టును సవాల్ చేస్తున్నది? ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తాం" అని కేజ్రీవాల్ తెలిపారు.ఐఏఎస్, డానిక్స్ క్యాడర్ అధికారుల బదిలీ, క్రమశిక్షణా చర్యల కోసం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీని రూపొందించడానికి కేంద్రం శుక్రవారం ఆర్డినెన్స్‌ను విడుదల చేసింది. ఢిల్లీలో పోలీసు, పబ్లిక్ ఆర్డర్, భూమికి సంబంధించిన సేవలను మినహాయించి సర్వీసెస్ నియంత్రణను ఎన్నికైన ప్రభుత్వానికి సుప్రీంకోర్టు అప్పగించిన వారం తర్వాత ఇది చోటు చేసుకోవటం గమనార్హం. సమాఖ్య నిర్మాణాన్ని కేంద్రం దెబ్బతీసినందున పార్లమెంటులో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించడానికి ప్రతిపక్ష నేతలను సంప్రదిస్తామని కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్ ఇంటింటికీ ప్రచారం ప్రారంభించి మెగా ర్యాలీ నిర్వహించనుంది.నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీలో ఢిల్లీ ముఖ్యమంత్రి అధ్యక్షుడిగా ఉంటారు. ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ హోం సెక్రెటరీ, అథారిటీకి సభ్య కార్యదర్శిగా ఉంటారు. అధికారం ద్వారా నిర్ణయించాల్సిన అన్ని విషయాలు హాజరైన, ఓటు వేసిన సభ్యుల మెజారిటీ ఓట్ల ద్వారా నిర్ణయించబడతాయి. అయితే, అభిప్రాయ భేదాల విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయమే అంతిమం.

తప్పుడు నిర్ణయాన్ని కప్పిపుచ్చేందుకే

న్యూఢిల్లీ : రెండు వేల రూపాయల కరెన్సీ నోటును చలామణి నుండి ఉపసంహ రిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనపై ప్రతిపక్ష పార్టీలు శనివారం మండిపడ్డాయి. గతంలో చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. నోట్ల రద్దు ప్రహసనంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. 'మొదటిసారి నోట్ల రద్దు నిర్ణయం తీసుకొని దేశ ఆర్థిక వ్యవస్థకు లోతైన గాయం చేశారు. దీనివల్ల అసంఘటిత రంగం మొత్తం నాశనమైంది. చిన్న, మధ్య తరహా సంస్థలు మూతపడ్డాయి. కోట్లాది ఉద్యోగాలు పోయాయి' అని ఆయన ట్వీట్ చేశారు. ఇప్పుడు రూ. 2000 నోటును రద్దు చేస్తున్నారని అంటూ ఇది మొదటి తప్పును కప్పిపుచ్చుకోవడానికా అని ప్రశ్నించారు. నిష్పాక్షిక విచారణ మాత్రమే వాస్తవాలను బయటపెడుతుందని తెలిపారు. రాజ్యసభలో స్వతంత్ర సభ్యుడు కపిల్ సిబల్ కూడా కేంద్ర నిర్ణయంపై విమర్శలు చేశారు. అవినీతిని నిర్మూలించేందుకే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నామని 2016లో ప్రధాని చెప్పుకొచ్చారని గుర్తు చేశారు. 2016లో రూ. 17.7 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉంటే 2022లో రూ. 30.18 లక్షల కోట్లు చలామణిలో ఉన్నదని, మరి అవినీతి ఎక్కడ తగ్గిందని ప్రధానిని ప్రశ్నించారు. నగదు టాయిలెట్ కాగితంగా మారిందని ప్రజలు భయపడుతున్నారని, ఏ నాగరిక దేశం కూడా తన ప్రజలను ఇలా భయాందోళనలకు గురి చేయదని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. అసలు రూ. 2000 నోటును ఎందుకు ప్రవేశపెట్టారని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. త్వరలో రూ. 500 నోటును కూడా రద్దు చేస్తారా అని అడిగారు. నోట్ల రద్దు వ్యవస్థీకృత దోపిడీ అని, చట్టబద్ధమైన తప్పిదమని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పిన మాటలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గుర్తు చేశారు. ప్రధాని మోడీ అనాలోచిత నిర్ణయాలకు ఇది ఒక ఉదాహరణ అని ఆయన చెప్పారు.

టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ కె.భాస్కర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గవర్నమెంట్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా (టీజీసీజీటీఏ) డాక్టర్ కె.భాస్కర్ ఎన్నికయ్యారు. శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. సిటీ కాలేజీలో రాజనీతి శాస్త్రంలో సహాయ ఆచార్యులుగా ఆయన పని చేస్తున్నారు. టీజీసీజీటీఏలోని పలు పోస్టులకు ఏప్రిల్ 30న ఎన్నికలు జరిగాయి. కానీ, అధ్యక్ష ఎన్నిక ఫలితాన్ని కొన్ని సాంకేతిక కారణాలతో ఎన్నికల అధికారి వాయిదా వేశారు. అన్ని అంశాలు పరిశీలించాక డాక్టర్ భాస్కర్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి డాక్టర్ డి.విద్యాధర్ ప్రకటించారు. భాస్కర్ గతంలో నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా, స్టేట్ అసోసియేట్ అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ సంఘ ప్రాథమిక సభ్యుల సంక్షేమం కోసం పనిచేస్తానని కోరారు. కాగా ఎన్నిక పట్ల సీనియర్ నాయకులు ఏ.సంజీవయ్య, ఈ.యాదయ్య, బాలశ్రీనివాస్, విప్లవ్ దత్ శుక్ల, శంకర్ నాయక్ , వై వేణుప్రసాద్, డా.ఎమ్. ఏ. మాలిక్, శ్రీమతి ఎన్ సుభాషిణి, డా.ఎమ్ సోమయ్యపి రవి కుమార్,సి బీరయ్య, వేముల కామేశ్వరరావు, డా. వాసం శ్రీనివాస్, డా. ఆకుల వెంకటేశం, గాజుల సదయ కుమార్,డా. చేగోని రవి కుమార్ జి పరమేష్, జి.హృదయ రాజు, ఆర్ వెంకట రామారావు తదితర్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బిజినెస్

నైకా బ్రాండ్ అంబాసీడర్‌గా జాన్వీ కపూర్

న్యూఢిల్లీ : నైకా నేచురల్ హెయిర్ తమ ప్రచారకర్తగా జాన్వీ కపూర్‌ను నియమించుకున్నట్లు ఆసంస్థ ప్రకటించింది. "జాన్వీ అద్భుతమైన చర్మం, స్వదేశీ పదార్థాల పట్ల ఆమె ప్రేమతో కూడిన అనుబంధానికి పేరుగాంచింది. నైకా నేచురల్ హెయిర్ కేర్ శ్రేణి యాపిల్ సైడర్ వెనిగర్, అల్లం, మెంతులు, ఉల్లిపాయలు, ఉసిరికాయ, కరివేపాకు, పులియబెట్టిన రైస్ వాటర్, బొగ్గు, షికాకాయ్ మొదలైన సాంప్రదాయక జుట్టును ఇష్టపడే పదార్థాలతో నింపబడి ఉంది. భారతీయ వాతావరణం, నీరు, జీవనశైలి, విభిన్న జుట్టు రకాలను విశ్లేషించి అందంగా ఆరోగ్యకరమైన జుట్టు కోసం దీన్ని అభివద్ధి చేయబడింది." అని నైకా కన్స్యూమర్ బ్యూటీ బ్రాండ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ గుప్తా పేర్కొన్నారు.

రూ.330 తగ్గిన బంగారం



న్యూఢిల్లీ : బంగారం ధరలో తగ్గుదల చోటు చేసుకుంది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడిపై రూ.330 తగ్గి రూ.60,870 వద్ద ముగిసింది. గోల్డ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. 22 క్యారెట్ల పసిడిపై రూ.300 తగ్గి రూ.55,800గా పలికింది. మరోవైపు కిలో వెండిపై రూ.200 తగ్గి రూ.74,300గా చోటు చేసుకుంది. హైదరాబాద్, కోల్‌కత్తాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.60,870గానే ఉంది.

మెటా నుంచి కొత్త మైక్రోబ్లాగింగ్ యాప్

- ట్విట్టర్‌కు పోటీగా త్వరలో విడుదల

శాన్‌ఫ్రాన్సిస్కో : ట్విట్టర్‌కు పోటీగా కొత్త మైక్రో బ్లాగింగ్ యాప్‌ను అందుబాటులోకి తేవడానికి ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటా కసరత్తు చేస్తోంది. మెటా ఇప్పటికే ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ లాంటి కీలక వేదికలను నిర్వహిస్తోంది. ట్విట్టర్‌లో ఎలన్ మస్క్ చేస్తున్న సంస్కరణపై అనేక మంది అసంతృప్తిగా ఉన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మెటా కొత్త యాప్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. మరోవైపు ట్విట్టర్ మాజీ అధిపతి జాక్ డోర్సీ కూడా బ్లూస్కైను తీసుకు వస్తోన్న విషయం తెలిసిందే. కాగా.. ఇన్‌స్టాగ్రామ్ బ్రాండ్‌పైనే కొత్త మైక్రోబ్లాగింగ్ యాప్‌ను మెటా తీసుకొస్తుందని సమాచారం. ఈ యాప్ దాదాపు ఇన్‌స్టాను పోలి ఉంటుందని రిపోర్టులు వస్తున్నాయి.

మ్యాటర్ ఇవి ఎరా కోసం ప్రీ బుకింగ్స్

న్యూఢిల్లీ : ఎలక్ట్రిక్ మోటార్‌బైక్ ఎరా కోసం ప్రీబుకింగ్స్‌ను ప్రారంభించినట్లు సాంకేతిక ఆవిష్కరణల ఆధారిత స్టార్టప్ మ్యాటర్ తెలిపింది. దేశంలోని 25 జిల్లాల్లో రూ.1,999తోనే బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, కృష్ణా నగరాల్లోని వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దీన్ని పొందవచ్చున్నారు. మ్యాటర్ ఎరా ప్రారంభ ధరను రూ.1,43,999గా నిర్ణయించింది.

ఉమ్రన్ మాలిక్‌తో క్యాంపస్ యాక్టివ్‌వేర్ జట్టు



న్యూఢిల్లీ : స్పోర్ట్స్ అండ్ అథ్లెయిజర్ ఫుట్‌వేర్ బ్రాండ్‌లలో ఒక్కటైన క్యాంపస్ యాక్టివ్‌వేర్ తమ నూతన నైట్రోఫ్లై శ్రేణి విడుదల చేయటం కోసం ప్రముఖ బౌలర్ ఉమ్రాన్ మాలిక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. అసాధారణమైన ప్రదర్శన, తిరుగులేని నిబద్ధత కలిగిన క్రికెటర్ ఉమ్రాన్ మాలిక్ క్రీడల పట్ల తన అభిరుచి, నైపుణ్యంతో నైట్రోఫ్లైకు విస్తృత ప్రచారం తీసుకురానున్నారని ఆ సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది.

నిరంకుశ ఆర్డినెన్స్‌ను ఉపసంహరించాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

న్యూఢిల్లీ : బ్యూరోక్రసీ నియంత్రణతో సహా ప్రధాన పాలనా రంగాలపై ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి గల హక్కులను పరిరక్షిస్తూ సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఇది కోర్టు ధిక్కరణ మాత్రమే కాదని, రాజ్యాంగ సమాఖ్య స్వభావంపై, జవాబుదారీ నిబంధనలపై, సుప్రీంకోర్టు నిర్వచించిన ప్రజాస్వామ్య పాలనపై ప్రత్యక్ష దాడి అని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ఈ దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ధిక్కరించే ఈ చర్య మోడీ ప్రభుత్వ దారుణమైన నియంతృత్వ స్వభావానికి మచ్చుతునక అని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఇది కేవలం ఢిల్లీ ప్రభుత్వం, ప్రజలకు సంబంధించిన అంశం కాదు, రాజ్యాంగ సమాఖ్య చట్రపరిధిని కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నందున ప్రజలందరికీ సంబంధించిన సమస్య. దీన్ని వ్యతిరేకించాలి. ఈ ఆర్డినెన్స్‌ను తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోంది.

కర్నాటకలో బీజేపీ ఓటమిని కప్పిపుచ్చేందుకే నోట్ల రదు : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటకలో బీజేపీ ఓటమిని కప్పిపుచ్చేందుకే నోట్ల రద్దును ప్రకటించారనీ, రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను చక్రబంధంలో బంధించే కుట్రలో భాగంగానే అకస్మాత్తుగా రూ. 2 వేల నోట్లు రద్దు నిర్ణయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో యూపీ ఎన్నికల కంటే ముందు ఎస్పీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో బలహీన పర్చాలనీ, మరికొన్ని కారణాలతో నాడు పెద్ద నోట్ల రద్దు నిర్ణయం చేశారని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుత నిర్ణయాన్ని ప్రకటించారని తెలిపారు. తాజాగా రూ.2 వేల రూపాయల నోట్ల రద్దు నిర్ణయం గతంలో మోడీ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదాలకు నిదర్శనమని విమర్శించారు. ఈ నిర్ణయం వెనుక పెద్ద కుట్ర దాగున్నదని పేర్కొన్నారు. కర్నాటకలో బీజేపీ ఘోర ఓటమి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే అకస్మాత్తుగా ఆర్‌బీఐ నుండి ఈ నిర్ణయాన్ని ప్రకటించారని తెలిపారు. గతంలో పెద్దనోట్లు రద్దు చేసినప్పుడు నల్లధనం బయటికి వస్తున్నదని, ఉగ్రవాదం, అవినీతి అంతమవుతున్నదని మోడీ బీరాలు పలికారని విమర్శించారు.

ఆ లక్ష్యాల గురించి ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నాడు పెద్దనోట్ల మార్పిడి కోసం దేశ వ్యాపితంగా ప్రజలు బ్యాంకుల వద్ద బారులు తీరారని గుర్తుచేశారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారనీ, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందనీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. కోట్లాది మంది ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయారని తెలిపారు. పన్ను ఎగవేతదారులకు, కార్పొరేట్, ధనస్వాములకు ఈ నిర్ణయం ఉపయోగపడిందని పేర్కొన్నారు.ఎబిఎన్ ఆంధ్రజ్యోతి జర్నలిస్టులపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడటాన్ని సీపీఐ రాష్ట్ర సమితి ఖండిస్తున్నదని తెలిపారు.

నోట్ల రద్దుతో తగిన మూల్యం చెల్లించక తప్పదు

- మోడీకి మహేష్‌కుమార్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నోట్ల రద్దు చేసినందుకు తగిన మూల్యం చెల్లించకతప్పదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రధాని మోడీని హెచ్చరించారు.2016 పెద్ద నోట్ల రద్దు తీసుకొచ్చిన మోడీ కొన్ని వేల మంది చావుకు కారణం అయ్యారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద నోట్లు రద్దు చేసి అంతకంటే పెద్ద నోటు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. అప్పుడు ఆ నోట్ల రద్దు ఎవరి కోసం చేశారు? ఇప్పుడు ఎందుకు కోసం రూ 2000 నోటు రద్దు చేశారని ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తల సౌకర్యం కోసమా? అని నిలదీశారు. ఆరేండ్లలో లాభపడి ఇప్పుడు రద్దు చేయడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. పార్టీ సీనియర్ నేత షబ్బీర్ రెండువేల నోట్ల రద్దును తప్పుపట్టారు.

రోడ్లు భవనాల శాఖతో ఎన్నో అద్భుతాలు

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆర్ అండ్ బీ శాఖ సాధించిన విజయాలు, పురోగతిపై రూపొందిస్తున్న డాక్యుమెంటరీపై శనివారం డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆర్ అండ్ బీ కార్యదర్శి కె. శ్రీనివాసరాజు, ఈఎన్సీలు ఐ. గణపతిరెడ్డి, రవీందర్‌రావు, సి.ఈసతీష్, మధుసూధన్ రెడ్డి, డి.సి దివాకర్, పలువురు అధికారులు, డాక్యుమెంటరీ రూపొందించే సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత ఎంతో దూర దష్టితో, భవిష్యత్ తరాలకు మేలు జరిగేలా రోడ్లు భవనాలు శాఖ ద్వారా ఎన్నో అద్భుత కట్టడాలు నిర్మించారని అన్నారు. అందులో భాగంగా ఆర్ అండ్ బీ శాఖ అధ్వర్యంలో రాష్ట్రంలో నిర్మాణమైన భవనాలు, రోడ్లు, బ్రిడ్జిలు, డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రతిష్టాత్మకం అయ్యాయని చెప్పారు. రాష్ట్రం ఏర్పడక ముందు కేవలం ఆర్ అండ్ బీ పరిధిలో 30లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో మాత్రమే నిర్మాణాలు ఉన్నాయనీ, ఈ తొమ్మిది ఏండ్ల కాలంలో కొత్తగా కోటి చదరపు అడుగుల భవనాల సముదాయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.

దేశంలోనే ఎక్కడ లేని విధంగా రూ. 139 కోట్ల నిధులతో 100 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు, పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నూతన జిల్లాలు ఏర్పాటు చేసుకొని అన్ని జిల్లాల్లో దేశమే అబ్బుర పడేలా 1650 కోట్లతో జిల్లా సమీకృత కార్యాలయ భవనాలు నిర్మించామని తెలిపారు. తెలంగాణ ప్రజలు గర్వించేలా సకల హంగులతో రాష్ట్ర రాజధానిలో రూ. 617 కోట్లతో సచివాలయ భవనం నిర్మించుకున్నామన్నారు. అదే విధంగా హైదరాబాద్‌లో రూ. 585 కోట్ల తో 20 అంతస్తుల పోలీస్ కమిషనరేట్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనాన్ని నిర్మించామని తెలిపారు. రూ. 146.50 కోట్లతో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల ప్రపంచంలోనే ఎత్తయిన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు రూ.177 కోట్లతో లుంబినీ పార్క్ సమీపంలో తెలంగాణ అమరవీరుల త్యాగాలు నిత్యం స్మరించుకునేలా అమరవీరుల స్మారక చిహ్నాం నిర్మించామని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో రూ. 30 కోట్లతో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, మైనార్టీ అనాథ చిన్నారుల కోసం హైదరాబాద్ నాంపల్లిలో రూ. 39 కోట్ల వ్యయంతో అనీస్ - ఉల్ - గుర్బా నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో రహదారులు గత 60 ఏండ్లల్లో నిర్మించిన వాటికంటే ఈ తొమ్మిది ఏండ్లల్లో రెట్టింపు అయ్యాయని తెలిపారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, రాజధాని నాలుగు లైన్ల రోడ్డు ప్రణాళిక ప్రకారం రికార్డు సమయంలో రోడ్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా డబుల్ బెడ్రూం ఇండ్లు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో పూర్తి ఉచితంగా అందజేస్తున్న మన్నారు. 30 ఏండ్లుగా పేదలకు గహ నిర్మాణం కోసం ఎంత ఖర్చు చేశారో, అంతే ఖర్చు కేవలం తొమ్మిది ఏండ్లల్లో చేశామనీ, అంతేగాక రూ.1000 అదనంగానే ఖర్చు చేశామని అన్నారు.

అన్ని శాఖల సమన్వయంతోనే
మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

పోలీసు, రైల్వే, ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశంలో డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోకి మద్యం అక్రమ రవాణాను అరికట్టడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేయాల్సిన అవసరమున్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. మద్యం అక్రమ రవాణాను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, రైల్వే పోలీసు విభాగాల అధికారులతో డీజీపీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అంజనీ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాలే గాక హర్యానా, ఢిల్లీల నుంచి కూడా రాష్ట్రంలోకి మద్యం అక్రమంగా రవాణా అవుతున్నదనీ, దీని వలన రాష్ట్ర ఆదాయానికి గండి పడుతున్నదని డీజీపీ అన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి, మద్యం స్మగ్లర్ల ఆట కట్టించడానికి పోలీసు, రైల్వే పోలీసు, ఎక్సైజ్ అధికారులతో పాటు నిఘా అధికారులు సమిష్టి కార్యచరణతో పని చేయాలని ఆయన సూచించారు. ఇందుకు తగిన వ్యూహాలను, ఎత్తుగడలను రచించి అమలు చేయాలని కోరారు. సీఐడీ డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటి వరకు సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొస్తున్న 29 వేల మందిపై కేసులను నమోదు చేశామని ఆయన అన్నారు. అంతేగాక, 15 మందిపై పీడీ చట్టం కింద కేసులను కూడా నమోదు చేశామని తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి ప్రయివేటు ట్రావెల్ బస్సుతో పాటు రైళ్ల ద్వారా అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాష్ట్రంలోకి దిగుమతి అవుతున్నదని అన్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, చండీగఢ్, గోవాల నుంచి ఎక్కువగా మద్యం అక్రమంగా రవాణా అవుతున్నదని అన్నారు. ప్రధానంగా కర్నాటక, గోవాల నుంచి రాష్ట్రంలోకి టూరిస్టులగా వచ్చే వారు ఎక్కువగా ఈ అక్రమ మద్యాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్ర రైల్వే పోలీసు విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగ్‌పూర్, బలార్షా నిజామాబాద్‌ల మీదుగా వస్తున్న రైళ్ల ద్వారా ఎక్కువగా మద్యం రవాణా అవుతున్నదనీ, దీనిపై నిఘాను పెంచి స్మగ్లర్ల ఆట కట్టించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇందుకోసం రైల్వే పోలీసు విభాగం నుంచి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయటంతో పాటు ఇతర విభాగాలతో సమన్వయమై పని చేస్తామని తెలిపారు. ఇంటెలిజెన్స్ డీఐజీ కార్తికేయ మాట్లాడుతూ.. రాష్ట్రంలోకి తరచుగా మద్యాన్ని అక్రమ రవాణా చేసేవారి జాబితాను రూపొందిస్తున్నామనీ, వాటి వివరాలను త్వరలోనే సంబంధిత శాఖలకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐజీలు షానావాజ్ ఖాసీం, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర శాంతి భద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్, సికిందరాబాద్ రైల్వే ఎస్పీ షేక్ సలీమాతో పాటు పలువురు ఆర్పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్దిపొందేందుకే బీసీ భజన : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో లబ్దిపొందేందుకే బీసీ భజన చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు.శనివారం హైదరాబాద్‌లోని తమ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మాయ చేసేందుకే మంత్రివర్గ ఉపసంఘాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని హితవు పలికారు.

వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్యలు, ధరణి పోర్టల్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ, అక్రమ లే అవుట్లు, ప్లాట్లు, గ్రామ కంఠం భూముల క్రమబద్ధీకరణకు వేసిన మంత్రివర్గ ఉపసంఘాలు సిఫారసులను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఆదివాసీ, గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రెవిన్యూ అధికారుల తప్పిదాల వల్ల ధరణి పోర్టల్‌లో లక్షలాది ఎకరాల పేదల అసైన్ భూములు నిషేధిత జాబితాలో నమోదయ్యాయని ఆరోపించారు. ఆ జాబితాలో ఉన్న లక్షల ఎకరాల అసైన్డ్ భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భూ రికార్డుల నమోదులో జరిగిన పొరపాట్లను సరిచేసేందుకు అనువైన మాడ్యూల్‌ను త్వరగా అందుబాటులోకి తేవటంలో హరీష్ రావు మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులు బుట్ట దాఖలయ్యాయని తెలిపారు. రెండు దశబ్దాలుగా రియల్టర్ల చేతిలో హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న 3,000 చెరువులు ధ్వంసం అయ్యాయని గుర్తుచేశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ దళితులనుద్దేశించి థర్డ్ క్లాస్ వాళ్లంటూ చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి క్షమాపణలు చెప్పాలన్నారు. జర్నలిస్టుల దాడులు, పత్రికలు, టీవీల మీద నిషేధం విధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్‌కు కుల వృత్తులు ఇప్పుడు గుర్తుకు రావటమేంటని ప్రశ్నించారు. భారాస అవినీతి చిట్టాను త్వరలోనే బయట పెడతానని హెచ్చరించారు. టీఎస్పీఎస్సీ పరీక్షలు నిర్వహించడం వెనుక కుట్ర ఉన్నదని విమర్శించారు.

ఆహార భద్రత, ఆరోగ్య రక్షణపై దృష్టి

జి7 దేశాధినేతలను కోరిన ప్రధాని మోడీ

- సవాళ్ల పరిష్కారానికి పది పాయింట్లతో ప్రతిపాదన
- పలు దేశాధినేతలతో భేటీ

టోక్యో : ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాలని, వినియోగదారి తత్వంతో కాకుండా వర్ధమాన దేశాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి నమూనాలను రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజ్ఞప్తి చేశారు. జపాన్‌లోని హిరోషిమాలో జరుగుతున్న జి-7 శిఖరాగ్ర సదస్సులో 'బహుళ సంక్షోభాల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేద్దాం' అనే అంశంపై జరిగిన సమావేశంలో మోడీ ప్రసంగించారు. ఆహారం, ఆరోగ్యం, అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి మోడీ పది పాయింట్ల కార్యాచరణను ప్రతిపాదించారు. ట్రాన్స్‌జెండర్ల వ్యక్తిగత హక్కులను పరిరక్షించేందుకు ప్రపంచ దేశాలన్నీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సన్నకారు రైతులతో సహా నిస్సహాయక ప్రజలను రక్షించుకునేందుకు సమగ్ర ఆహార వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలని మోడీ పిలుపునిచ్చారు. తృణధాన్యాల వినియోగాన్ని పెంపొందించాలని, దీనివల్ల పోషకాహార సవాళ్లను అధిగమించడమే కాకుండా పర్యావరణ ప్రయోజనాలూ చేకూరుతాయన్నారు. ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే ఆహార వృథాను అరికట్టాలని హితవు పలికారు. ప్రపంచ ఎరువుల సరఫరా వ్యవస్థల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయాలు అభివృద్ధి చేయాలని కోరారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే ఆరోగ్య రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని, అధ్యాత్మిక, సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలని విన్నవించారు. అదే సమయంలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలను అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సార్వత్రిక ఆరోగ్య కవరేజీని అందుబాటులోకి తీసుకురావాల్సిన అసరముందని తెలిపారు.

మహాత్మగాంధీ విగ్రహావిష్కరణ

జి7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా శనివారం ఉదయం జపాన్ చేరుకున్న ప్రధాని మోడీ ఆ దేశ ప్రధాని ఫ్యూమియో కిసిందాతో సమావేశమయ్యారు. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం హిరోషిమాలో నెలకొల్పిన మహాత్మగాంధీ విగ్రహాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించారు.

23న ఇండియా గేట్ వద్ద క్యాండిల్ మార్చ్

18 రాష్ట్రాల అంగన్‌వాడీ నేతలు మద్దతు

- రాష్ట్రపతి లక్షలాది మెయిల్స్, పోస్టు కార్డులు
- ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు వెళ్లిన రెజ్లర్లను అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ : బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లు ఈ నెల 23న సాయంత్రం నాలుగు గంటలకు ఇండియాగేట్ ప్రాంగణంలో క్యాండిల్‌లైట్ మార్చ్‌కు పిలుపునిచ్చారు. జంతర్ మంతర్‌వద్ద రెజ్లర్ల ఆందోళన శనివారం 28వ రోజు పూర్తి చేసుకుంది. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని రైతులు, ఆందోళనకారులు పోలీసులకు ఇచ్చిన అల్టిమేటం ఆదివారంతో ముగియనుంది. ఆయనను అరెస్టు చేయని నేపథ్యంలో నేడు (ఆదివారం) కఠిన నిర్ణయం ప్రకటిస్తామని రెజ్లర్లు తెలిపారు. దేశానికి ఇబ్బంది కలిగించే ప్రకటన ఉంటుందని వినేష్ ఫోగట్ మీడియాతో చెప్పారు.

రైతు సంఘాలు, ఖాప్ నేతల భాగస్వామ్యంతో ఆదివారం సమరవీధిలో జరిగే మహా పంచాయతీలో ఢిల్లీని దిగ్బంధం చేస్తామని ప్రకటించారు. 21వ తేదీలోగా అరెస్టులు చేయకుంటే ఢిల్లీని ముట్టడిస్తామని భారతీయ కిసాన్ యూనియన్, ఆర్ఎల్‌డీ గతంలోనే ప్రకటించాయి. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, యూపీ రాష్ట్రాలకు చెందిన రైతులు నేడు జంతర్ మంతర్ చేరుకోనున్నారు. రైతుల ఆందోళన తరహాలోనే ఢిల్లీ సరిహద్దుల్లో నిరవధిక దిగ్బంధనానికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 18 రాష్ట్రాల కార్యకర్తలు శనివారం నిరసన స్థలానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఫెడరేషన్ అధ్యక్షురాలు ఆశారాణి, ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు మాట్లాడారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సాక్షి మాలిక్‌తో సహా రెజ్లర్లు ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో రాష్ట్రపతికి లేఖ పంపారు. లక్షలాది ఈమెయిల్‌లు, లేఖలు పంపడంతో ఇప్పటికే మంచి స్పందన వచ్చిందని, పలువురు ప్రముఖ క్రీడా ప్రముఖులు కూడా తమకు సంఘీభావం తెలిపారని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్ తెలిపారు.

స్విమ్మింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బంగారు పతక విజేత బులా చౌదరి, ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ కుంతల ఘోషదస్తిదార్, మాజీ జాతీయ క్రికెట్ సెలెక్టర్ సంబరన్ బెనర్జీ, మాజీ క్రికెటర్ ఉత్పల్ ఛటర్జీ, ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ భాస్కర్ గంగూలీ, ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు తుషార్ రక్షిత్, స్విమ్మర్ సయానీ దాస్ రెజ్లర్లకు సంఘీభావం తెలిపిన ప్రముఖ క్రీడాకారుల్లో ఉన్నారు. శిరోమణి గురుద్వారా పరబంధక్ కమిటీ కూడా రెజ్లర్ల ఆందోళనకు మద్దతు ప్రకటించింది.

కాగా, ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో శనివారం సాయంత్రం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు పోలీసులు తమను అనుమతించ లేదని సాక్షి మాలిక్, వినీషా ఫోగట్, బజరంగ్ పునియా విమర్శించారు. క్రీడాకారులు స్టేడియం వెలుపల నిరసన తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- ఏర్పాట్లు పూర్తి చేయండి :మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనీ, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలంటూ గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తొమ్మిదేండ్ల అభివృద్ధిపై వీడియోలు సిద్ధం చేయాలని ఆమె ఈ సందర్భంగా ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 23వరకు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తొమ్మిదేండ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరో సారి గుర్తుచేయాలని తెలిపారు. తండాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల వికాసం, సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్ వంటి అనేక పథకాల ద్వారా గిరిజనులు లబ్ధిపొందారని తెలిపారు. గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారం, ఇతర సౌకర్యాలను వీడియోలు, డాక్యుమెంటరీల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. తొమ్మిదేండ్లకు ముందు గిరిజనుల పరిస్థితి,ప్రస్తుత పరిస్థితిని వారికి వివరించాలన్నారు. సమీక్షా సమావేశంలో ట్రైకార్ చైర్మెన్ రామచంద్రనాయక్, జీసీసీ చైర్మెన్ రామావత్ వాల్యా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి భారతి హెూలీ కేరి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ రాజీవ్ సాగర్, బీసీ గురుకులం కార్యదర్శి మల్లయ్య బట్టు, ట్రైకార్ జీఎం శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు రాంప్రసాద్ మృతి



హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు మతుకుమల్లి కోదండ రాం ప్రసాద్ (68) శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంప్రసాద్ శనివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రాంప్రసాద్ స్వగ్రామం కృష్ణా జిల్లా చల్లపల్లి. మొదట ఆంధ్ర పత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేశారు. 1991 ఏప్రిల్‌లో ప్రజాశక్తిలో చేరారు. అప్పటి నుంచి 2013లో రిటైరయ్యేవరకు ప్రజాశక్తిలో జనరల్ డెస్కు, స్పోర్ట్సు, ఎడిట్ పేజీ డెస్కుల్లో సీనియర్ సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. 1999లో ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌కు మారినప్పుడు అందరితోబాటు ఆయన కూడా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కుటుంబాన్ని షిఫ్టు చేశారు. రాంప్రసాద్ మృతికి ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజరు వై అచ్యుత రావు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, చీఫ్ జనరల్ మేనేజర్ పి ప్రభాకర్ సంతాపం ప్రకటించారు.

మతోన్మాద శక్తుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

- బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మతోన్మాద శక్తుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. మత విశ్వాసం అనేది వ్యక్తిగతం అనీ, కానీ మతోన్మాదం ప్రమాదకరమని హెచ్చరించారు. మహాత్మా గాంధీ ఆలోచనా విధానం మనందరికీ అనుసరణీయమని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలోని క్లబ్‌హౌస్‌లో గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జీవిత చరిత్రపై రూపొందించిన ప్రత్యేక సంచికను డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డితో కలిసి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం ప్రతి మనిషి జీవన విధానం కావాలన్నారు. మత సామరస్యం అనేది జాతిని ఒక్క తాటిపై నడిపిస్తుందని చెప్పారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీని సామాజిక మాధ్యమాల్లో కొన్ని రాజకీయ శక్తులు అవమానిస్తున్నాయని, ఇది మంచి సంప్రదాయం కాదని హితవు పలికారు. మత విద్వేషాలను ప్రేరేపించే విధానాలు దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరమంటూ హెచ్చరించారు. మహాత్మా గాంధీ ఆలోచన విధానంపై రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ చర్చ పెట్టాల్సిన అవసరముందనీ, ఆ బాధ్యతలను సంస్థ చైర్మెన్ డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి తీసుకోవాలని వినోద్ కుమార్ సూచించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, పర్యావరణ అంశాలపై గాంధీ గ్లోబల్ ట్రస్ట్ సంస్థలతో కలిసి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు కలీం ఖాన్, ఎం వీ గోనా రెడ్డి, విజయ్ కుమార్, వాణి, సురేష్ గుప్తా, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికలకు బీసీలు సమాయత్తం కావాలి

- 22న రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం
- బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే సాధారణ ఎన్నికలకు బీసీలు సమాయత్తం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ, కార్యనిరాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు." బీసీలను రాజకీయంగా చైతన్యం చేయటానికి ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాదులోని సెంట్రల్ కోర్ట్ హోటల్లో బీసీ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాన్ని, విధానాన్ని, కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకర్రావు హాజరవుతారని తెలిపారు. 33 జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులు రాష్ట్ర నాయకులు, విద్యార్థి యువజన, మహిళా, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

తెలంగాణలో రైతులపై దాష్టిక పాలన

- వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతులపై కేసీఆర్ దాష్టిక పాలన కొనసాగిస్తున్నారని వైఎస్ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. జమీందార్లను, ఉద్యమద్రోహులను ఎమ్మెల్యేలుగా గెలిస్తే వారికి రైతుల బాధలు ఎలాపడతాయని ప్రశ్నించారు. మహారాష్ట్రలో రైతులు అసెంబ్లీకి పోవాలంటూ చెబుతున్న కేసీఆర్ ఇక్కడ రైతుల పరిస్థితిని పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తొమ్మిదేండ్లలో 9వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పంట బీమా ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వ లేదని ప్రశ్నించారు.నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని కోరారు. రాయితీ ఎరువులు, విత్తనాలు సంగతేంటని ప్రశ్నించారు.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

- హాస్టల్, భోజన వసతి
- స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్ స్టిట్యూట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతి కల్పిస్తున్నట్టు స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ యువతులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, బ్యాగ్స్ మేకింగ్‌లో ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్టు తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 25 ఏండ్లలో ఉన్న వారు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు భువనగిరిలోని సంస్థ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. చదువు మధ్యలో ఉన్న అర్హులు కారని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 91824 05414లో సంప్రదించాలని సూచించారు.

బదిలీలు, పదోన్నతులపై విద్యాశాఖ నిర్లక్ష్యం

హైకోర్టు స్టే ఎత్తివేతపై సరిగ్గా స్పందించని అధికారులు

- విద్యామంత్రి, కార్యదర్శి సానుకూలమే డైరెక్టరేట్‌లోనే వైఫల్యం
- బడుల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వం చూడాలి
- ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను 31లోగా పూర్తిచేయాలి
- నిరసనగా 27న దీక్ష : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై పాఠశాల విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. విద్యాశాఖ అధికారులు సరిగ్గా స్పందిస్తే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. స్టే వచ్చిన తర్వాత కూడా సరైన రీతిలో అధికారులు స్పందిస్తే ఎత్తేసే అవకాశముండేదని అన్నారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకాటి కరుణ సానుకూలంగానే ఉన్నా పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లోనే పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తున్నదని చెప్పారు. అప్రమత్తంగా వ్యవహరిస్తే స్టే తొలగిపోయేదని, బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ఈ సెలవుల్లో కొనసాగేదని వివరించారు. జూన్ 13 వరకు స్టే కొనసాగుతుందన్నారు. ఎర్లీ హియరింగ్ అప్లికేషన్‌ను ఇవ్వాలంటూ మంత్రి, కార్యదర్శికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని అన్నారు. ఏజీ, ఏఏజీకి సరైన వివరాలివ్వడంలో విద్యాశాఖ విఫలమైందన్నారు. విద్యాశాఖ నిర్లక్ష్యంపై ఈనెల 27వ తేదీన దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 వేల ప్రాథమిక, మూడు వేలకుపైగా ప్రాథమికోన్నత, 4,600 ఉన్నత పాఠశాలల్లో 20 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. 1.04 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు. పదోన్నతుల్లేకపోవడంతో 1,900పైగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులు, రెండు వేలకుపైగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులు, ఏడు వేలకుపైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. రూ.3,497 కోట్లతో 9,123 పాఠశాలల్లో 'మన ఊరు-మనబడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. డ్యూయల్ డెస్క్‌లు, బడులకు రంగులు, వసతులు కల్పిస్తేనే సరిపోదని, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని సూచించారు. లేదంటే మన ఊరు-మనబడి నిరుపయోగంగా మారే ప్రమాదముందన్నారు. బదిలీలు, పదోన్నతులపై నిర్లక్ష్యం వహించే అధికారులను అవసరమైతే పక్కన పెట్టాలని కోరారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదేండ్లుగా బదిలీలు, పదోన్నతులు చేపట్టడం లేదని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఎఫ్ రుణాల కోసం ఆర్నెళ్లపాటు ఎదురుచూడాల్సి వస్తోందని అన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులతో కుబేరుని పొట్ట పగిలే పరిస్థితి ఉందన్నారు. పెండింగ్ బిల్లులను ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

డిమాండ్లు

- ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల 'బదిలీలు-పదోన్నతుల' షెడ్యూల్‌పై హైకోర్టులో ఉన్న స్టేను ఎత్తేయించి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి.
- మోడల్ స్కూళ్లలో 'బదిలీలు-పదోన్నతుల' షెడ్యూల్‌ను ప్రకటించి వెంటనే పూర్తి చేయాలి.
- ఈ-కుబేర్‌లో మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ఈనెల 31లోగా చెల్లింపులు పూర్తి చేయాలి.
- కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 'మినిమం బేసిక్ పే'ను వేతనంగా చెల్లించాలి.

కాంగ్రెస్ పాలనలో రైతులది దీనస్థితి

- ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లతో రైతులు దీనస్థితిలో కొట్టుమిట్టాడారని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని భాషాయిగూడెం, తిమ్మాయిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సర్పంచ్ ఏల లతాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటయ్యాకే రైతులకు 24 గంటలు కరెంటు, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, రైతు పండించిన ధాన్యం ఒక్క గింజ లేకుండా కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం మారిందని, సీఎం కేసీఆర్ రైతుకు విలువ పెంచారని తెలిపారు. సంక్షేమంలో, అభివృద్ధిలో సిద్దిపేట నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళుతున్నామని స్పష్టం చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానతో చేతికొచ్చే పంట నష్టపోతున్నదని, వానాకాలం పంట నెల ముందుకు జరపాలని రైతులకు సూచించారు. ఇక్కడ పండించిన వడ్లను ఐదు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. యాసంగిలో వరికి తెగులు వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్న దృష్ట్యా రసాయనిక ఎరువులు తగ్గించి పంట మార్పిడి చేస్తే ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రాగుల సారయ్య, సొసైటీ చైర్మెన్లు ఎల్లంకి మహిపాల్ రెడ్డి, కోల రమేష్ గౌడ్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి పాల్గొన్నారు.

బ్యాంకుల రుణ ప్రణాళిక ప్రకటనలకే పరిమితమా?

- రైతులందరికి పంట రుణాలు ఇవ్వాలి: తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రతియేటా బ్యాంకులు ప్రకటిస్తున్న రుణ ప్రణాళిక ప్రకటనలకే పరిమితమవుతున్నాయని తెలంగాణ రైతు సంఘం అభిప్రాయపడింది. రైతులందరికీ పంట రుణాలివ్వాలని డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది మొదట రూ.82వేల కోట్లు ప్రకటించి, దాన్ని రూ.67,885 కోట్లకు తగ్గించారని విమర్శించారు. వాస్తవంగా ఇచ్చింది రూ.59,060 కోట్లేనని పేర్కొన్నారు. బుక్ అడ్జెస్టుమెంటు ద్వారా పాత అప్పులను తిరగరాసి అప్పులు ఇచ్చినట్టు చూపుతున్నారని తెలిపారు. వాస్తవానికి రైతులకు ఇచ్చిన అప్పులు రూ. 37,000 కోట్లకు పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి రైతులకు రూ.21,607 కోట్లు నాలుగు విడతలుగా విడుదల చేస్తానని ప్రకటించిందని గుర్తు చేశారు. విడతలుగా రూ.50వేల లోపు బాకీ ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. మిగిలిన రైతులకు రుణమాఫీ జరగలేదనీ, వారికి తిరిగి పంట రుణాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మంది రైతులు ఉండగా బ్యాంకులు 43 లక్షల మందికి మాత్రమే పంట రుణాలు ఇస్తున్నారని తెలిపారు. మిగిలిన 21 లక్షల మందికి భూములు ఉన్నప్పటికీ వ్యవసాయ రుణాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రతి బ్యాంకు బ్రాంచీ ఏటా 100 మంది కొత్త సభ్యులకు అప్పులు ఇవ్వాలని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశించినా అమలు కావడం లేదని గుర్తు చేశారు. ప్రతి ఏటా 5.35 లక్షల మంది కొత్త వారికి రుణాలు ఇవ్వాలనీ, కానీ బ్యాంకులు కొత్త సభ్యులకు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా లేవని అభిప్రాయపడ్డారు. రిజర్వుబ్యాంకు ఆదేశాలను పాటించని బ్యాంకులపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో రూ.8.13 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దీని ప్రకారం రూ.1.23 లక్షల కోట్లు పంట రుణాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. దళితులకు మొత్తం పంట రుణాలలో 15 శాతం రుణాలు ఇవ్వాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. కౌలు, పోడు సాగుదారులకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఏ నిబంధనలు పాటించని బ్యాంకులపై ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో లీడ్ బ్యాంకు మేనేజర్ స్థాయిలో బ్యాంకర్ల సమావేశం జరిపి రాష్ట్ర రుణ ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల సమావేశాలకు రైతు సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలని నిబంధన ఉన్నప్పటికీ వారిని పిలువడం లేదని విమర్శించారు. ప్రభుత్వం విజిలెన్స్ శాఖ ద్వారా పంట రుణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు జూన్ 10 నాటికి పంట రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళనకు దిగకముందే పంట రుణాలు ఇప్పించుటలో వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాలని కోరారు..

పర్యాటక కేంద్రంగా తెలంగాణ

ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా చెప్పారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా కౌన్సిలేట్ ఆధ్వర్యంలో తెలంగాణ పర్యటక శాఖ, కొరియన్ పర్యాటక శాఖల సమన్వయంతో రెండు రోజులపాటు హైదరాబాదులోని బంజారాహిల్స్ ఎల్‌వీ ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన కొరియన్ ఫిలిం ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ఉచితంగా అన్ని వర్గాల వారు తిలకించేందుకు రెండు రోజులపాటు చిత్రాలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కొరియా చాలా అందమైన దేశం, ఈ ప్రతిష్టాత్మక చలన చిత్రోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఎల్లప్పుడూ సంస్కృతుల సమ్మేళనం, ఈ కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించడం సాంస్కృతిక మార్పిడికి నిదర్శనమని తెలిపారు. ఆయా దేశాల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుసుకునేందుకు ఫిల్మ్ ఫెస్టివల్స్ దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి బాలయ్య, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి, కాన్సుల్ జనరల్ - యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హిస్ ఎక్సలెన్సీ మిస్టర్ ఆరెఫ్ అలీ, యునైటెడ్ కింగ్‌డమ్ కమిషనర్ అల్తాబూర్ అల్నుయిమి, ప్రసాద్ గ్రూప్ అధినేత రమేష్ ప్రసాద్, హ్యుండాయ్ మోటార్ యి గెన్ హాన్, హైదరాబాద్‌లోని కొరియన్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ చుక్కపల్లి తదితరులు పాల్గొన్నారు.

బండెనుక.. బండి పెట్టి..

లైన్లలో వరి ధాన్యం వాహనాలు

- ధాన్యం దిగుమతి కోసం నిరీక్షణ



నవతెలంగాణ-శాయంపేట

బండెనుక.. బండి.. అన్నట్టు రైస్ మిల్లుల వల్ల వరి ధాన్యం వాహనాలు బారులు తీరాయి. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం దిగుమతి చేయడానికి వచ్చిన వాహనాలు రోడ్డు పక్కన లైన్లలో భారీగా వాహనాలు నిలిచి ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్లు, టాటా ఏసీ వాహనాల్లో నింపి ట్రక్ షీట్ల ఆధారంగా మిల్లులకు పంపిస్తున్నారు. పరకాల -హనుమకొండ ప్రధాన రహదారిలోని మాందారిపేట స్టేజి సమీపంలో ఉన్న శ్రీనివాస రైస్ మిల్లులో ధాన్యం దిగుమతిలో జాప్యం వల్ల పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి ఉన్నాయి. వేసవిలో ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో హమాలీలు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ధాన్యం బస్తాలు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో వాహన యజమానులు ధాన్యం దిగుమతి కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

మరణించిన వారి పేరుతో పింఛన్లు స్వాహా

- 13 మంది పేర్లతో రూ.2,86,176 లక్షలకు పైగా సొమ్ము దుర్వినియోగం
- విచారణలో వెలుగులోకి..



నవతెలంగాణ-దంతాలపల్లి

అర్హులైన నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు ఆసరాగా ఉండేలా ప్రభుత్వం ప్రతినెలా అందిస్తున్న ఆసరా పింఛన్లను కొందరు అక్రమంగా స్వాహా చేస్తున్నారు. దివ్యాంగులకు నెలకు 3016 రూపాయలు, మిగతా వారికి నెలకు 2016 రూపాయల చొప్పున ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుంది. పంపిణీ ప్రక్రియ తపాలా శాఖకు అప్పగించగా సిబ్బంది గ్రామాల్లో డబ్బులను అందిస్తున్నారు. కాగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో మరణించిన వారి పేరుతోనూ పింఛన్లు సంవత్సరాల తరబడి తీసుకుంటున్నట్టు అధికారుల విచారణలో తేలింది. ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

గున్నేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు శివారు గిరిజన తండాలున్నాయి. జనాభా 2130 కాగా, సుమారు 1500 మంది ఓటర్లు ఉన్నారు. ఆసరా పథకం ద్వారా నెలకు 308 మందికి పింఛన్లు అందుతున్నాయి. వీరిలో వృద్ధాప్య 144, వితంతు 112, దివ్యాంగులు 28, కల్లుగీత కార్మికులు 11, చేనేత 1, ఒంటరి మహిళలు 12 మంది ఉన్నారు. వేలిముద్రలు పడని వారికి పంచాయతీ కార్యదర్శి వేలిముద్రల ద్వారా పింఛను డబ్బులు తీసుకునే అవకాశం కల్పించారు. వీరిలో రెండేండ్ల నుంచి సుమారు 28 మంది వివిధ కారణాలతో మృతిచెందారు. గ్రామంలో మృతిచెందిన వారి పేర్లను పంచాయతీ మరణ ధృవీకరణ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పింఛన్ లబ్దిదారులు మృతిచెందితే వారి పేర్లను తొలగించాల్సి ఉన్నప్పటికీ అలాంటివేమీ చేపట్టలేదు. వీరిలో కొందరి పేరిట వస్తున్న పింఛన్లు స్వాహా అవుతున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న మండల పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణంలో శనివారం విచారణ చేపట్టారు. గున్నేపల్లి గ్రామానికి కేటాయించిన బయోమెట్రిక్ యంత్రాల సహాయంతో 13 మంది పేర్లతో రూ.2,86,176 లక్షలకు పైగా సొమ్ము దుర్వినియోగమైనట్టు మండల పంచాయతీ అధికారి అప్సర్ పాషా విచారణలో తేలింది. ఇంకా 15 మంది చనిపోయిన వారి ఆధార్ కార్డు, మరణించిన తేదీ, పెన్షన్ ఐడి నెంబర్ అందుబాటులో లేని కారణం చేత విచారణ కాలేదని అధికారులు తెలిపారు. 15 మంది మరణించిన వారి పూర్తి సమాచారంతో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కి ఇవ్వనున్నట్టు పంచాయతీ అధికారి తెలిపారు. ఈ విచారణ సమయంలో సర్పంచ్ గండి వెంకట్ నారాయణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టడమే కమ్యూనిస్టుల ఎజెండా

- దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఎర్రజెండా పాత్ర కీలకం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మునుగోడు

దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ తెలంగాణలో పాగా వేసేందుకు చేసే కుట్రలను తిప్పికొట్టడమే కమ్యూనిస్టుల ఎజెండా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీపీఐ(ఎం) కార్యాలయం, మాజీ సర్పంచ్ బొందు పెద్దనర్సింహ అమరవీరుల స్మారక భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ప్రధాన వీధుల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు. ప్రస్తుతం దేశ రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ ఎర్రజెండా కీలకపాత్ర పోషించే రోజులొచ్చాయన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసుకునేందుకు కోరి తెచ్చుకున్న మునుగోడు ఉపఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడంలో ఎర్రజెండా కీలకపాత్ర పోషించిందన్నారు. అదే తరహాలో దేశంలో మతోన్మాదం పేరుతో ముందుకొస్తున్న బీజేపీని తరిమికొట్టేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సీఎం కేసీఆర్ ప్రభుత్వం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడమే కాకుండా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, ధరణి సమస్యలు, పోడు భూముల పట్టాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో వీఆర్ఏల సమస్యను పరిష్కరించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదే తరహాలో జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలతోపాటు ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నిరుపేద కుటుంబాల ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. కల్వకుంట గ్రామం చిన్నదైనప్పటికీ ఇక్కడ సీపీఐ(ఎం)పై ఉన్న మమకారంతో ప్రతిఒక్కరి కృషితో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని చెప్పారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుంట్ల గ్రామస్తులు, యువత ఇతర గ్రామాల్లో తమ కళా ప్రదర్శనలు చేసి వచ్చిన డబ్బులతో పార్టీ కార్యాలయం కోసం 10 గుంటల స్థలాన్ని కొనుగోలు చేయడం గర్వకారణమని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, మునుగోడు, మర్రిగూడ మండలాల కార్యదర్శులు మిర్యాల భరత్‌కుమార్, ఏర్పుల యాదయ్య, డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐతగోని విజయ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ట శివకుమార్, వెల్మకన్నె ఎంపీటీసీ చాపల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన

- నెల రోజులు దాటినా తూకం వేయడం లేదని ఆవేదన
- రాస్తారోకో.. వంటావార్పు





నవతెలంగాణ - ఇల్లంతకుంట/ ములకలపల్లి

నెల రోజులు దాటినా ధాన్యం తూకం వేయక పోవడం.. కాంటా వేసినా పంటను తరలించడానికి లారీలు రాకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. శనివారం రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆందోళన చేశారు. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపురం గ్రామానికి చెందిన 200మంది రైతులు మండుటెండలో పెద్దలింగపూర్-ఇల్లంతకుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి వంటావార్పు చేసుకుని నిరసన తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు పసుల వెంకట్ వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నెల రోజులుగా ధాన్యం తూకం వేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దలింగపూర్‌లో ప్రతి సీజన్లో 25నుంచి 35వేల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చినా నిర్వాహకులు ఏర్పాట్లు సరిగా చేయడం లేదన్నారు. లారీ డ్రైవర్లు బస్తాకు రూ.2చొప్పున వసూలు చేస్తున్నారని వాపోయారు. బస్తాకు 43కిలోలే తూకం వేస్తున్నారని, తరుగు ఎక్కువగా తీసుకున్నారని చెప్పారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా రోజుల తరబడి కేంద్రాల్లో ఉండటం వల్ల మిల్లుకు పోయాక తరుగు ఎక్కువ ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్లలో తాలు పేరుతో, చిన్నగా ఉన్నాయంటూ బి.గ్రేడ్‌గా పరిగణిస్తున్నారని చెప్పారు. ఏఎస్ఐ మోతీరాం తన సిబ్బందితో వచ్చి ప్రయాణికులకు దారి ఇవ్వాలని రైతులకు నచ్చజెప్పినా ససేమిరా అన్నారు. దీంతో ఏఎస్ఐ తహసీల్దార్‌కు, డీఎంకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా వారు రైతులతో మాట్లాడి ప్రతిరోజూ 3, 4లారీలను పంపిస్తామని హామీ ఇచ్చారు.

పాల్వంచ- ములకలపల్లి రహదారిపై రైతుల రాస్తారోకో

కొన్ని రోజులుగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం ములకలపల్లి మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ - ములకలపల్లి రహదారిపై మార్కెట్ యార్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కోతలు కోసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు భయాందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికే కురిసిన వర్షానికి ధాన్యం తడిసి రైతులు నష్టపోయారని తెలిపారు.

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకొని, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని కోరారు. మండల స్థాయి అధికారులు రైతుల పట్ల కక్ష సాధింపులు చర్యలు మానుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారి డీసీఓ ఎన్.వెంకటేశ్వర్లు రైతుల వద్దకు చేరుకొని మొత్తం ధాన్యాన్ని వారం రోజుల్లో కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, ఊకంటి రాంబాబు, నిమ్మల మధు, చనగాని వినోద్, పశువుల సూర్య, ముదిగొండ ప్రశాంత్, గంప చంద్రబాబు, వాసం వెంకటేశ్వర్లు, తోటకూర మురళి, వనమా సత్యం, కె.శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగులసంఘం (సీఐటీయూ) కోరింది. 34 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మె డిమాండ్ల పరిష్కరించేందుకు జోక్యం చేసుకోవాలంటూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు విజ్ఞప్తి చేసింది. శనివారం ఈమేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్వీ. రమ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. రాజ్‌కుమార్, ఎం. నగేష్, ఆఫీస్ బేరర్లు సి. సుమలత, వి. వెంకటయ్య, కె. శరత్ కుమార్, సభ్యులు రాములు, కుమార్‌తోపాటు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి. వెంకటేష్ తదితరుల బృందం మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఐకేపీ వీవోఏల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. మరోసారి చర్చలు జరిపేందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామ స్థాయిలో 17,606 మంది వీవోలు (గ్రామ సంఘాల సహాయకులు) పని చేస్తున్నారని పేర్కొన్నారు. 19 ఏండ్ల నుంచి గ్రామాలలో మహిళల అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు వారికి అవగాహన కల్పిస్తూ... చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే విధంగా రుణాలు ఇప్పించి, తిరిగి సక్రమంగా రుణాలు చెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తకంలో పొందుపరచడం, సమావేశాలు నిర్వహించడం తదితర పనులు చేస్తారని పేర్కొన్నారు. మహిళా సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంత కష్టపడుతున్నప్పటికీ వీవోఏలకు సెర్ప్ నుంచి రూ.3,900 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏలతో కొత్త, కొత్త సర్వేలు చేయిస్తూ పని భారం పెంచు తున్నారని తెలిపారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చాలాసార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పనికి తగిన గుర్తింపుగానీ, వేతనంగానీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రోజు రోజుకు పని భారం పెంచుతూ పని భద్రత కల్పించ కుండా ఐకేపీ వీవోలేలను ప్రభుత్వం విస్మరిస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమ స్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు.



డిమాండ్లు

- ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- సెర్ప్ నుంచి ఐడి కార్డులు ఇవ్వాలి
- గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలి.
- జాబ్ చార్టులతో సంబంధం లేని ఆన్‌లైన్ పనులతో సహా ఇతర పనులు చేయించరాదు.
- వీవోఏల పైన మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలి.
- ఎస్‌హెచ్‌జీ/ వీఏ లైన్ మీటింగ్స్ రద్దు చేయాలి
- అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్స్ కల్పించాలి.

సాయి సూర్య వైన్స్‌లో చోరీ

నవతెలంగాణ -వనస్థలిపురం

వైన్ షాపు పైకప్పు రేకులను తొలగించి..గల్లా పెట్టెలో ఉన్న 39 వేల నగదు, 6 వేలు విలువగల మూడు బాటిళ్లు చోరీకి గురైన ఘ టన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, డిటెక్టివ్ సీఐ వెంకట య్యలు తెలిపిన వివరాల ప్రకారం...రైతు బజార్ సమీపంలో ఉన్న సాయి సూర్య వైన్స్ ప్రతిరోజు లాగానే శుక్రవారం రాత్రి 11 గంటల 30 నిమిషాలకు షాప్ బంద్ చేసి ఇంటికెళ్లారు. శని వారం ఉదయం వచ్చి షాపు తెరవగానే షాపు పైకప్పు ఓ పెన్ చేసి ంది. గల్లా పెట్టెలో ఉన్న రూ.39 వేల నగదు, ఆరు వేలు విలువగల బాటిల్స్ చోరీకి గురైనట్లు తెలుసుకున్నారు. వెంటనే నిర్వాహకుడు రామిడి జంగారెడ్డి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కేసీఆర్‌తోనే విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి'



నవతెలంగాణ- సంతోష్‌నగర్

సీఎం కేసీఆర్ నాయకత్వం లోనే విశ్వబ్రాహ్మణుల అభ్యు న్నతి సాధ్యం అవుతుందని సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చిం తల శ్రీనివాస్ అన్నారు. శనివారం నవ తెలంగాణ జర్నలిస్టుతో ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలం గాణ రాష్ట్ర సర్కార్ పనిచేస్తోందని చెప్పారు. బడుగు, బల హీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. స్థానిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజను కోరారు.

మీరు అడగొద్దు.. సమస్యలను నేనే పరిష్కరిస్తా



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

నియోజకవర్గ పరిధిలోని సమస్యలను నేనే పరి ష్కరిస్తా.. మీరు ఏమీ అడగొద్దు అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రజలను కోరారు. నియోజకవర్గ పరిధిలోని మురికి వాడ ల్లో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు 2009లో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శని వారం ఎల్బీనగర్‌లో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో ఉదయం 6 గంటల నుంచి అధికారులు, నాయకులు స్థానిక బస్తీ వాసులచే కలిసి ప్రతి గల్లీలో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, తాగునీటి, రోడ్ల, స్ట్రీట్ లైట్ సమస్యలను పరిష్క రించాలని ప్రజలు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. వీరన్నగుట్టలో 560 కుటుంబాలు, 2వేల మంది జనాభా ఉన్నట్లు తెలిపారు. 2 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 96 లక్షలతో వాటర్ పైప్ లైన్, 57 లక్షలతో బస్తీ దవాఖానాల ఏర్పాటు, 44 లక్షలతో సీతారామాంజనేయ స్వామి దేవాలయం నుంచి ఆకాశ్ నగర్ వరకు సీసీ రోడ్డు, 10 లక్షలతో బస్తీ కమ్యునిటీ హాల్, 8 లక్షలతో మట్టిరోడ్లు, 2 లక్షలతో పోచమ్మ గుడి ప్రాంగణం ప్లాస్టరింగ్, లక్షన్నర రూపాయలతో సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద కాంక్రీట్ పనులు చేసినట్లు వివరించారు. 58,59 జీవోల ద్వారా మొదట 163 పట్టాలు, రెండోసారి 70 పట్టాలను ఇప్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎల్బీనగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్, అధికారులు, నాయకులు, బస్తీవాసులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


నిరుపయోగమైనవి ఇచ్చేద్దాం.. ఆర్ఆర్ఆర్‌ను ఆదరిద్దాం..

- రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్‌కు శ్రీకారం చుట్టిన ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్
- స్వచ్ఛ భారత్ మిషన్, అర్బన్ 2.0లో భాగంగా 26వార్డుల్లో ఆర్ఆర్ఆర్ కేంద్రాల ఏర్పాటు
- 15 రోజుల పాటు కొనసాగనున్నకేంద్రాలు
- ప్రతి పౌరుడు ఆర్ఆర్ఆర్‌లో భాగస్వామ్యం కావాలి : మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



నవతెలంగాణ - బోడుప్పల్

'మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్' నినాదంతో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) పేరుతో ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్పోరేషన్ పరిధిలోని ప్రజల ఇండ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సేకరిస్తోంది. ఈ క్రమంలోనే స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0లో భాగంగా 26 వార్డుల్లో శనివారం ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ వంశీకృష్ణ ఇతర అధికారులతో కలిసి ఏవీ ఇన్ఫో ప్రైడ్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అంశాలపై ఆసక్తికర అంశాలను వెల్లడించారు.



ఆర్ఆర్ఆర్ ఉద్దేశం...

రెడ్యూస్ అంటే చెత్తకుప్పల్లోకి చేరే వ్యర్థాలను తగ్గించుకోవడం. మనం వినియో గిస్తున్న వాటిలో ఎదైన అవసరం ఉన్నంత వరకే వాడుకోవడం వలన ఆర్థికంగా లాభం చేకూరడంతో పాటు భూమిని కాపాడు కోవడంలో మనవంతు సాయం అందించినట్ల వుతుంద్నారు. భూమి మీద ఉన్న వారందరూ రాబోయే ప్రమాదాలను పూర్తిగా నివారించక పోయినా.. దాని తీవ్రతను తగ్గించవచ్చునని చెప్పారు. చెత్త తగ్గాలంటే వాడి పారేసే వస్తువుల కంటే. మళ్లీమళ్లీ వాడు కోగల వాటికే ప్రాధాన్యమివ్వాలి సూచించారు. అలాగే మనం వాడిన వాటిని మళ్లీ మళ్లీ పునర్వినియోగించడాన్ని రీయూజ్‌గా చెప్పవచ్చు. ఉదాహరణకు మంది కొనుగోలు చేసిన బట్టలు, వాహనాలను కొద్ది రోజుల వాడి పక్కన పడేస్తారు. కానీ ఇవి అవసరం ఉన్నవాళ్లు ఈ సమాజంలో చాలా మంది ఉన్నారు. అలాగే ఇంట్లో మిగిలిన అన్నం పడేస్తారు. కానీ ఆ అన్నం బయట చాలా మంది ఆకలి తీరుస్తుంది. పిల్లల చదవుల కోసం పుస్తకాలను కొనుగోలు చేస్తారు. ఆ సంవత్సరం పూర్తవగానే ఓ మూలన పడేయడం, లేదా అమ్మేయడం చేస్తారు. కానీ పుస్తకాలు కొనుగోలు చేయలేని వారికి అందిస్తే పేదింటి పిల్లలు పెద్ద చదువులు తక్కువ ఖర్చు లతో చదవడంలో పరోక్షంగా మనం సకారం అందించినట్లు అవుతుంది. వాడేసిన వస్తువుల రూపం, తీరుతెన్నులను రీసైక్లింగ్ ద్వారా మా ర్చి మరో అవసరానికి వాడుకోవడం వలన వ్యర్థానికి కొత్త అర్థం చెప్పినట్లు అవుతుంది. ముఖ్యంగా మనుషుల రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగమనేది విడదీయ లేని భాగమై పోయింది. దేశంలో ప్రతి నిమిషం దాదాపు 12-15లక్షల ప్లాస్టిక్ బ్యాగు లను విని యోగిస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవ చ్చును. తక్కువ ఖర్చుతో పాటు సులభంగా అన్ని అవస రాలకు ఉపయోగపడుతుండటంతో వాటిపై ప్రజలు ఎక్కు వగా ఆధారపడుతున్నారు. కానీ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వాడ కం వలన పర్యావరణ కాలుష్యంతో పాటు భూమిపై ఉన్న జీవ రాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికే యాభై మె క్రాన్ల కంటే తక్కువ మందమున్న కవర్లు, వస్తువుల విని యోగంపై నిషేధం అమల్లో ఉంది. కానీ ప్రజల భాగస్వామ్యం, సహకారం లేని కారణంగా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. వాడేసిన ప్లాస్టిక్ ను రీ సైకిల్ చేయడం వలన కొత్త ఉత్పత్తి తగ్గు తుంది. చెడిపోయిన ఆహార పదార్థాల నుంచి సేంద్రీయ ఎరువు తయారికి ఉపయోగించాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను, ఇను ముసు, తదితర వాటిని రీసైకిల్ చేయడం వలన ఏదో ఒక రూపంలో వాటిని మళ్లీ వినియోగంలోకి తీసుకు వచ్చేం దుకు రీసైకిల్ అనివార్యం.

రీసైకిల్ వలన కాలుష్యం తగ్గుతుంది...

మనం వాడిన వాటిలో ఎక్కువ వస్తువులను రీసైకిల్ చేయవచ్చు. ముఖ్యంగా ప్లాస్టిక్, కాగి తం, కాంక్రీట్, మానవ, జంతు, పశు, పక్షి వ్యర్థాలు ఇలా దేనైనా రీసైకిల్ చేసి వాటిని మరో అవసరానికి వినియోగించవచ్చు. కొన్ని రకాల ప్లాస్టిక్ పదార్థాలు నశించిపోయేందుకు కొన్ని వందల సంవ త్సరాల సమయం పడుతుంది. అందుకే ప్లాస్టిక్ రీసైక్లింగ్, ప్రత్యా మ్నాయాల కోసం విస్తృతస్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. రీసైక్లింగ్ విభాగంలో ఈ-వేస్ట్, యూఎస్‌బీ డ్రైవ్లు, స్మార్ట్ ఫోన్స్, ల్యాప్ టాప్స్, డెస్క్ టాప్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా ఉన్నాయి. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం వల్ల గాలి, నేల, నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

పీర్జాదిగూడ పరిధిలో 26 సెంటర్లు..

స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0లో భాగంగా కార్పోరేషన్ పరిధిలోని 26 వార్డుల్లో స్థానిక కార్పొరేటర్లు, కాలనీవాసుల సహ కారంతో ఆర్ఆర్ఆర్ వస్తువుల సేకరకణ కేంద్రాలను ఏర్పాటు చేశా మని మేయర్ తెలిపారు. సుమారు 15 రోజుల పాటు ఈ కేం ద్రాలు కొనసాగుతాయని, ప్రజలు సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి పౌరుడు ఆర్ఆర్ఆర్‌ను ఆదరించడంతో పాటు ఇందులో భాగస్వామ్యం కావాలి మేయర్ పిలుపునిచ్చారు. ఇందులో రీయూజ్ చేసే పరికరాల కోసం కార్పోరేషన్ పరిధిలో అవుట్‌లెట్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వైదేహినగర్‌లో బోరు పనులు ప్రారంభం



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 1 పార్కులో చేపట్టిన నూతన వాటర్ బోర్ పనులను శనివారం డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, సలహాదారు మల్లేశం, ఉపాధ్యక్షులు కృష్ణారావు, కృష్ణారెడ్డి, అదనపు కార్యదర్శి కృష్ణయ్య, జంగారెడ్డి, కోటేష్, మినిష్, అచ్చయ్య, రామ్మోహన్ చౌదరి, మాలాద్రి, డాక్టర్ రాజగోపాల్, పార్టీ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, డివిజన్ ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, నాయకులు జై పాల్ రెడ్డి, డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, పవన్ రెడ్డి, వెంకటేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా నర్సింహారెడ్డిని కలిసిన మధుసూదన్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వక కలిసి అభినందనలు తెలిపారు. ఈ సం దర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్య క్షుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. పార్టీ మారిన నాయ కులు, కార్య కర్తలు తిరిగి రావాలని సూచించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో బూత్ స్థాయి నుంచి పార్టీని బలో పేతం చేయడానికి ప్రతీ కార్యకర్త ముందుండాలని కోరారు.

'బీఎన్‌రెడ్డి నగర్' కాలనీల అభివృద్ధికి కృషి

- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధి ,లోని కాలనీల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని నాగి రెడ్డి కాలనీ ఫేస్ 2, సత్యసాగర్ కాలనీ, పీవీఆర్ కాలనీల్లో త్వరలో ప్రారంభం కానున్న సీసీ రోడ్లను శనివారం జీహెచ్ఎంసీ డీఈ దామోదరరావుతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పీవీఆర్ కాలనీ మాజీ అధ్యక్షుడు సుధాకర్, పార్టీ నాయకులు పవన్ రెడ్డి, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'గుంటి జంగయ్య సేవలు మరువలేనివి'



నవతెలంగాణ- వనస్థలిపురం

ఎల్బీనగర్ ప్రాంత అభివృద్ధికి మన్సురాబాద్ మాజీ సర్పంచ్ గా, వార్డు కౌన్సిలర్‌గా గుంటి జంగయ్య చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ డెలిగేట్, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్య నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దళిత నాయకుడు గుంటి జంగయ్య 16వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థల పరిశీలన



నవతెలంగాణ- వనస్థలిపురం

వైదేహినగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్ 12లో త్వరలో అందుబాటులోకి రానున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలాన్ని శనివారం పలు వురు నాయకులు పరిశీలించారు. ఈ కార్య క్రమంలో బీఎన్ రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద్‌రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు, అసోసియేషన్ సభ్యులు రాజేందర్ రెడ్డి, జే.యల్. నారాయణ పాల్గొన్నారు.

తెలంగాణ అమరుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ భరోసా



నవతెలంగాణ - చైతన్యపురి

సీఎం కేసీఆర్ తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఎంతో భరోసా కల్పించారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీర మల్ల రామ్ నర్సింహ గౌడ్ అన్నారు. ఆర్కే పురం డివిజన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణ అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి పేరును ఎల్బీనగర్ చౌరస్తాకు కమిటీ ఆమోదం తెలపడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు.

ఇబ్రహీంపట్నంపట్నంలో
ఎర్రజెండా ఎగరడానికి కృషి చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ



నవతెలంగాణ-తుర్కయాంజల్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎర్రజెండా మళ్లీ ఎగరాలని.. అందుకోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. తుర్కయాంజల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్‌పేట, తుర్క యాంజల్ మున్సిపాలిటీల సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సీపీఎం పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. అందుకోసం పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించినందుకే కర్ణాటక ప్రజలు మతోన్మాద బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల నుండి అలాంటి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే దరఖాస్తులు పెట్టుకున్న ప్రతి నిరుపేదకు 120 గజాల స్థలం, ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణ ఖర్చుల కోసం రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ప్రజలను పోరాటాలకు సంసిద్ధం చేయాలని పార్టీ శ్రేణు లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఇబ్రహీం పట్నం నియోజకవర్గ కన్వీనర్ పగడాల యాదయ్య, సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్ రాజు, ఎం చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నరసింహ, గోరింకల నరసింహ, కే అరుణ్ కుమార్, ఆలేటి ఆటం, కే శారద, ఎం సత్యనారాయణ, బి శంకరయ్య, ప్రకాష్ కరత్, వెంకటకృష్ణ, ఆశీర్వాదం, యాదయ్య, రత్నమ్మ, రోజా రాణి, సంతు, మధు, శ్రీధర్, మాల్యాద్రి, ప్రేమాజీ తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి'



నవతెలంగాణ సంతోషనగర్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని యాకుత్‌పురా నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన జర్నలిస్టుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని తమ బినామీ కంపెనీలకు అమ్ముతున్న కేసీఆర్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో జర్నలిస్టులు తొమ్మిదేళ్లుగా అనేక పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. గత ఎన్నికలల్లో జర్నలిస్టులకు కేసీఆర్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు. అంతేకాదు సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించితే మీడియాపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. నిజాలు రాస్తే బెదిరింపులకు గురిచేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని పిలుపునిచ్చారు.

రాజ్ కుమార్ రెడ్డికి మాతృ వియోగం



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్ రెడ్డికి మాతృవియోగం జరిగింది. రాజ్ కుమార్ రెడ్డి మాతృమూర్తి కర్మన్ ఘాట్ గ్రామం మాజీ సర్పంచ్ ముడుపు లక్ష్మమ్మ(87) అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందారు. స్వగ్రామం గాయత్రి నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, నల్ల రఘుమారెడ్డి, పార్టీ శ్రేణులు కార్యకర్తలు సభ్యులు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. స్థానిక నాయకులు, పెద్దలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు బంధువులు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత '



నవతెలంగాణ- ఉప్పల్

పర్యావరణ పరిరక్షణ మనందరీ బాధ్యత అని కార్పొరే టర్ బన్నాల గీత అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్స వాలలో భాగంగా 'మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్' అనే కార్యక్రమంలో భాగంగా చిల్కానగర్ డివిజన్లో శనివారం RRR (RE USE-REDUCE-RECYCLE) సెంటర్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అధికారిని చందన, సూపర్వైజర్ సుద ర్శన్‌లతో కలిసి కార్పొరేటర్ మాట్లాడారు. ఈ త్రిబుల్ ఆర్ సెంటర్ నేటి నుండి 05-6-2023 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్లకు ప్రజలు తమ ఇళ్ళలో ఉపయోగి ంచిన నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, బట్టలు, పుస్తకాలు, పేపర్లు తదితర వస్తువులను అందజేయాలని సూచిం చారు. ఈ వస్తువులను తిరిగి ఉప యోగించుకునే వారికి అందజేయడం, రియూస్ రెడ్యూస్ రీసైకిల్ విధానాల ద్వారా వీటిని ఉపయోగించడం ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. వస్తువుల సేకరణ కోసం కాలనీలలో వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్, స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు, శానిటేషన్ సిబ్బంది , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం : ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ- ఉప్పల్

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం అని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. చిల్కానగర్‌లో పలు అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీరప్ప గడ్డ- న్యూ ప్రశాంత్ నగర్ బస్తీలలో ఓఆర్ఆర్ ఫేస్ 2 ద్వారా రూ.60 కోట్లు మంచినీటి పైప్ లైన్ నిర్మాణాలకు విడుదలైనట్లు తెలిపారు. డివిజన్‌లలో వాటర్ పొల్యూషన్ ఉన్నటువంటి ప్రధానమైన హాట్ స్పాట్ లు గుర్తించి, నూతన పైపులైన్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డ్ అధికారులు ఈఈ నాగేందర్, ఏఈ రాజ్ కుమార్, ఏఈ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, శేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బజార్ జగన్, ఏదుల కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరి కాలనీలో మల్ రెడ్డి రాంరెడ్డి పర్యటన



నవతెలంగాణ -ఎల్బీనగర్

చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం యాదగిరి కాలనీలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మల్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు, పార్కు, చెత్త డంపింగ్ సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, డివిజన్ ఉపాధ్యక్షులు మాతంగి యాదగిరి, మొగలిపువ్వు నారాయణ, ప్రధాన కార్యదర్శి తోకటి కిరణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బిట్టు చిరంజీవి, ఓబీసీ అధ్యక్షుడు కారుకొండ శివ, గడ్డం వెంకటేష్, యూత్ కాంగ్రెస్ చింటూ, రాము యాదవ్, రేండ్ల శివ, రణధీర్ రెడ్డి, ఆడేలా రాజా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా

- కార్పొరేటర్ కొత్త కాపు రుణ రవీందర్ రెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ ఎల్ సీహె చ్ కాలనీ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపు తానని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం కాలనీ నాయకులతో కలిసి డ్రైనేజీ మరమ్మతులను చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్బీ ఎయిర్ టెక్ మిషన్ ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శీలా రాణి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, సివరేజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీ ప్రెసిడెంట్ సుభాష్ చంద్ర, నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్మోహన్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ -వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్ద గోని రామ్మోహన్ గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం బీఎన్ రెడ్డి నగర్ కాలనీలో ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎస్ఎల్ఎంఎస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తర్వాత మ్యాక్సీక్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దగౌని రంజిత్ గౌడ్, మనీష్ గౌడ్, సతీష్, చంద్రకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-కాప్రా



అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ చక్రిపురం అసోసియేషన్ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో తమ ఇంట్లో పనికిరాని వస్తువులను పేదలకు ఉపయోగపడే విధంగా, ప్లాస్టిక్ వ్యర్థాలను ఖాళీ స్థలాల్లో పడవేయకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాలను, పనికి రాని వస్తువులను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, పర్యావరణానికి హానీ చేయకుండా ఉండాలని కార్పొరేటర్ కాలనీ వాసులతో, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



టీచర్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కాలనీ సమస్యల గురించి కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ అడిగి తెలుసుకున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ క్యాంప్ కార్యాలయానికి పిలిచి కాలనీ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారని ప్రస్తుతం రోజు వారీగా శానిటేషన్, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు మహిపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, భూపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, తిరుమల్, నర్సింహ, ఆంజనేయచారి, దర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ విశ్వవిద్యాలయం మిస్సోరి విశ్వవిద్యాలయం మధ్య ఒప్పందం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లి దాయరలోని ఎస్ఆర్ ఇంటర్నేషనల్ విశ్వవిద్యాలయంలో అమెరికాలోని మిస్సోరీ విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. పరస్పర ఒప్పందాలపై విశ్వవిద్యాలయ ప్రతినిధులు సంతకాలు చేసుకుని ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సార్ విశ్వవిద్యాలయం, అమెరికాలోని మిస్సోరి విశ్వ విద్యాలయాల ప్రతినిధులు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నూతన విద్యా అభివద్ధి కోసం అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయంతో హనుమకొండ జిల్లాలోని ఎస్సార్ విశ్వవిద్యాలయం మధ్య శనివారం పరస్పర ఒప్పందం కుదిరిందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక విద్యతో పాటు, నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు అధునాతన విద్యా అవకాశాలను పెంపొందించుకునేందుకు, అంతర్జాతీయ ఇంజినీరింగ్ ప్రోగ్రాం సంబంధిత పలు అంశాలపై అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయమైన యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి, ఎస్సార్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నామని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి ప్రెసిడెంట్ డాక్టర్ రోజర్ టెస్ట్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో మూడేండ్లు యూఎస్ఏలోని సెంట్రల్ మిస్సోరీలో ఏడాది చదవడం ద్వారా బీఎస్ డిగ్రీ పొందే విధంగా, మరో ఏడాది చదవడం ద్వారా ఎంఎస్ డిగ్రీ పొందే విధంగా ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. ఎస్సార్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చాన్సలర్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు, శాస్త్ర సాంకేతికత నవీన ఆవిష్కరణలు చేపట్టేందుకు అనేక జాతీయ అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడంలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఈ ఒప్పందం ద్వారా తక్కువ ఖర్చుతోనే అంతర్జాతీయ డిగ్రీ పొందే అవకాశం మన విద్యార్థులకు లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి ప్రతినిధులు డాక్టర్ సిల్ బ్రిడ్గం, ప్రొవెస్ట్ అండ్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ అకాడమిక్ అఫైర్స్ డాక్టర్ జెప్పా రోబోటిస్టన్, బీస్ కాలేజ్ ఆఫ్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డాక్టర్ ఫిల్ హాల్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ సర్వీసెస్, డాక్టర్ మహమ్మద్ యూసఫ్ గ్రాడ్యుయేట్ కో-ఆర్డినేటర్ కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ, ఎస్సార్ విశ్వవిద్యాలయం డాక్టర్ వి.మహేష్, డీసీ స్టూడెంట్స్ వెల్ఫేర్, డాక్టర్ అర్చన రెడ్డి, డీన్ అకాడమిక్స్, తదితరులు పాల్గొన్నారు.

మర్ధ్‌ఫోర్ట్ గ్రౌండ్‌లో క్రీడాకారులతో గజ్జెల నగేష్ ఆత్మీయ పలకరింపు



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ శనివారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సిక్ విలేజ్, మర్ధ్‌ఫోర్ట్ గ్రౌండ్స్‌లో క్రీడాకారులను ఆత్మీయ పలకరింపులు చేశారు. మార్నింగ్ వాకర్స్ ఉన్న క్రీడాకారులతో చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో కంటోన్మెంట్ గ్రామీణ క్రీడాకారులు రాణించేలా వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రానున్న రోజుల్లో క్రీడల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు వారికి అవసరమైన క్రీడా సామాగ్రి అందించేందుకు కషి చేస్తానని హామీనిచ్చారు. ఈ ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో కోచ్‌లు దిలీప్, రామ్, లోకేష్, మనీ తేజ, బీఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు

నవతెలంగాణ-కాప్రా



డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సమక్షంలో సందీప్, కనకయ్య ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు బీజేపీలలోకి చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం, డివిజన్ అధ్యక్షులు కన్నెబోయిన రమేష్ యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకులు మరి మోహన్‌రెడ్డి, డివిజన్ నాయకులు ఉమా శ్రీధర్, రొయ్యల చిత్తారి, రామసాని ప్రభాకర్ రెడ్డి, రాజు యాదవ్, పాపిరెడ్డి, దేవ, శరత్ చంద్ర, సురేష్ ధర్మ, అనిల్ కుమార్, గిరి గౌడ్, దొంతుల ప్రభాకర్, రోహిత్, కుంతల కిరణ్ పాల్గొన్నారు.

రెడ్యూస్ రీ యూజ్ రీసైకిల్‌ను ప్రజలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రెడ్యూస్ రీ యూజ్ రీసైకిల్‌ను ప్రజలు వినియోగించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం పురపాలక సంఘంలోని "మేరా లైఫ్-మేరా స్వచ్ షెహర్" లో భాగంగా (ఆర్ఆర్ఆర్)ను ప్రజలందరూ తమ ఇళ్లలోని తడి, పొడి చెత్త సేకరణకు సహకరించి వాడబడిన, పనికిరాని పొడి వస్తువులను ఈ ఆర్ఆర్ఆర్ సెంటర్ల వద్ద ఇచ్చి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. 5వ వార్డులోని వడ్లకొండ పద్మ అనే మహిళ తన ఇంట్లోని 25 కిలోల డ్రై వేస్ట్‌ని ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణి రెడ్డి, ఉత్తమ ఆర్ఆర్ఆర్ మహిళా పార్టిసిపెంట్‌గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల నుంచి పిల్లలు వారి చదువు పూర్తయిన లేదా అనవసర పుస్తకాలు ఆర్ఆర్ఆర్ సెంటర్‌ల వద్ద అందజేశారు. ఇంట్లోని డ్రై వేస్ట్ సంబంధ వస్తువులైన పుస్తకాలు, అట్టముక్కలు, పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు, వాడబడిన బట్టలు, కర్ర వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు 17వ వార్డులోని ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద ఇవ్వడం అందించారు. పుస్తకాలు అట్టముక్కలు వంటివి 300 కిలోలు బట్టలు 150 కిలోలు, ప్లాస్టిక్ వస్తువులు 650 కిలోలు, ఎలక్ట్రానిక్ వస్తువులు 50 కిలోలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కార్యాలయం మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అల్వాల్‌లో స్వచ్ఛతపై స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



ఆల్వాల్ సర్కిల్‌లో 11 రోజులుగా డివిజన్ల వారీగా స్వచ్ఛతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏఎమ్‌హెచ్‌ఓ మంజుల నేతత్వంలో పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రెడ్యూస్, రెఫ్యూజ్ రీ సైకిల్ సెంటర్‌ను ప్రారంభించారు. బట్టలు, బ్యాగులను ఉపయోగించే విధంగా అవగాహన కల్పించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో విద్యార్థులకు కాలనీవాసులకు భాగస్వామ్యం కల్పించి పర్యావరణాన్ని కాపాడాలని ఆమె సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాగమణి, ఎస్ఎస్ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు సృజనాత్మక పారిశ్రామికవేత్త అవార్డు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



దుబాయ్‌లో మనిక ట్రేడింగ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో దుబాయ్‌కి చెందిన షేక్ డాక్టర్ అబుదుల్లా చేతుల మీదుగా ముగ్గురు భారతీయ యువ పారిశ్రామికవేత్తలకు సజనాత్మక పారిశ్రామికవేత్త అవార్డులను అందుకున్నారు. ఈ నెల 16న దుబాయ్‌లో జరిగిన డా.ఆకెపోగు షీర్లీ హెలెన్ (హైదరాబాద్), వెంకట్ కళ్యాణ్ చివుకుల (యుఎస్ ఏ) ఎంఎస్.అలేఖ్య అర్నెపల్లి (హైదరాబాద్)లు ఈ అవార్డులను అందుకున్నారు. గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌లో విజయవంతమైన వ్యాపారాలను రూపొందించడంలోనూ, నిరుద్యోగులకు ఉద్యోగాలను సష్టించడంలో గొప్ప మార్పును చూపుతున్న యువ పారిశ్రామికవేత్తలను గుర్తించడానికి ఈ కార్యక్రమం నిర్వహించబడింది. తనకు ఈ అవార్డు వచ్చినందుకు డా.షీర్లీ కతజ్ఞతలు తెలిపారు. ఈ అద్భుతమైన విజయాన్ని సాధించడంలో తనకు అండగా నిలిచిన కుటుంబం, స్నేహితులకు ఆమె ఈ అవార్డును అంకితం చేశారు.

'సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం'

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కష్ణానగర్ కాలనీకి చెందిన మహ్మద్ హైమత్ లూస్ ఫ్లవర్స్ విక్రేత. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పేదరికం గుర్తించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బాధితుడికీ మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు రిఫర్ చేశారు. దీన్ని పరిశీలించిన సీఎం కేసీఆర్, బాధితుడికి గుండె ఆపరేషన్ కోసం కోసం రూ. లక్ష మంజూరు చేసారు. సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్, బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఇషాక్‌ఖాన్, అతీక్ పాషా, అక్రమ్, ఎండీ షరీఫ్, ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-నాచారం



మల్లాపూర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ పంకజాను కలిసి వినతి పత్రం అందజేశారు. మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లోని పాత వార్డు కార్యాలయం పైన అదనపు అంతస్తు నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. డివిజన్‌లో ఇప్పటికే అనేక అభివద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివద్ధిలో ముందు వరుసలో నిలుస్తున్న మల్లాపూర్ రాబోయే కాలంలో గ్రేటర్‌లోని నంబర్ వన్ స్థానంలో మల్లాపూర్ డివిజన్ ఉండాలని కార్పొరేటర్ ఆకాంక్షించారు. వెంటనే ప్రతిపాదనను ఆమోదించి అభివద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైళ్ల ప్రవీణ్, నిమ్మల శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవన శైలి అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మోడర్న్ మార్కెట్ భవనంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ హిత జీవన శైలి అవగాహనా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ తడి పొడి చెత్తను సేకరించే విధానం ప్రకారంగానే ముఖ్యమైన ప్లాస్టిక్ చెత్తను కూడా ఇంటిలోనే విభజిస్తే, ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు ఎక్కువ అవకాశం ఉంటుందనీ, సమాజంలో ప్రతి ఒక్కరూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించి, ప్రభుత్వాలు మాత్రమే వాటిని నియంత్రించాలి అంటే అది సాధ్యపడదనీ, సమాజంలో మనం కూడా ఒక భాగమే అనీ, ఒక విధంగా మనమే ఒక సమాజం అనే స్పహతో ఉండాలనీ, ప్లాస్టిక్ అవసరాన్ని గుర్తిస్తూనే మనం దాన్ని నియంత్రించినప్పుడు మాత్రమే అందమైన పర్యావరణాన్ని మనం ముందు తరాల వాళ్ళకు బాధ్యతగా అందించగలుగుతాం అన్నారు. వీలైనంత వరకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నూతన ఉత్పత్తి చేయడం, ఉత్పత్తి చేసిన వస్తువును పునర్వినియోగం చేయడంపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వప్నారెడ్డి, రాంకీ సంస్థ సూపర్వైజర్ అనిల్, జవాన్ యాదగిరి, ఎస్ఎఫ్ఏ లక్ష్మీనరసింహ, సాయి, పద్మ, గోవర్ధన్, పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన లక్ష్మినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, లక్ష్మి నగర్ మూడు కాలనీ బయట కలుపుతూ డ్రయినేజీ పైప్ లైన్లు వేయాలనీ, కొన్ని స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలనీ, పోలీస్ పెట్రోలింగ్ వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కాలనీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీవాణి, శివ చరణ్, జితేందర్, కొండయ్య, కిరణ్, అశోక్, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనశైలి ప్రతి పౌరుడి బాధ్యత

నవతెలంగాణ-నాచారం



పర్యావరణ హిత జీవితశైలి ప్రతి పౌరుడి బాధ్యత అని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. శనివారం నాచారం వార్డు కార్యాలయం నుంచి హెచ్ఎంటీ కమాన్ వరకు ర్యాలీ నిర్వహించి పర్యావరణ హిత జీవనశైలి పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇండ్లలో నిరుపయోగంగా ఉన్న మనం వేసుకునే దుస్తులు, చెప్పులు, వాటర్ బాటిల్, ఫర్నీచర్, విరిగిపోయిన కుర్చీలు, టేబుళ్లు ఈనెల 21వ తారీకు నుంచి వచ్చే జూన్ 5వ తేదీ వరకు నాచారం వార్డు కార్యాలయం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులను అక్కడ అందించి పర్యావరణ పరిరక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని పేర్కొన్నారు. మానవహితం కోసం మంచి మనసుతో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేసి పర్యావరణానికి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ కృష్ణ, ఎస్ఎఫ్ రాజేష్, యాకస్వామి, శానిటరీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ స్వామి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో మేరా లైఫ్, మేరా స్వచ్ఛ షేహర్ (ఆర్ఆర్ఆర్)లో భాగంగా క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మన ఇంట్లోని పాత బట్టలు, పాత పుస్తకాలు, పేపరు, ప్లాస్టిక్ పదార్థాలు ఇందులోని ఏ వస్తువులైన ఉంటే దమ్మాయిగూడ మునిసిపల్ పరిధిలో వివిధ కాలనీలో తొమ్మిది క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజీవ్ గహకల్ప కాలనీ సుఖీభవ హాస్పిటల్ దగ్గర ఆర్‌జికే రోడ్డు, ఇందిరమ్మ కాలనీ పేస్ 2 బృందావన కాలనీ గణేష్ మండపం దగ్గర. అంజనాద్రి నగర్ బానయ్య కట్ట దగ్గర, దమ్మాయిగూడ మెయిన్ రోడ్డు రోజ్ గార్డెన్ ఎదురుగా, దమ్మాయిగూడ మున్సిపల్ ఆఫీస్ దగ్గర, కుందన్ పల్లి వార్డ్ ఆఫీస్ దగ్గర, అహ్మద్ గూడ వార్డ్ ఆఫీస్ దగ్గర ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కాప్రా



కుషాయిగూడ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారి ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. 5 నెలలకు గాను రూ.ఏడు లక్షలా యాభై మూడువేల నాలుగు వందల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, పంజాల శ్రీనివాస్ గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

నవతెలంగాణ-ఓయూ



మహిళలు అని రంగాల్లో రాణించాలని మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి అన్నారు. మానికేశ్వరి నగర్‌లో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్ పేయి ఫౌండేషన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో పలు కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలతో ఆమె మాట్లాడారు. కేంద్ర పర్యటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ఆమె అభినందించారు. స్థానిక మహిళలకు రానున్న రోజుల్లో అటల్ బీహార్ వాజ్ పేయి ఫౌండేషన్ ద్వారా మరింత ప్రోత్సాహం కల్పిస్తామని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసిన నాయీ బ్రాహ్మణ నాయకులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఇంద్రనగర్ కమిటీ ప్రెసిడెంట్ కె.రమేష్, వైస్ ప్రెసిడెంట్ సింగిడాల రూపేష్, జనరల్ సెక్రెటరీ రమేష్, కోశాధికారి నరసింహ ఎమ్మెల్యేకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యలను త్వరలోనే పరిష్కరించి ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణాన్ని ప్రతి నాయీ బ్రాహ్మణ కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్టు రమేష్ తెలిపారు.

హైదరాబాద్ పోలీస్ పునర్ వ్యవస్థీకరణ

- 35 ఏండ్ల తర్వాత..
- హైదరాబాద్ పోలీస్ కమిషనరెట్‌లో 7జోన్లు, 78 పోలీస్ స్టేషన్ల ఏర్పాటు
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

35 ఏండ్ల తర్వాత హైదరాబాద్ పోలీస్ పునర్ వ్యవస్థీకరణ జరిగింది. రాబోయే 15 ఏండ్లకు సరిపడే విధంగా కమిషనరేట్‌ను పునర్ వ్యవస్థీకరణ చేశారు. బార్డర్ల సమస్యలు లేకుండా మూసీరివర్, చెరువులు, రోడ్డు మార్గాలతోపాటు ఇతర అన్ని అంశాలను పరిశీలించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు ఐదు డీసీపీ జోన్లు, 17 డివిజన్లల్లో 60 పోలీస్ స్టేషన్లు ఉండేవి. తాజాగా 2 కొత్త డీసీపీ జోన్లు, 11 ఏసీపీ డివిజన్లు, 11 కొత్త లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లతోపాటు 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, 5 కొత్త ఉమెన్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దాంతోపాటు 7 జోన్లు, 28 డివిజన్లు, 71 పోలీస్ స్టేషన్లు, 31 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. 7 మహిళా పోలీస్ స్టేషన్లతోపాటు సీసీఎస్, డీడీ, సిట్ ఒక యూనిట్‌గా, సైబర్‌క్రైమ్ మరో యూనిట్‌గా ఏర్పాటు చేశారు. ఐసీసీసీతోపాటు సెక్రటేరియట్ కొత్త పోలీస్ స్టేషన్, ఏడు బృందాలుగా





టాస్క్‌ఫోర్సును చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి కొత్త పీఎస్‌లన్నీ పూర్తిస్థాయిలో పని చేస్తాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు సీపీ జీ.సుధీర్‌బాబు, విక్రమ్‌సింగ్ మాన్ జాయింట్ సీపీలు విశ్వప్రసాద్, గజారావుభూపాల్, పరిమిళతో కలిసి సీపీ సీవీ ఆనంద్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ జనాభా విపరీతంగా పెరుగిందన్నారు. సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెరుగు చేయడంతో పాటు శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారన్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ల పెంపుదల, జోన్ల మార్పుపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని తెలిపారు. 6 నెలల పాటు రీ ఆర్గనైజేషన్ కమిటీ కూర్చుని కొత్త పోలీస్‌స్టేషన్లకు ప్రతిపాదన చేసిందన్నారు. 35 ఏళ్ల కింద హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 25 లక్షల మంది జనాభా ఉండేవారనీ, ప్రస్తుతం 85 లక్షలకు పెరిగిందన్నారు. 1987లో 8,76,126 వాహనాలు ఉంటే ఇప్పుడు 80,70,852 వాహనాలు పెరిగాయని సీపీ చెప్పారు.

సెక్రటేరియట్ కోసం కొత్త పీఎస్

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్లు కలిపి 1.60 కోట్ల మంది జనాభా శాంతి భద్రతలు కంట్రోల్ చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్లలో కేసులు సైతం పెరుగుతుండటంతో భారమవుతోందన్నారు. సెక్రటేరియట్ కోసం కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. సెక్రటేరియట్ సెక్యూరిటీ కోసం ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు విధుల్లో ఉంటారన్నారు. సెక్రటేరియట్ పోలీస్ స్టేషన్‌ను బీఆర్‌కే ఏర్పాటు చేస్తున్నామన్నారు. సైబర్ క్రైమ్ కోసం ఒక డీసీపీతో పాటు మొత్తం 148 మంది పోలీస్ అధికారులను కేటాయించినట్లు చెప్పారు.

35 శాతం కానిస్టేబుళ్ల ఖాళీలు

కొత్త పోలీస్‌స్టేషన్ల కోసం కొన్ని భవనాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చియనీ, మరికొన్ని సిద్ధమవుతున్నాయన్నారు. పని ఒత్తిడి ఎక్కువ ఉన్న పోలీస్ స్టేషన్లకు 90శాతం మేరకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. జూన్ 2 నుంచి కొత్త పోలీస్ స్టేషన్స్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామన్నారు. 35శాతం సివిల్ కానిస్టేబుళ్స్,. 120 ఎస్ఐ పోస్టులు ఖాళీలున్నాయన్నారు. కొత్త పోలీస్ స్టేషన్లకు సరిపడే వెహికిల్స్, కంప్యూటర్స్, బైక్స్ ఇస్తామని వెల్లడించారు. కొత్త పోలీస్ స్టేషన్ల కోసం ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించిందని సీపీ ఆనంద్ స్పష్టం చేశారు.

నగరంలో 78 పోలీస్ స్టేషన్లు

- కొత్త పోలీస్ స్టేషన్‌లు కలిపి ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనరెట్‌లో 78 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.
- అబిడ్స్ పోలీస్ స్టేషన్‌గా హైదరాబాద్ కలక్టరేట్ బిల్డింగ్
- బీఆర్‌కే భవన్‌లో సెక్రటేరియట్ పోలీస్ స్టేషన్
- ఫిలింనగర్‌లో ఆపరేటివ్ సొసైటీ ప్రెమిసెస్‌లో ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు- మధురానగర్ పోలీస్ స్టేషన్‌గా రెహ్మత్ నగర్ ఓపీ బిల్డింగ్
- సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లో ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్
- హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లో మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్
- బోరబండ ఔట్ పోస్ట్ పోలీస్ వద్ద బోరబండ పోలీస్ స్టేషన్.

నోట్ల రద్దు కాదు ప్రజలకు పన్ను రాయితీలు అందించండి



నవతెలంగాణ-అంబర్‌పేట

ధనిక కార్పొరేట్ అనుకూల విధానాల్లో భాగంగానే మోడీ ప్రభుత్వం రూ.2వేల నోట్లను రద్దు చేసిందనీ, నేటి ఆర్థిక పరిస్థితుల్లో అవసరమైనది నోట్ల రద్దు కాదనీ, ప్రజలకు పన్ను రాయితీలు అందించి వారికి ఊరట కలిగించాలనీ, నల్లధనం రాబట్టాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ డిమాండ్ చేశారు. 2016లో రూ.500, రూ.1000 నోట్ల రద్దుతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారనీ, ఆర్థిక రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపిందనీ, జీడీపీని ప్రభావితం చేసిందని తెలిపారు. హైదరాబాద్ తన కార్యాలయం నుంచి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆకస్మిక, తీవ్రమైన చర్యలు సామాన్య ప్రజలకు వేధింపులకు గురి చేయడం తప్ప మరొకటి కాదని కోట నీలిమ మండిపడ్డారు. సమాజంలో వ్యాప్తి చెందుతున్న నల్లధనాన్ని అరికట్టడానికి నోట్ల రద్దు మార్గం కాదన్నారు. గతంలో నల్లధనం మూలాలను తొలగించే ఉద్దేశంతో రూ.1000, రూ.500 నోట్లు రద్దు చేసి, మోడీ ప్రభుత్వం ఎంత నల్లధనం సమీకరించింది? ఈ లెక్కలను దేశ ప్రజల ముందు బహిర్గతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.2000 నోట్ల రద్దు పూర్తిగా అశాస్త్రీయమైనదనీ, మూర్ఖపు నిర్ణయం అనీ, దీనితో ప్రధాని మోడీ ప్రభుత్వం తన అసమర్థత నిరూపించుకుందనీ, స్థిరమైన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్



విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్టు భవనంలోని సమావేశం మందిరంలో ముషీరాబాద్ రేడియంట్ హైస్కూల్ 2022-23వ బ్యాచ్ పదోతరగతి టాపర్స్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌ను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదివి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నతంగా రాణించవచ్చునన్నారు. విద్యతోపాటు క్రీడా రంగాల్లోనూ రాణించేందుకు కృషి చేయాలన్నారు. 59 ఏండ్లుగా రేడియంట్ హైస్కూల్‌ను నిర్వహిస్తూ, సేవాభావంతోపాటు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా విద్యాబోధనలు అందించడం అభినందనీయమన్నారు. ఉత్తమ బోధనలు అందించినప్పుడే పాఠశాలకు మంచి పేరు, ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పేద, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రేడియంట్ హై స్కూల్ ఫౌండర్ కరస్పాండెంట్ సయ్యద్ అన్వర్ ఉల్లా భక్తియార్ మాట్లాడుతూ తమ స్కూల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్ల వంటి ఉన్నతస్థితిలో కొనసాగుతున్నారన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవ చేయాలనే లక్ష్యంతో పేదలకు నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన విద్యబోధనలు అందిస్తున్నామన్నారు. పదోతగరతి ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థిని బి.ఎస్.ప్రాచీకి గోల్డ్ కాయిన్ అందజేసి అభినందించారు. వరుసగా 9.3, 9.2, 9.0 జీపీఏ సాధించిన విద్యార్థులు మహ్మద్ ఇమ్రాన్ అహ్మద్, ఉజ్మా ఆకుల వైష్ణవిలకు సిల్వర్ మెడల్స్‌ను అందజేయడంతోపాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, వంద శాతం హాజరున్న పిల్లలకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎడ్ల హరిబాబుయాదవ్, ముఠా జైసింహ, స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మదుల్లా భక్తియార్, ఉపాధ్యాయులు అశ్ర ఫాతిమా, ఎం.మంజుశ్రీ, అనిత తదితరు పాల్గొన్నారు.

ఔషధాల అభివృద్ధి హబ్‌గా హైదరాబాద్

- అంతర్జాతీయ క్లినికల్ ట్రయల్స్ డే జరగడం గొప్ప విషయం
- మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్/సిటీబ్యూరో



వివిధ వ్యాధులకు సరైన ఔషధాలను అభివృద్ధి చేయడంలో క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ ట్రయల్స్ చాలా ముఖ్యమని అని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం నెక్లెస్ రోడ్డులో అంతర్జాతీయ క్లినికల్ ట్రెల్స్ డే అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఔషధాల అభివృద్ధి హబ్‌గా మారుతుందన్నారు. అంతర్జాతీయ క్లినికల్ ట్రయల్స్ డే జరగడం తెలంగాణ సాధించిన విజయం అన్నారు. సరైన వ్యాక్సిన్లను కనుగొనడంలో సైంటిస్టుల సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఫార్మా, క్లినికల్ ట్రయల్స్ రంగాల్లో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే హైదరాబాద్ ఒక ముఖ్యమైన కేంద్రంగా మారిందన్నారు. మందులు సామాన్యులకు అందుబాటు ధరల్లో లభించేలా మరిన్ని పరిశోధనలు జరగాలన్నారు. సొసైటీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ మెడిసిన్ అండ్ రీసెర్చ్, అడ్విటీ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, క్లినోసోల్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన వాక్-ఎ-థాన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత ప్రభుత్వ సీడీఎస్సీవో డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రాంకిషన్ ఈ వాక్-ఎ-థాన్‌ను జెండా ఊపి ప్రారంభించగా, వందలాది మంది వైద్య, క్లినికల్ రీసెర్చ్ నిపుణులు పాల్గొన్నారు. క్లినికల్ రీసెర్చ్, స్టడీస్‌లో అందరూ మరింతగా పాల్గొనాల్సిన ప్రాముఖ్యత, ఆవశ్యకతను ఆయన వివరంగా నొక్కి చెప్పారు .క్లినికల్ రీసెర్చ్ రంగంలో విశేష సేవలందించిన నిమ్స్, గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీలు, భారత్ బయోటెక్‌కు చెందిన వైద్య నిపుణులు, పరిశోధకులను మంత్రి సన్మానించారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ప్రభాకరరెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు.

ఓయూలో నిమ్మ రసం పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఓయూలో ఓయూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ)అధ్వర్యంలో కార్మికులకు నిమ్మరసం పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ సుందరయ్య 38 వర్ధంతి ఓయూ లో నిర్వహించడం చాలా గర్వంగా ఉందని యూనియన్ నాయ కులను అభినందించారు. కార్మికులకు పోరాటాలు నిర్వహించడమే కాకుండా ప్రజలకు నిత్యావసరాలు గుర్తించి, కార్యక్రమాలు చేయడం చాలా అవసరమన్నారు. ఆనాడు సుందరయ్య అనేక కార్యక్రమాలు చేసే వారు అని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతర అధ్యయనం, సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక పోరాటాలను నిర్వహించడం కామ్రేడ్ పిఎస్‌కి నేడు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్, శ్రీధర్ రావు, నాయకులు శ్రీను, అనసూయ, నాగరాజు, శివకుమార్, నాగ లక్ష్మమ్మ, నాగరాణి, పాశ, మక్సూద్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-అంబర్‌పేట



పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట తహసీల్దార్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో అలికేప్ దగ్గర ఎస్ఆర్‌జీ ఫంక్షన్ హాల్‌లో 79 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, పులిజల గెల్వెయ్య, కనివెట నర్సింగ్ రావు, నర్సింగ్ యాదవ్, రమేశ్ నాయక్, వంజరి నాగరాజు, పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భారత్ జాతీయ మహిళా సమాఖ్య పిలుపుమేరకు మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన మల్లయోధుల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా హైదరాబాదు జిల్లా సమితి ఆధ్వర్యంలో సేకరించిన సంతకాలను హైదరాబాదు జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ ప్రతినిధి వర్గంలో జిల్లా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు ప్రేమ పావని అధ్యక్షురాలు పడాల నళిని, .ప్రధాన కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, ఉపాధ్యక్షురాలు షహనా అంజు , సహాయ కార్యదర్శి వి.చక్రిబాయ్, కోశాధికారి ఎం.లక్ష్మి. ఉన్నారు. భారత మల్ల యోధులు ఒలంపిక్స్‌లో భారత కీర్తి ప్రతిష్టలను ఇనుమాటింప చేసే విధంగా శ్రమించి దేశానికి బంగారు పతకాలను సాధించడంలో వారు చేసిన కృషి అభినందనీయం అన్నారు. దేశ ప్రతిష్టను గౌరవాన్ని నిలబెట్టిన అలాంటి మల్లయోధులకు ప్రోత్సాహాన్ని సహకారాన్ని అందించి వారిని మరింత ముందుకు నడిపించాల్సిన అధ్యక్షుడే వారిపై లైంగిక వేధింపులకు పాల్పటటం సిగ్గుచేటైన విషయం అన్నారు. ఈ విషయాన్ని అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని మల్లయోధులు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో గత నెల 23 నుంచి ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద చేస్తున్న పోరాటానికి మద్దతుగా మహిళా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు, వివిధ పార్టీలు సంఘీభావాన్ని మద్దతును తెలియజేశారు. అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మల్ల యోధులు పట్ల చూపుతున్న నిర్లక్ష్యం పట్ల మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండించింది. ప్రధానమంత్రి మోడీ మన్‌కి బాత్‌లో బేటీ బచావో బేటీ పడావో అనే నినాదం నీటి మీద రాతలుగా మారిందన్నారు. వారి పార్టీకి సంబంధించిన ఎంపీ చేసిన దురాగతాన్ని కప్పిపుచ్చడానికి శతవిధాల ప్రయత్నం చేస్తుంది ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వం అనీ, ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం విడ్డూరం అన్నారు. మల్ల యోధులకు రక్షణ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం వారిని రోడ్డుపైకి వచ్చి పోరాటం చేసే పరిస్థితిని కల్పించిన ప్రభుత్వం తీరును ప్రతి మహిళ ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణం పోస్కో, పోస్ట్ చట్టాల కింద ఎంపీని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలనీ, ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని మహిళా సమాఖ్య డిమాండ్ చేస్తుంది. అతనిపై వచ్చిన ఫిర్యాదులపై న్యాయ విచారణ జరిపించాలలనీ, చార్జీ షీట్ దాఖలు చేసి ఫాస్ట్ పోర్టులో విచారణ చేయాలనీ, భవిష్యత్తులో పోస్ట్, పోస్కో చట్టాలు సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేయటానికి అన్ని చర్యలు తీసుకోవాలి కోరారు. త్వరలో పై డిమాండ్ల పై ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే మహిళా సమాఖ్య మల్లయోధులకు సంఘీభావంగా మద్దతుగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు.

రోగుల ఆత్మీయ సమ్మేళనానికి 'కేర్ కనెక్ట్'



నవతెలంగాణ-బంజారాహిల్స్

అవయవ మార్పిడి రోగుల ఆత్మీయ సమ్మేళననికి 'కేర్ కనెక్ట్' ద్వారా కేర్ ఆస్పత్రిలో వినూత్న కార్యచరణ చేపట్టారు. ఇందులో భాగంగా వైద్యులు, రోగుల మధ్య స్నేహపూరిత, అనుబంధ వాతావరణం పెంపొందించడంతోపాటు వారిలో మనోధైర్యాన్ని కల్పించే లక్ష్యంగా సంస్థ కృషి చేస్తుందని నిర్వహకులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో శనివారం అవయవ మార్పిడి రోగులతో ఆత్మీయ సమ్మేళనంలో హాస్పిటల్ హెచ్‌సీఓఓ నీలేష్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూత్రపిండాలు, కాలేయం, గుండె మార్పిడి రోగులు, వారి కుటుంబ సభ్యులు, వారికి వైద్యం అందించిన వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. హాస్పిటల్ ఆతిథ్య రోగుల సంరక్షణ విభాగం గ్రూప్ ఉపాధ్యక్షులు విజయ్ సేథి మాట్లాడుతూ రోగుల్లో రోగికి జబ్బు కంటే భయం ఎక్కువగా ఉంటుందనీ, వారికి మనోనిబ్బరం, శరీర ఆరోగ్యం మెరుగుదలే ముఖ్యంగా లక్ష్యంగా కేర్ కనెక్ట్ కార్యక్రమం చేపట్టామన్నారు. అవయవ మార్పిడి శస్త్ర చికిత్సల అనంతర జీవన ప్రయాణంలో రోగి ఆరోగ్యంలో మెరుగుదల, కుటుంబ సభ్యుల సహకారం, సమాజంలో జీవనశైలి విధానాలను వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో రోగుల సమ్మేళనం వల్ల వారిలో మరింత ఉత్సాహం కలుగుతుందనీ, ఆరోగ్యంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నీలేష్ గుప్తా మాట్లాడుతూ రోగికి మనోధైర్యం ఇచ్చే రోగి సహాయకులు సైతం ఈ కార్యక్రమాల ద్వారా ధైర్యాన్ని కోల్పోకుండా చివరి వరకు పోరాటం చేస్తూ వైద్యానికి సహకరించే సంరక్షణ తీసుకుని బాధ్యత గుర్తేరుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్‌సింగ్, యూరాలజీ విభాగం డైరెక్టర్ (కిడ్నీ మార్పిడి) డాక్టర్ ప్రసాద్ రాజు, హృద్రోగ నిపుణులు (గుండె మార్పిడి) డాక్టర్ టీకేఎస్ శాస్త్రి, అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ టీవీఎస్ గోపాల్, లేబరేటరీ విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్, కాలేయ మార్పిడి విభాగాధిపతి డాక్టర్ నయీం, గుండె మార్పిడి విభాగం నుంచి డాక్టర్ సుధీర్, డాక్టర్ నగేష్, కాలేయ మార్పిడి విభాగం నుంచి డాక్టర్ రిజ్వాన్, డాక్టర్ అలీ, డాక్టర్ విక్రాంత్ రెడ్డి, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అవయవ మార్పిడి చేయించుకున్న రోగులు పాల్గొన్నారు.

దళితబంధు అవినీతిపై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



దళిత బంధు పథకంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని మాదిగ నవనిర్మాణ సమితి డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి నగేష్ మాట్లాడారు. దేశంలోనే ఉన్నతమైన పథకం అని చెబుతున్న ఈ పథకంలో వందల కోట్లు దారి మల్లుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా తుంగతుర్తి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా పథకాన్ని అమలు చేయగా స్థానిక ఎమ్మెల్యే గాదారి కిషోర్ భారీగా చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. ఏజెన్సీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా లబ్ధిదారుల నుంచి జీఎస్టీ, ఎమ్మెల్యే కమిషన్, అధికారుల కమిషన్ అంటూ దోచుకుంటున్నారని ఆరోపించారు. కేవలం తుంగతుర్తి నియోజకవర్గం లోని సుమారు రూ.100 కోట్ల వరకు అవినీతి జరిగిందనీ, దీనిపై విచారణ జరిపించాలని కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దళితుల పాలిట వరమైన ఈ పథకానికి తూట్లు పొడుస్తున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, అధికారులపై ఈడీ, సీబీఐ వంటి ఉన్నత విచారణ సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్ష కైనా సిద్ధమని నగేష్ స్పష్టం చేశారు. దళిత బంధు ఎంపికలో ఎమ్మెల్యేల ప్రమేయాన్ని తీసివేయాలంటూ, అవినీతికి పాల్పడ్డ ఎమ్మెల్యేలపై విచారణ జరిపించాలని ప్ల కార్డులను ప్రదర్శించారు.

రూ.లక్ష రుణం అన్ని బీసీ కులాలకు ఇవ్వాలి

- వెంటనే బీసీ బంధు ప్రవేశపెట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.లక్ష రుణం ప్రతి బీసీ కుటుంబానికీ మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో శనివారం 16 బీసీ సంఘాల నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.లక్ష రుణం నాలుగు కులాలకే కాకుండా బీసీ జాబితాలో ఉన్న 129 కులాలకు మంజూరు చేయాలన్నారు. గత ఎన్నికలకు ముందు 2017లో రుణాలు ఇస్తామనీ, 5 లక్షలా 77 వేల మంది వద్ద దరఖాస్తులు తీసుకున్నారు. వీరికి వెంటనే రూ.లక్ష మంజూరు చేయాలి అని డిమాండ్ చేశారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ పోస్టులు ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు రుణాలు ఎవరి ద్వారా ఇస్తారన్నారు. ఈడీ పోస్టులు బీసీ కార్పొరేషన్ ఎండీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్పొరేషన్లకు చైర్మన్లు ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. ఏండ్లుగా బీసీలను నిర్లక్ష్యం చేశారన్నారనీ, అణిచివేశారనీ, కనీసం ఎన్నికల ముందు బీసీలకు రుణాలు ఇద్దామని ప్రభుత్వం ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. ప్రతి బీసీ కుటుంబానికి రుణాలు మంజూరు చేసి బీసీ బందు పథకం వెంటనే ప్రవేశపెట్టి రూ.10 లక్షలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్, రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, రాజేందర్, వేముల రామకృష్ణ గోరిగ మల్లేష్, పగిడాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్ టీటీడీలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హిమాయత్‌నగర్, లిబర్టీలోని తిరుమల తిరుపతి దేవస్థానములతో నిర్మించబడిన శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ హైదరాబాద్ తెలిపింది. ఈ మేరకు శనివారం టీటీడీ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను కమిటీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడ్వయిజరీ కమిటీ అధ్యక్షులు జి.వి.భాస్కర్ రావు, ఉపాధ్యక్షులు కొమిర వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయనీ, 27న ఉదయం ధ్వజారోహణం జరుగుతుందనీ, అనంతరం శేష వాహనంపై శ్రీపద్మావతి గోదాదేవి నమేత శ్రీవారి ఊరేగింపు జరుగుతుందనీ, సాయంత్రం 8 గంటలకు శ్రీహనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 28వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు, 10 గంటలకు స్నపన తిరుమంజనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, 29న గజ వాహనంపై శ్రీవారి ఊరేగింపు, 10 గంటలకు శాంతి కళ్యాణం, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై ఊరేగింపు, 30వ తేదీ ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగింపు, 31న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, 9 గంటలకు ధ్వజవరోహణం జరుగుతాయని వారు వివరించారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రూ.150 కోట్లతో వివిధ వైద కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ రమేష్ బాబు, కమిటీ సభ్యులు బి.వెంకటరమణ రెడ్డి, కె.భోజిరెడ్డి, ఆర్.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు మాదిరిగా ముస్లిం బంధు ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

దళిత బంధు మాదిరిగా ముస్లిం బందు వెంటనే ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫిరోజ్ ఖాన్ డిమాండ్ చేశారు శనివారం ఇందిరాపర్కు ధర్నా చౌక్ వద్ద ఆల్ పార్టీ పబ్లిక్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిస్థాయిలో విస్మరించిందన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీని అమలు చేయలేదన్నారు. మైనార్టీల సంక్షేమానికి స్వయం ఉపాధి పథకాలు అమలు చేయలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం బందు ప్రవేశపెట్టి ప్రతి ముస్లిం కుటుంబానికి రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆశలు మొలకెత్తిన కాలం

అధికార అహం నెత్తికెక్కిన మత్తులో
అభివృద్ధి ప్రణాళికలు మరిచి,
పూలదండను తెంపినట్టు
మనుషుల మధ్య స్నేహ బంధాలను తెంచి
పండుగ చేసుకోవాలని
పన్నాగాలు రచించేవాడు

అన్నదమ్ముల మధ్య అగ్గి రాజేసి
ఆ మంటల్లో సౌభ్రాతృత్వాన్ని కాల్చాలని
కలలుగన్నవాడు
అమృతాన్ని పంచుతున్నానని ఎంత మభ్యపెట్టినా
వాడి గిన్నెలోని విషాన్ని ఎంతకాలం దాచగలడు

మనసునిండా ముళ్ళనుదాచి



పువ్వు లెక్క నవ్వినా
కర కోరలు కనబడకుండా
ఆవు వేషంగట్టినా
వాని ముఖానికి పూసుకున్న
మోసపు రంగు వెలిసిపోయేలా

ఈ మండు వేసవిలో బంగాళా ఖాతం మీదుగా
విస్తరిస్తున్న ఉపరితల ద్రోణి కారణంగా

కర్ణాటక లో భారీ వర్షం కురిసింది

గుండెను గుండెతో జోడించే ప్రేమ వర్షం
భారత్ అంతా విస్తరించి
విస్తారంగా అభివృద్ధి పంటలు పండాలని
దేశం మదిలో ఆశలు మొలకెత్తున్నయ్!

- రహీమొద్దీన్, 9010851085

నవతెలంగాణ జోష్
YOUTH N YOUTH
ఆదివారం
21 మే 2023
www.navatelangana.com

చిన్ననాటి నుంచే అన్నింట చురుకు. బొమ్మలు గీసేవాడు. నటనతోనూ మెప్పించే వాడు. టెన్నిస్ ఆడేవాడు. ఈతలో మేటి. కానీ ఒక రోజు అతణ్ని.. నలుపు, తెలుపు రంగుల్లో ఉన్న 64 గళ్ల చెస్ బోర్డు ఆకర్షించింది. నాన్న పావులను కదుపుతున్న తీరు ఆసక్తి రేకెత్తించింది. ఆరేండ్ల వయసులో పావులు కదపడం నేర్చిన ఈ హైదరాబాదికీ...తరువాత చదరంగమే తన లోకమైంది. ఆటపై ఉన్న ప్రేమే ఇప్పుడతడ్ని గ్రాండ్‌మాస్టర్‌ను చేసింది. చదరంగ యువ సంచలనం ఉప్పల ప్రణీత్ పదిహేనేండ్ల వయసులోనే భారత 82వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు సాధించాడు. గత నెలలోనే మూడో జీఎం నార్మ్ దక్కించుకున్న ప్రణీత్.. తాజాగా 2500 ఎలో రేటింగ్ సాధించాడు. ప్రణీత్ విజయ సోపానం నేటి జోష్.



గ్రాండ్ మాస్టర్ ప్రణీత్



గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఆరేండ్ల వయసులోనే చెస్ ఆడడం మొదలెట్టాను. చిన్నప్పుడు టెన్నిస్ ఆడేవాణ్ని. ఈతంటే ఇష్టం. ఓ రోజు నాన్న చెస్ ఆడుతుంటే ఆసక్తిగా చూస్తూ ఉండిపోయాను. అది గమనించి అమ్మానాన్న ప్రోత్సహిం చారు. అండర్-7లో రాష్ట్ర ఛాంపియన్‌గా నిలవడంతో ఇక చదరంగాన్ని వదల్లేదు. 2015లో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ జీఎం టోర్నీలో 220ఎలో రేటింగ్ పాయింట్లు సాధించి ఒకే ఛాంపియన్ షిప్‌లో అత్యధిక పాయింట్లు గెలిచిన ఆటగాడిగా జాతీయ రికార్డు సృష్టించాను. దీంతో చెస్ ఆడగలను అన్న ఆత్మ విశ్వాసం మరింత పెరిగింది. అదే ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించాను. అప్పుడు సీఎం కేసీఆర్ అండగా నిలిచారు. వెన్నుతట్టి ప్రోత్సహించారు. 2018లో అండర్-11లో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలవడం నా కెరీర్‌లో గొప్ప మలుపు. కష్టపడితే ఆటలో అత్యున్నత శిఖరాలకు చేరుకోవచ్చని నిజంగా అప్పుడే నమ్మాను. అక్కడి నుంచి నా ఆటపై మరింత దృష్టి సారించాను. 2021లో అండర్-14 జాతీయ ఛాంపియన్‌గా నిలిచాను. ఆసియా దేశాల ఆన్‌లైన్ చెస్ టోర్నీలో స్వర్ణం సాధించా. నిరుడు ఆగస్టులో అంతర్జాతీయ మాస్టర్ (ఐఎమ్) హోదా సాధించాక జీఎంపై గురిపెట్టాను.

హైదరాబాద్‌కు మాకాం

మాది నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామం. ఆ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నాన్న శ్రీనివాసాచారి జీఎస్టీలో అసిస్టెంట్ కమిషనర్. అమ్మ ధనలక్ష్మి ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. విదేశాల్లో టోర్నీలు, నా శిక్షణ కోసం ఎంతో ఖర్చుపెడుతూనే ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు వచ్చినా.. నా కెరీర్ ఆగిపోవద్దనే ఉద్దేశంతో నాన్న ఓ ఫ్లాట్ కూడా అమ్మేశారు. కొన్నిసార్లు ఓటమి నిరాశ కలిగించినా.. విజయాల వైపు పట్టుదలతో ముందుకు సాగాను. కోచ్‌లు రవి, నరసింహారావు వద్ద ఓనమాలు నేర్చుకున్న నేను.. ఆ తరువాత 2021 వరకు ప్రముఖ కోచ్ ఎన్‌వీఎస్ రామరాజు సార్ అకాడమీలో చేరి చెస్‌పై పట్టు సాధించాను. ఆయన శిక్షణలోనే ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదా సాధించాను. ప్రస్తుతం ఇజ్రాయెల్ గ్రాండ్‌మాస్టర్ విక్టర్ మిఖిలెవస్కీ (ఇజ్రాయెల్) వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. ఆన్‌లైన్‌లో ఆడడం కంటే కూడా నేరుగా బోర్డుపై ఆడడామే నాకు ఇష్టం. బ్లిట్జ్, ర్యాపిడ్ కంటే క్లాసికల్ విభాగ మంటేనే నాకిష్టం. నీమన్ (అమెరికా)పై విజయం ఎప్పటికీ ప్రత్యేకమే. బలమైన ప్రత్యర్థిపై గెలుపుతో పాటు జీఎం హోదా కూడా దక్కింది. ఇక నా రేటింగ్‌ను 2800కు పెంచుకోవాలి. ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంతో పాటు ఒలింపియాడ్‌లో దేశానికి పతకం అందించడంలో కీలకపాత్ర పోషించాలన్నది నా లక్ష్యం.

ఆనంద్, కార్ల్‌సన్‌కు అభిమానిని..

చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సార్ ఆట చూస్తూ పెరిగాను. బాల్యం నుంచి ఆయనంటే ప్రత్యేకమైన అభిమానం, గౌరవం. విదేశీ ప్లేయర్లలో మాగ్నస్ కార్ల్‌సన్ ఆట శైలంటే నాకు చాలా ఇష్టం.

అందుకే ఇండియా టైమ్ ఫాలోకాను..

అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లు ఎక్కువగా యూరప్‌లోనే జరుగుతుంటాయి. కాబట్టి అందులో పాల్గొనడానికి, ఆ పోటీల కోసం సన్నద్ధ మవడానికి యూరప్ టైమ్‌నే ఫాలో అవుతుంటా. అందుకే ఇంట్లో అందరూ నిద్రపోతున్నప్పుడు మేల్కొని ఉంటా. వాళ్ల పనులు చేసుకుంటున్నప్పుడు విశ్రాంతి తీసుకుంటా. విదేశీ టోర్నీల్లో ఆడేప్పుడు అక్కడ వాతావరణం, కాలమానంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇక్కడున్నప్పుడు కూడా ఇండియా టైమ్ ఫాలో కాను. రోజూ 7 - 8 గంటలు సాధన చేస్తాను.

వరల్డ్ చాంపియన్ గా నిలుస్తా..

నా పదేళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కింది. కొవిడ్ లాక్‌డౌన్ లేకపోతే ఇంకా ముందు గానే జీఎం టైటిల్ సాధించే వాడిన్ని. మొత్తానికి నా స్వప్నం సాకారమైంది. నన్ను ఈ స్థాయికి చేర్చడానికి అమ్మానాన్న ఎంతో కష్టపడ్డారు. జీఎం టైటిల్ దక్కిందని తెలియగానే వాళ్లు ఎంతో సంతోషించారు. ఇన్నా ళ్లపడిన కష్టమంతా మర్చి పోయారు. కొంచెం విరామం తీసుకొని వచ్చే నెలలో జరిగే ఆసియా కాంటి నెంటల్ చెస్ పోటీలకు సిద్ధమవు తున్నాను. అంతిమంగా 2800 టాప్ ఎలో రేటింగ్ సాధించాను. వరల్డ్ చాంపియన్ కిరీటాన్ని సొంతం చేసుకోవాలనేదే నా లక్ష్యం. ఇందుకోసం మరింత శ్రమిస్తాను. ఈ విషయంలో ఇప్పుడిప్పుడే మెరు గవు తున్నాను. భారత్ నుంచి పలు వురు యువ ఆటగాళ్లు గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధి స్తుండటం ఈ ఆటకు ఎంతో మేలు చేస్తుంది. కజకిస్తాన్‌లో త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే నా తదుపరి లక్ష్యం.

అత్యున్నత స్థాయిలో పోటీ పడాలన్నా, మెరుగైన శిక్షణ తీసుకోవాలన్నా, విదేశాల్లో టోర్నీలు ఆడేందుకు వెళ్లాలన్నా చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. ఇప్పటికైతే ఆర్థికంగా ఆదుకోవడానికి నాకు స్పాన్సర్ లేరు. గ్రాండ్‌మాస్టర్ హోదా టైటిల్‌తో నాకు స్పాన్సర్‌లు లభిస్తారని ఆశిస్తున్నాను.

తెలంగాణ నుంచి..

భారత చెస్‌లో తెలంగాణ నుంచి గతంలో ఇరిగేశి అర్జున్ (2018), హర్ష భరతకోటి (2019), రాజా రిత్విక్ (2021), రాహుల్ శ్రీవాత్సవ్ (2022)ఈ ఘనత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే పెంటేల హరికృష్ణ (2001), హంపి (2002), హారిక (2011), లలిత్ బాబు (2012), కార్తీక్ వెంకటరామన్ (2018) గ్రాండ్‌మాస్టర్ హోదా పొందారు.



జీఎం హోదా ఖరారైంది ఇలా

- ఈ టోర్నీలో ప్రణీత్ నలుగురు గ్రాండ్‌మాస్టర్లు వహాప్ సనాల్ (తుర్కియే), వుగార్ అసాదిల్ (అజర్‌బైజాన్), లెవాన్ పాంత్సులయ (జార్జియా), నీమన్ (అమెరికా)లపై నెగ్గడంతో పాటు ఇస్కందరోవ్ (అజర్‌బైజాన్), నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.
- చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ హోదా రావాలంటే మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతో పాటు ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటాలి. ప్రణీత్ ఇప్పటికే మూడు జీఎం నార్మ్‌లు సంపాదించినా అతని ఎలో రేటింగ్ 2500 దాటలేకపోవడంతో జీఎం హోదా కోసం నిరీక్షించాల్సి వచ్చింది. అయితే బకూ ఓపెన్‌లో ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబరిచి తన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించడంతో అతనికి జీఎం హోదా ఖరారైంది. ప్రణీత్ తెలంగాణ నుంచి ఆరో జీఎం కావడం విశేషం.
- ప్రణీత్ తొలి జీఎం నార్మ్‌ను 2022 మార్చిలో ఫస్ట్ సాటర్‌డే టోర్నీలో, రెండో జీఎం నార్మ్‌ను 2022 జూలైలో బీల్ ఓపెన్ టోర్నీలో, మూడో జీఎం నార్మ్‌ను 2023 ఏప్రిల్‌లో సన్‌వే ఫార్మెన్‌టెరా ఓపెన్ టోర్నీలో సాధించాడు.
- ఈ టోర్నీలో తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి ప్రణీత్ 6 పాయింట్లతో ఆరో స్థానంలో నిలవగా, తెలంగాణకే చెందిన రాజా రిత్విక్ 20వ, హర్ష భరతకోటి 71వ స్థానంతో సరిపెట్టుకున్నారు.


రాష్ట్ర ప్రభుత్వ సహకారం

తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశాను. అప్పుడు సీఎం చెప్పిన మాటలు నాలో స్ఫూర్తి నింపాయి. దాదాపు పదిహేను నిమిషాల పాటు నాతో మాట్లాడి వివరాలు తెలుసుకొని భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. సీఎం మాటలు అందించి స్ఫూర్తితో ఈ రోజు గ్రాండ్‌మాస్టర్‌గా ఎదిగాను. సీఎం ప్రోత్సాహంతో మున్ముందు కూడా మరింతగా సత్తాచాటుతాను.

- మోహన్

మళ్ళీ కలుస్తావనే ఆశ...

ప్రేమలేఖలు Voice Of Love



ప్రియాతి ప్రియమైన నీకు,

ఎలా ఉన్నావు? నువ్వు బాగున్నావని అనుకుంటున్నాను. బాగుండాలని, నీ జీవితంలోని ప్రతి క్షణం సంతోషంగా గడవాలని మనసారా కోరుకుంటున్నాను. నిన్ను కలవక నీతో మాట్లాడక చాలా రోజులవుతుంది. మనమిద్దరం కలిసి ఒకరి కళ్ళలో ఒకరం చూసుకుంటూ చేతులు పట్టుకొని మాట్లాడుకుంటూ నడిచి దాదాపుగా రెండు సంవత్సరాలు అవుతుంది. హైదరాబాద్ నగరవీధులలో గంగా జమున తెహజీబ్లా మనం మాట్లాడుతూ చార్మినార్ దగ్గర నుంచి మదీనా వైపుగా నడుచుకుంటూ వెళ్తూ ఒక ప్రవాహంలా మాట్లాడము గుర్తుందా..!! మళ్ళీ అలా మాట్లాడుకుందాం అప్పుడైనా మన మధ్య ఏర్పడ్డ ఈ అపార్థపు తెరలు తొలిగిపోతాయి. నీకు గుర్తుందో లేదో కానీ ఆరోజు సికింద్రాబాద్ హోటల్లో కూర్చొని తింటున్నప్పుడు ఎంత ప్రేమగా మాట్లాడావు.. నువ్వు మాట్లాడిన మధురాతి మధురమైన మాటలు నువ్వు ప్రేమతో చూసిన ఆ చూపులు జ్ఞాపకాలైపోయాయి. అవి నా మదిలో మెదిలిన ప్రతిసారి మళ్ళీ అలాంటి రోజు రావాలని అనిపిస్తుంటుంది. నువ్వు నా పక్కన ఉన్నప్పుడు వర్తమానంలో ఉండలేకపోయా వర్తమానం గతమైపోయిన తర్వాత గతపు జ్ఞాపకాల దారుల్లో తిరుగుతున్నాను. మనమిద్దరం కలిసున్నప్పుడు కోపాలు, తాపాలు, చిన్న చిన్న విషయాలకే గిల్లికజ్జాలు, అలగడాలు.. అవ్వన్నీ ప్రేమలోనైనా ఏ బంధంలోనైనా మామూలే. ఇప్పుడు ఆ చేష్టలు గుర్తొస్తే భలే నవ్వొస్తుంది. నువ్వన్నట్టు నిజంగానే అంతలా అన్మెచ్యూర్గా ప్రవర్తించానా..! నువ్వు నన్ను డ్రామా రాజా అన్నావు కదా... నిజంగా అంతలా డ్రామా క్రియేట్ చేశానా...!! ఏది ఏమైనా మనిద్దరి మధ్య ఏర్పడ్డ ఈ దూరం నా హృదయాన్ని బాధపెడుతుంది. ప్రతిక్షణం వేడి వేడి నిట్టూర్పులు... నా కాళ్ళ కింద భూమి కంపించినట్టు, ఆకాశం బద్దలై నా మీద అగ్ని వర్షం కురిసినట్టు అనిపిస్తుంది. ప్రేమంటే ఇదేనా? దూరం బాధపెడుతుందా? కాదు కానే కాదు. ప్రేమ, మనిద్దరి మధ్య ఏర్పడ్డ దూరం 40 శాతం బాధపెడుతుంది. దీని కన్నా నువ్వు నా మీద మోపిన నిందలు, నాతో మాట్లాడకుండా అపార్థం చేసుకొని నన్ను దూరం పెట్టావు కదా...! అదిగో ఆ నింద ఆ దూరం ఎక్కువగా బాధపెడుతుంది. నువ్వు ఏదైతే అనుకున్నావో అది నిజం కాదు. నువ్వు ఏదైతే అనుకోలేదో అది నిజం. ఈ విభజించబడ్డ విభజించబడుతున్న సమాజంలో కులం,మతం, దేశ సరిహద్దులు మనుషుల మధ్య ఒక కంచెలా ఉంటాయి. ఇవి రెండు వైపులా పదునున్న కత్తుల్లా పనిచేస్తాయి. మన మధ్య దీంట్లో నుంచి ఏది అడ్డొచ్చిన దాన్ని తొలిగించి నీకు, నీ అభిమానానికి, నీ స్నేహానికి, నీ ప్రేమకు చేరువవుతాను. ఎంత స్వార్థం ముజాహిద్ అంటావా..! అవును ఇది స్వార్థమే స్వార్థంలా కనబడే నిస్వార్థం. నువ్వు నా వల్ల సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. నా వల్లే నువ్వు అభివృద్ధి చెందాలని అనుకుంటున్నాను. ఇంత క్లారిటీగా చెప్పిన నువ్వు అపార్థం చేసుకుంటే ఇక నేనేం చేయలేను. కేవలం క్రిష్ణున్ని ఆరాధించే మీరాబాయిలా, రాధను మనస్ఫూర్తిగా ప్రేమించే క్రిష్ణునిలా నిన్ను జీవితాంతం ప్రేమిస్తుంటాను. ఇంకా చాలా రాయాలని ఉంది కానీ నీ ముందు నిలబడినప్పుడు నా నోరు ఎలా అయితే పెగలదో ఇప్పుడు ప్రేమైక భావోద్వేగం నా మనసును బలహీనున్ని చేసింది అందుకే నా మనసులోని భావాన్ని సరిగ్గా చెప్పలేకపోతున్నాను. మళ్ళీ ఇంకో ఉత్తరం రాస్తాను. ఇక ఉంటాను. చెరగని చిరునవ్వుతో నీ మోము ఎప్పుడూ కళకళలాడాలని కోరుకుంటున్నాను. ఎప్పుడైనా ఏదైనా కష్టం వస్తే ఈ కష్టం తీరిపోతుంది. సుఖం చేరువవుతుందని అనుకో నువ్వు అనుకున్నట్టే జరుగుతుంది. నేను రాసే కవిత్వమంటే నీకు ఇష్టం కదా... నీ కోసం ఓ కవిత్వం రాసాను. నీ హృదయాన నిలుపుకో శరీరంలోని ఆత్మ నీటి నుంచి విడిపడ్డ చేపలా నీ గురించి ఆలోచిస్తూ నీ కోసమే తల్లడిల్లుతుంది. వేసవికాలపు అకాల వర్షంలానైనా చిరునవ్వుతో నాకు చేరువవ్వవా..! నీ పెదవుల నుంచి వచ్చే ప్రతి శబ్దం నన్ను నిత్య యవ్వనంలోకి తీసుకువెళ్ళి మొఖాన్ని చిరునవ్వుతో ముద్దెడుతుంటుంది. ఒక్క సారి సానుభూతితో కాకుండా ప్రేమ నిండిన హృదయంతో పిలిచి చూడు, నా ప్రతి అణువు పులకించి పోతుంది. నువ్వు ఎంత దూరం జరగినా నా హృదయంలో నిలిచే ఉంటావు... నీ చుట్టూ నువ్వు ఎంత గిరిగీసుకున్న నా ఊహలలో విహరిస్తునే ఉంటావు... నేనేం చేసానని, అనర్హున్నైన నన్ను ఈ మానసిక శిక్షకు అర్హున్ని చేసేసి జీవమున్న శవంలా మార్చావు? ఈ మానసిక శిక్షా సంకెళ్ల నుంచి విముక్తిని ప్రసాదించి నన్ను నీ హృదయాన నిలుపుకో.. నా ఈ ఉత్తరానికి ప్రత్యుత్తరం రాస్తావని... ఆ ప్రత్యుత్తరంలో నేను రాసిన కవిత్వం మీద నీ అభిప్రాయాన్ని తెలియజేస్తావని. మనిద్దరి మధ్య ఏర్పడ్డ ఈ అపోహల అపార్థాలు చెరిగిపోయి మళ్ళీ నువ్వు నాతో మాట్లాడాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

నిన్ను నిన్నుగా ప్రేమించే నేను నీ

సయ్యద్ ముజాహిద్ అలీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్‌కింగ్స్ హవా కొనసాగుతుంది. ఎం.ఎస్ ధోని సారథ్యంలో ఆ జట్టు మరోసారి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 77 పరుగుల తేడాతో గెలుపొందిన ధోనీసేన.. పాయింట్ల పట్టికలో టాప్-2 స్థానం పదిలం చేసుకుంది. గుజరాత్ టైటాన్స్‌తో క్వాలిఫయర్ 1 సమరానికి రంగం సిద్ధం చేసుకుంది. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న జట్టుగా చెన్నై సూపర్‌కింగ్స్ ఎదురులేని రికార్డు నమోదు చేసింది!.

చెన్నై ఛమక్

- 77 పరుగులతో ఢిల్లీపై గెలుపు
- టాప్-2లో సూపర్‌కింగ్స్‌కు చోటు

రుతురాజ్, డెవాన్ కాన్వే ధనాధన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

చెన్నై సూపర్‌కింగ్స్ సూపర్ ప్రదర్శన చేసింది. లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 77 పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ విజయంతో ప్లే ఆఫ్స్‌లో చోటుతో పాటు టాప్-2లో నిలిచి ఫైనల్స్‌కు చేరుకునే ప్రక్రియను మెరుగుపర్చుకుంది. డెవాన్ కాన్వే (87, 52 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (79, 50 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీలతో చెలరేగారు. ఓపెనర్ల వీరంగంతో తొలుత చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 223 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ డెవిడ్ వార్నర్ (86, 58 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. సూపర్‌కింగ్స్ పేసర్ దీపక్ చాహర్ (3/22), స్పిన్నర్ మహీశ్ తీక్షణ (2/23) మ్యాజిక్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులకే పరిమితమైంది. రుతురాజ్ గైక్వాడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. సీజన్లో తొమ్మిదో పరాజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఓపెనర్ల వీరంగం

టాస్ నెగ్గిన సూపర్‌కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (87), రుతురాజ్ గైక్వాడ్ (79) అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు ఏకంగా 141 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. పవర్‌ప్లేలో 52/0తో నిలిచిన చెన్నై.. ఆ తర్వాత అదే దూకుడు కొనసాగించింది. మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో రుతురాజ్ గైక్వాడ్ అర్థ సెంచరీ పూర్తి చేయగా.. మరో ఎండ్‌లో కాన్వే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 33 బంతుల్లో హాఫ్ సెంచరీ కొట్టాడు. ఓపెనర్లు ఇద్దరూ వికెట్‌కు ఇరువైపులా ఎడాపెడా బౌండరీలు బాదటంతో 11.2 ఓవర్లలోనే చెన్నై 100 పరుగుల మార్క్ తాకింది. ఓపెనర్ల నిష్క్రమణ తర్వాత శివం దూబె (22, 9 బంతుల్లో 3 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (20 నాటౌట్, 7 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అదిరే ముగింపు అందించారు. దూబె మూడు సిక్సర్లు బాదగా.. జడేజా మూడు ఫోర్లతో సూపర్‌కింగ్స్‌కు భారీ స్కోరు అందించారు. ఎం.ఎస్ ధోని (5 నాటౌట్) క్రీజులోకి వచ్చి అభిమానుల్లో ఉత్సాహం నింపాడు. క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్, నోకియా, సకారియలు తలా ఓ వికెట్ తీసుకున్నారు.

క్యాపిటల్స్ చతికిల

224 పరుగుల భారీ ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చతికిల పడింది. దీపక్ చాహర్, తుషార్ దేశ్‌పాండే దెబ్బకు పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు చేజార్చుకున్న క్యాపిటల్స్.. ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఓ ఎండ్‌లో కెప్టెన్ డెవిడ్ వార్నర్ (86) అర్థ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. పృథ్వీ షా (5), ఫిల్ సాల్ట్ (3), రిలీ రొసో (0), యశ్ ధుల్ (13), అక్షర్ పటేల్ (15), అమన్ హాకీం ఖాన్ (7), లలిత్ యాదవ్ (6) విఫలమయ్యారు. దీపక్ చాహర్ (3/22) మూడు వికెట్లు పడగొట్టగా.. మహీశ్ తీక్షణ (2/23), మతీశ మతిరణ (2/22) రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ 146 పరుగులే చేయగా..77 పరుగుల తేడాతో చెన్నై గెలుపొందింది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ : రుతురాజ్ గైక్వాడ్ (సి) రొసో (బి) సకారియ 79, డెవాన్ కాన్వే (సి) హకీం ఖాన్ (బి) నోకియా 87, శివం దూబె (సి) లలిత్ (బి) ఖలీల్ అహ్మద్ 22, ధోని నాటౌట్ 5, జడేజా నాటౌట్ 20, ఎక్స్‌ట్రాలు :10, మొత్తం : (20 ఓవర్లలో 3 వికెట్లకు) 223.

వికెట్ల పతనం : 1-141, 2-195, 3-195.

బౌలింగ్ : ఖలీల్ అహ్మద్ 4-0-45-1, లలిత్ యాదవ్ 2-0-32-0, అక్షర్ పటేల్ 3-0-32-0, నోకియా 4-0-43-1, కుల్దీప్ యాదవ్ 3-0-34-0.

ఢిల్లీ క్యాపిటల్స్ : పృథ్వీ షా (సి) రాయుడు (బి) తుషార్ 5, డెవిడ్ వార్నర్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 86, ఫిల్ సాల్ట్ (సి) రహానె (బి) చాహర్ 3, రిలీ రొసో (బి) చాహర్ 0, ధుల్ (సి) తుషార్ (బి) జడేజా 13, అక్షర్ పటేల్ (సి) రుతురాజ్ (బి) చాహర్ 15, హకీం ఖాన్ (సి) అలీ (బి) పతిరణ 6, నోకియా నాటౌట్ 0, కుల్దీప్ యాదవ్ (ఎల్బీ) తీక్షణ 0, చేతన్ సకారియ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (20 ఓవర్లలో 9 వికెట్లకు) 146.

వికెట్ల పతనం : 1-5, 2-26, 3-26, 4-75, 5-109, 6-131, 7-144, 8-146, 9-146.

బౌలింగ్ : దీపక్ చాహర్ 4-0-22-3, తుషార్ దేశ్‌పాండే 4-0-26-1, మహీశ్ తీక్షణ 4-1-23-2, రవీంద్ర జడేజా 4-0-50-1, మతీశ పతిరణ 4-0-22-2.

జ్యోతి సురేఖ పసిడి గురి

- ప్రవీణ్‌తో కలిసి మిక్స్‌డ్ పసిడి సొంతం
- 2023 ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2



షాంఘై (చైనా) : తెలుగు తేజం వెన్నం జ్యోతి సురేఖ ఈ ఏడాది ప్రపంచకప్ వేదికగా మరో పసిడి పతకం సాధించింది. చైనాలోని షాంఘైలో జరుగుతున్న 2023 ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ పసిడి పతకం సొంతం చేసుకుంది. జ్యోతి సురేఖ, ప్రవీణ్ ఓజాస్ జంట శనివారం జరిగిన పసిడి పోరులో వరల్డ్ నం.1 దక్షిణ కొరియా జోడీపై మెరుపు విజయం నమోదు చేసింది. యువ ఆర్చర్ ప్రవీణ్ ఆరంభంలో వరుస 9 స్కోర్లతో తడబడినా.. కీలక సమయంలో పర్‌ఫెక్ట్ 10 స్కోర్లతో రాణించాడు. తొలి రౌండ్లో 39-39, రెండో రౌండ్ అనంతరం 78-78, మూడో రౌండ్ అనంతరం 117-117తో స్కోర్లు సమంగా ఉన్నాయి. నాల్గో రౌండ్లో కొరియా జోడీ 38 పాయింట్లు సాధించగా.. సురేఖ అద్భుత 10 పాయింట్ల గురితో భారత్ 39 పాయింట్లు సొంతం చేసుకుంది. ఓవరాల్‌య 156-155తో కొరియా ఆర్చర్లపై భారత జోడీ సురేఖ, ప్రవీణ్‌లు మెరుపు విజయం నమోదు చేశారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 1లోనూ వెన్నం జ్యోతి సురేఖ ఈ విభాగంలో పసిడి పతకం సాధించిన సంగతి తెలిసిందే. తెలుగమ్మాయి జ్యోతి సురేఖకు ఆర్చరీ ప్రపంచకప్‌లో ఇది ఏకంగా నాల్గో మెడల్ కావటం విశేషం. ఇక వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్ జాకర్ వరల్డ్ నం.1 మైక్‌ను మట్టికరిపించి స్వర్ణం సాధించగా.. అవనీత్ కౌర్ మహిళల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించింది. సీనియర్ ప్రపంచకప్ స్థాయిలో అవనీత్ కౌర్‌కు ఇదే తొలి పతకం.

ఇటలీ క్లబ్‌తో బ్లాక్‌హాక్స్ జట్టు

పల్లవోలో పడోవాతో భాగస్వామ్యం



హైదరాబాద్ : ప్రైమ్ వాలీబాల్ లీగ్ ప్రాంఛైజీ హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ విదేశీ క్లబ్‌తో జతకట్టింది. ప్రైమ్ వాలీబాల్ తొలి రెండు సీజన్లలో అద్భుత ప్రదర్శన కనబరిచిన బ్లాక్‌హాక్స్.. రానున్న సీజన్లో టైటిల్ విజయమే లక్ష్యంగా వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇటలీకి చెందిన ప్రముఖ యూరోపియన్ వాలీబాల్ క్లబ్ పల్లవోలో పడోవా తో బ్లాక్‌హాక్స్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో బ్లాక్‌హాక్స్ ఆటగాళ్లు ఇటలీలోని పల్లవోలో పడోవా క్లబ్‌లో శిక్షణ పొందనున్నారు. ఇక హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సొంతంగా నాణ్యమైన శిక్షణ వ్యవస్థను తయారు చేసుకునేందుకు అవసరమైన సహకారం పల్లవోలో పడోవా అందించనుంది. పల్లవోలో పడోవా క్లబ్ కోచ్‌లు హైదరాబాద్‌లో శిక్షణ శిబిరంలో తరగతులు తీసుకోనున్నారు. 'ప్రతిభావంతులైన యువత అంతర్జాతీయ స్థాయి పోటీకి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఉన్నత స్థాయి మౌళిక వసతులు, నాణ్యమైన ప్రపంచ శ్రేణి శిక్షణ అవసరం. పల్లవోలో పడోవా తో ఒప్పందం అందులో భాగమే' అని బ్లాక్‌హాక్స్ యజమాని అభిషేక్ రెడ్డి తెలిపారు.

జిమ్నాస్ట్ దీపపై సాయ్ అభ్యంతరం!

నేషనల్ క్యాంప్ ప్రాబబుల్స్ నుంచి తొలగింపు



న్యూఢిల్లీ : రియో ఒలింపిక్స్‌లో పతకం తృటిలో చేజార్చుకున్నప్పటికీ, అద్భుత విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్న జిమ్నాస్ట్ దీప కర్మాకర్. డోప్ పరీక్షలో విఫలమైన దీప కర్మాకర్ ప్రస్తుతం 21 నెలల సస్పెన్షన్‌లో ఉంది. రానున్న ఆసియా చాంపియన్‌షిప్స్, ఆసియా క్రీడలు సహా ఇతర అంతర్జాతీయ టోర్నీలకు జాతీయ శిక్షణ శిబిరం ఏర్పాటుకు జాతీయ జిమ్నాస్టిక్ సమాఖ్య ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసింది. ప్రాబబుల్స్ జాబితాను సాయ్‌ను పంపించి, నేషనల్ క్యాంప్‌కు నిధులు మంజూరు చేయాలని కోరింది. అయితే ప్రాబబుల్స్‌లో దీప కర్మాకర్‌కు చోటు కల్పించటంపై సాయ్ ఉన్నతాధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) నుంచి నిషేధం ఎదుర్కొంటున్న దీప కర్మాకర్ నేషనల్ క్యాంప్‌కు దొడ్డిదారిన ఎంపికైనట్టు సాయ్ భావించింది. దీంతో జిమ్నాస్టిక్స్ సమాఖ్య ప్రాబబుల్స్ నుంచి దీప కర్మాకర్ పేరును తొలగించింది. ఇదిలా ఉండగా, ఐటీఏ నిబంధనల ప్రకారం దీప కర్మాకర్ జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యేందుకు అర్హురాలు. దీప కర్మాకర్ నిషేధం ఈ ఏడాది జులైలో ముగియనుంది. అందుకు రెండు నెలల ముందుగానే జాతీయ జట్టుతో కలిసి శిక్షణలో పాల్గొనేందుకు నిబంధనలు అనుమతిస్తున్నాయి. రూల్ 10.14.2 రిటర్న్ టు ట్రైనింగ్ కింద ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. రూల్స్ ప్రకారం దీపను ఎంపిక చేసినా.. ఆమెపై సాయ్ అభ్యంతరం వ్యక్తం చేయటం పట్ల జిమ్నాస్టిక్స్ వర్గాల్లో చర్చ నడుస్తుంది.

అస్సాంలో సాయ్ సెంటర్ చీఫ్ ఆగడాలు

మహిళా అథ్లెట్లపై లైంగిక వేధింపులు



కోల్‌కత : ఓవైపు భారత అగ్రశ్రేణి రెజ్లింగ్ క్రీడాకారులు లైంగిక వేధింపులకు పాల్పడిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) లోక్‌సభ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నాలుగు వారాలుగా ఆందోళన చేస్తుండగా.. అస్సాంలోని సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సెంటర్ ఇన్‌చార్జి మహిళా అథ్లెట్లను లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

మృనాల్ బసుమతారి స్విమ్మింగ్ కోచ్ కాగా.. ప్రస్తుతం సొలాల్‌గోన్‌లోని సాయ్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్‌టీసీ) ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. మహిళా అథ్లెట్లను లైంగిక వేధింపులకు గురి చేస్తుండటంతో తొలుత వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ ఫిర్యాదు చేసింది. తాజాగా ఓ మహిళా రెజ్లింగ్ కోచ్ సైతం ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. 'గురువారం మధ్యాహ్నం లైంగిక వేధింపులపై ఫిర్యాదు అందింది. వెంటనే పాల్టన్ పోలీసు స్టేషన్‌లో మృనాల్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేశామని' సాయ్ రీజినల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యజిత్ తెలిపారు.

మహిళా అథ్లెట్లు, కోచ్‌లు ఫిర్యాదు చేసినా.. మృనాల్‌పై ఇప్పటివరకు శాఖపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అతడిపై సాయ్ అధికారులు సస్పెన్షన్ విధించలేదు. మృనాల్‌పై ఫిర్యాదు చేసిన వారిలో అధికశాతం మైనర్ అథ్లెట్లు ఉండటం శోచనీయం.

నవచిత్రం

ఆద్యంతం వినోద భరితం..

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రూల్స్ రంజన్'. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో స్టార్‌లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళికృష్ణ వేమూరి నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కి విశేష స్పందన లభించింది. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన 'నాలో నేనే లేను' లిరికల్ వీడియోకి సైతం అద్భుత రెస్పాన్స్ రావడం పట్ల చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. తన ప్రేమను కథానాయికకి చెప్పడం కోసం కథానాయకుడు పడే తపనని ఈ పాటలో అద్భుతంగా చూపించారు. అమ్రిష్ గణేష్ స్వరపరిచిన సంగీతం వినసొంపుగా, ఆహ్లాదకరంగా ఉంది. సంగీతానికి తగ్గట్టుగానే రాంబాబు గోసాల అందించిన సాహిత్యం ఎంతో హాయిగా, స్వచ్ఛంగా ఉంది. అందరికీ అర్థమయ్యే భాషలో ఎంతో అర్థవంతంగా పాటను రాశారు.




కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి

ఇక శరత్ సంతోష్ ఎంతో అందంగా పాటను ఆలపించారు. ఇవన్నీ ఈ పాటను ప్రేక్షకులకు చేరవయ్యేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయని మేకర్స్ తెలిపారు.

గీత రచయిత రాంబాబు గోసాల మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో 'నాలో నేనే లేను' అనే పాట రాసినందుకు చాలా సంతోషంగా ఉంది. మా దర్శకులు రత్నం కృష్ణ చాలా మంచి సందర్భాన్ని వివరించారు. చాలా అందమైన చిన్న చిన్న పదాలతో తన ప్రేమని కథానాయికకి తెలియజేయడం కోసం కథానాయకుడు పడే తపన ఈ పాటలో చెప్పాం. అలాగే చరణాలను కవితాత్మకంగా చెప్పాం. అందరూ అదరించి ఈ పాటను పెద్ద హిట్ చేశారు. అలాగే ఈ సినిమా కూడా చాలా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'వినోదమే ప్రధానంగా ఈ చిత్రం రూపొందుతోంది. హీరో కిరణ్ అబ్బవరం గత చిత్రాలకు, ఇమేజ్‌కు భిన్నంగా ఈ చిత్రం సరికొత్తగా ఉండటంతో పాటు, పూర్తి స్థాయి వినోదభరిత కథాచిత్రమిది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై నెలలో చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అని దర్శక, నిర్మాతలు చెప్పారు.


పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్



శివ కార్తికేయన్

కోలీవుడ్ కథానాయకుడు శివ కార్తికేయన్, మడోన్ అశ్విన్ కాంబోలో చేస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మహావీరుడు'. ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివ కార్తికేయన్‌కు జోడిగా అదితి శంకర్ నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్ర తెలుగు రైట్స్‌ని ఏసియన్ సినిమాస్ సొంతం చేసుకుంది. ఏసియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడుదల కానుంది. ఈ చిత్రానికి విధు అయ్యన్న సినిమాటోగ్రఫీ అందిస్తుండగా భరత్ శంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పని చేస్తున్న ఈ చిత్రానికి కుమార్ గంగప్పన్ ఆర్ట్ డైరెక్టర్. జూలై 14న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది

అంచనాలు పెంచిన ఆదికేశవ



పంజా వైష్ణవ్ తేజ్

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణ సంస్థలు పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. పంజా వైష్ణవ్ తేజ్ తన కెరీర్‌లో తొలిసారి యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని చేస్తుండటం విశేషం. ఆయన కెరీర్‌లో నాలుగో చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'ఆదికేశవ' అనే పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేసిన విషయం విదితమే.

ఈ సినిమా ప్రపంచాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ ఇటీవల చిత్ర బృందం రిలీజ్ చేసిన ఓ భారీ యాక్షన్ ప్యాక్డ్ గ్లింప్స్ అందర్నీ అలరించడంతోపాటు సినిమాపై అంచనాలనూ పెంచింది. ఈ గ్లింప్స్‌లో పంజా వైష్ణవ్ తేజ్ 'రుద్ర'గా పరిచయం అయ్యాడు. ఒక చిన్న గ్రామంలో గూండాలు శివాలయాన్ని ఆక్రమించాలని చూస్తుండగా, రుద్ర వారిని అడ్డుకోవాలనుకుంటాడు.

అయితే ఈ గొడవ ఎక్కడికి దారి తీసింది?, ఆ తర్వాత ఏం జరిగింది? అనే ఆసక్తిని కలిగించేలా గ్లింప్స్ ఉంది. రుద్రగా పంజా వైష్ణవ్ తేజ్ ఉగ్రరూపం చూపించారు. అందమైన చిత్ర పాత్రలో శ్రీలీల నటిస్తుండగా, వజ్ర కాళేశ్వరి దేవిగా అపర్ణా దాస్ కనిపించనున్నారు. ప్రముఖ మలయాళ నటుడు జోజు జార్జ్ ఈ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. ఇందులో ఆయన అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జూలై నెలలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

మళ్ళీ పెళ్లి రిలీజ్‌కి రెడీ

నరేష్ వి.కె, పవిత్ర లోకేష్ జంటగా రూపొందుతున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'.యూనిక్ కథతో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కి ఎంఎస్ రాజు రచన, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ కృష్ణ మూవీస్ బ్యానర్‌పై నరేష్ స్వయంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఫస్ట్‌లుక్, గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి కావేరి గాలిలా పాటని విడుదల చేశారు. సురేష్ బొబ్బిలి ఈ పాటని మనసుని హత్తుకునే మెలోడియస్ ట్యూన్‌గా కంపోజ్ చేశారు. నరేష్ అయ్యర్ ఆలపించిన ఈ పాటకు అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పాటలో నరేష్, పవిత్ర లోకేష్‌ల కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. జయసుధ, శరత్‌బాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు నటిస్తున్నారు. ఈనెల 26న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ఎంఎస్ రాజు, డీవోపీ: ఏంఎన్ బాల్ రెడ్డి, ఎడిటర్: జునైద్ సిద్ధిక్, ప్రొడక్షన్ డిజైనర్: భాస్కర్ ముదావత్.



నరేష్, పవిత్ర లోకేష్

భిన్న కథ..

లక్కీ మీడియా, మహారాజా క్రియేషన్స్ బ్యానర్స్ పై సుడిగాలి సుధీర్, దివ్య భారతి జంటగా, 'పాగల్' ఫేమ్ దర్శకుడు నరేష్ కుప్పిలి దర్శకత్వంలో చంద్ర శేఖర్ రెడ్డి మొగుళ్ళ, బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్న చిత్రాన్ని 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్) అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను గ్రాండ్‌గా విడుదల చేసింది చిత్ర బృందం.



సుడిగాలి సుధీర్


ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న మా సినిమా శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా మా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. మేం విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు విడుదల చేసిన కొద్ది నిమిషాల్లోనే ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా హ్యాపీగా ఉంది. సినిమాకు తగ్గట్టే లియో మంచి మ్యూజిక్ అందిస్తున్నారు. మంచి కథతో వస్తున్న మా సినిమాను ప్రేక్షకులందరూ సపోర్ట్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం' అని అన్నారు. 'ఇలాంటి మంచి కాన్సెప్ట్ ఉన్న కథను చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు' అని దర్శకుడు అన్నారు.

మెప్పించే టక్కర్

హీరో సిద్ధార్థ్ త్వరలోనే 'టక్కర్' సినిమాతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది.

'సాధారణంగా సిద్ధార్థ్ సినిమాలలో ప్రేమ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే ఈ సినిమాలో ప్రేమ సన్నివేశాలతో పాటు ఉత్కంఠను రేపేలా అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు కూడా ఉండనున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రొమాన్స్, యాక్షన్ మేళవింపుతో రూపొందిన ఈ టీజర్ సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ సినిమా నుంచి విడుదలైన 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం' పాటలు కూడా విశేష ఆదరణ పొందాయి. కథానాయిక స్వభావాన్ని తెలియజేసేలా, ప్రకృతి అందాల నేపథ్యంలో చిత్రీకరించిన 'కయ్యాలే' పాట కట్టిపడేసింది. నాయకానాయికల ఘాటు ప్రేమను తెలిపేలా సాగిన 'పెదవులు వీడి మౌనం' పాట మనసు దోచేసింది. ఇలా పాటలు, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి రోజురోజుకి పెరుగుతోంది. ఈ చిత్రంతో సిద్ధార్థ్ మరో భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే అంచనాలున్నాయి.

ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ప్రేక్షకులను ఆకట్టుకొని ఘన విజయం సాధించి, సిద్ధార్థ్ కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా అవుతుందని చిత్ర బృందం ఎంతో నమ్మకంగా ఉంది. ఈ సినిమాలో అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



దివ్యాంశ కౌశిక్, సిద్ధార్థ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.